ఆంధ్రప్రదేశ్ శాసనసభ

గురువారం, మార్చి 20, 2025

(సభ ఉ.9.00 గం.లకు ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానం వహించారు)

* * *

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): 15వ రోజు సమావేశానికి విచ్చేసిన గౌరవ సభ్యులందరికీ స్వాగతం. గౌరవ సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌గారు తియ్యటి బహుమతిని సంగం డెయిరీ తరఫున పంపారు. ఆ బహుమతిని సభ్యులు ఎమ్.ఎస్. సెక్షన్ నుండి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. ఇప్పుడు ప్రశ్నోత్తరాల సమయం. ప్రశ్న నం.687

<u>ప్రశ్నోత్తరాలు (QUESTION HOUR)</u>

ఆయకట్టు స్థిరీకరణ
STABILIZATION OF AYACUT

ప్రశ్న నం.687(121)

సర్వశ్రీ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్యేలు

SARVASRI DAGUMATI VENKATA KRISHNAREDDY, PRATHIPATI PULLARAO, GORANTLA BUTCHAIAH CHOUDARY, MLAs

గౌరవనీయులైన జలవనరుల అభివృద్ధిశాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలిపెదరా;

అ) రాష్ట్రంలో గల ఆయకట్టు వివరాలు ఏమి;

ఆ) గతంలో స్థిరీకరించిన ఆయకట్టు వివరాలు ఏమి;

ఇ) భూమి మార్పిడి చట్టం అమలు, సెజ్‌లు, పరిశ్రమలకు భూముల కేటాయింపు తరవాత మిగిలిన ఉన్న ఆయకట్టు వివరాలు ఏమి?

గౌరవనీయులైన జలవనరుల అభివృద్ధిశాఖ మంత్రి (డా. నిమ్మల రామానాయుడు):

HON'BLE MINISTER OF WATER RESOURCES DEVELOPMENT (DR.NIMMALA RAMANAIDU):

ఎ)	రంగం	ఆయకట్టు (లక్షల ఎకరాలు)
	ప్రధాన తరహా సాగునీరు	67.02
	మధ్యతరహా సాగునీరు	5.62
	చిన్నతరహా సాగునీరు	25.60
	ఏపీఎస్ఐడీసీ	8.59
	మొత్తం	106.83

బి)	రంగం	ప్రారంభం నుండి 01/2025 చివరివరకు ఎకరాలలో ఆయకట్టు స్థిరీకరణ
	ప్రధాన సాగునీరు ప్రాజెక్టులు	27,49,030
	ఆధునీకరణ	82,800
	మధ్యస్థ సాగునీరు ప్రాజెక్టులు	1,53,555
	మొత్తం	29,85,385
సి)	భూ పరిరక్షణ చట్టం అమలు, సెజ్‌లు, పరిశ్రమలకు భూమి కేటాయింపు చేసిన తరవాత 105.94 లక్షల ఎకరాల ఆయకట్టు మిగిలి ఉంది.	

శ్రీ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (SRI DAGUMATI VENKATA KRISHNAREDDY) (కావలి): అధ్యక్షా, ధన్యవాదాలు. స్వాతంత్ర్యానికి ముందు, తరవాత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి దాదాపు 27 ఇరిగేషన్ ప్రాజెక్టులు, డ్యాంలు, బ్యారేజీలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు చాలా ఉన్నాయి. ఈరోజు 943 టీఎంసీల నీళ్లు నిలువ చేసే కెపాసిటీ ఉండే ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ డ్యాం నిర్మాణం జరిగినప్పుడు స్థిరీకరించి స్టెబిలైజ్ చేసిన ఆయకట్టునే రికార్డుల్లో కొనసాగిస్తున్నారు. తరవాత ప్రభుత్వ అవసరాలకు, పరిశ్రమలకు, సెజ్‌లు, రోడ్ల కోసం ల్యాండ్ తీసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాళ్ల వ్యాపారం కోసం ల్యాండ్ తీసుకున్నారు. పోర్టులు వచ్చాయి. ఈరోజు రకరకాల అవసరాల కోసం ఇరిగేషన్ ల్యాండ్‌ని ప్రభుత్వాలు, ప్రైవేటు వ్యక్తులు తీసుకున్నప్పుడు ఆ ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్, 2006 కింద వ్యవసాయేతర భూమిగా మార్చారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చినప్పుడు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న ల్యాండ్స్ ఆయకట్టు తగ్గించాల్సింది పోయి ఇప్పటికీ ప్రభుత్వ లెక్కల ప్రకారం కన్వర్షన్ అయిన భూమిని ఇరిగేషన్ ల్యాండ్‌గా చూపిస్తున్నారు. డ్యాంలో వాటర్ తక్కువ ఉన్నప్పుడు అలోకేషన్ చేసినప్పుడు కొంతమంది రైతులకు అన్యాయం జరిగిన విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలని ఈ ప్రశ్న వేశాను. డ్యాం నిర్మాణం జరిగినప్పటి నుండి ఇప్పటికీ ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. లక్షల ఎకరాలు నాన్ కన్వర్షన్ ల్యాండ్స్ అయిపోయాయి. చివరకు మనం కూర్చున్న ఈ స్థలం కూడా ఒకప్పుడు అగ్రికల్చర్ ల్యాండ్‌గా ఉంటే ఈరోజు నాన్ అగ్రికల్చర్‌గా కమర్షియల్‌గా చేసి బిల్డింగులు కట్టారు. ఇది కూడా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ లెక్కల్లో ఇరిగేషన్ ల్యాండ్‌గానే చూపిస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం అని తమరి ద్వారా సంబంధిత మంత్రిగారిని అడుగుతున్నాను.

1989లో స్వర్గీయ ఎన్టీ రామారావుగారి కృషి వలన 75 టీఎంసీలతో మా జిల్లాకు సోమశిల డ్యాం వచ్చింది. 75 టీఎంసీల నీళ్లతో ఉంటే ఆయకట్టు స్థిరీకరణ ఇప్పటికీ జరగలేదు. నెల్లూరు పట్టణం ఒకప్పుడు మునిసిపాలిటీ ఈరోజు అది కార్పొరేషన్ అయింది. మన మంత్రిగారైన నారాయణగారికి 100 ఎకరాలలో మెడికల్ కాలేజీ ఉంది. ఆ 100 ఎకరాలు కూడా ఇరిగేషన్ ల్యాండ్ కిందనే రికార్డులలో చూపించినందువల్ల డ్యాంలో తక్కువ నీళ్లు ఉన్నప్పుడు అలోకేట్ చేసేటప్పుడు డెల్టా ప్రాంతానికి ప్రయారిటీ ఇచ్చే సమయంలో ఈ అగ్రికల్చర్ ల్యాండ్స్ అన్నింటినీ చూపించినందువల్ల వాళ్లకు వాటర్ ఎక్కువ వెళ్తుంది. ఐడీ కార్డులున్న రైతులకు నీళ్లు తక్కువగా వెళ్తున్నాయి. మేజర్ ఇరిగేషన్ కింద నీటి విడుదలలో అలసత్వం వల్ల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఐడీ కార్డులున్న రైతులు పొలాల గట్లపై ఎండనక వాననక తిరిగి పంటలు పండించుకోవడానికి ఇబ్బందిపడుతున్నారు. వెంటనే స్టెబిలైజ్ చేసి, ల్యాండ్ కన్వర్షన్‌కు వెళ్లిన దానిని తీసేసి మిగతా ల్యాండ్ మాత్రమే ఆయకట్టులో చూపిస్తే ఇంకా కొన్ని వేల ఎకరాలకి అదనపు ఆయకట్టు ఇవ్వడానికి అవకాశముంటుంది కాబట్టి ఇరిగేషన్, రెవెన్యూ, అగ్రికల్చర్ శాఖాధికారులు కో-ఆర్డినేట్ చేసుకుని, ఒక కమిటీని వేసి ఆయకట్టు స్థిరీకరిస్తే రైతులకు అన్ని విధాల ఉపయోగకరంగా ఉంటుందని తమరి ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (SRI PRATHIPATI PULLARAO) (చిలకలూరిపేట): అధ్యక్షా, ధన్యవాదాలు. కూటమి ప్రభుత్వం ఆయకట్టు స్థిరీకరణ పెంచాలని ప్రయత్నం చేస్తుంటే గత ప్రభుత్వం ఉన్న ఆయకట్టును పూర్తిగా వినియోగించుకునే అవకాశం లేకుండా చేసింది. ₹6,000కోట్లతో హరిశ్చంద్రాపురం నుండి నకరికల్లు వరకూ గల ప్రాజెక్టును ఆనాడు గోదావరి నుండి కృష్ణా, కృష్ణా నుండి పెన్నాలో భాగంగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఫైనల్ చేశారు. గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు ఆ ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఎక్కడా రూపాయి పని కూడా చేయలేదు. ఆనాడు స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావుగారి నియోజకవర్గం నకరికల్లులో గౌరవ ముఖ్యమంత్రిగారు శంకుస్థాపన కూడా చేశారు. దానిని తిరిగి మరలా ఎప్పుడు ప్రారంభిస్తారని తమరి ద్వారా అడుగుతున్నాను.

అలాగే బనకచర్ల వరకు మెర్జ్‌చేసే ఆలోచన ఉందా? లేదా దానివరకు టెండర్లు పిలిచి ప్రారంభిస్తారా? గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో రాష్ట్రంలో ఉన్న రైతులను పూర్తిగా మోసం చేసింది. అంతేకాకుండా నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో ఏ పనులూ చేయలేదు. మరమ్మతులూ చేయలేదు. కనీసం గ్రీజు పెట్టడానికి కూడా నిధులు కేటాయించలేదు. కాలువలన్నీ తూటికాడ, గుర్రపుడెక్క, కర్రనాచుతో పేరుకుపోవడం, షట్టర్లు కూడా ఎక్కడికక్కడ పాడైపోయి మరమ్మతులకు నోచుకోని పరిస్థితి ఉంది. గుంటూరు జిల్లాలో దాదాపు 200 లిఫ్ట్ ఇరిగేషన్లు దానిపై ఆధారపడి ఉన్నాయి. కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం ఒకటైతే, లిఫ్ట్ ఇరిగేషన్లు గత ప్రభుత్వంలో గాలికి వదిలేశారు. హరిశ్చంద్రాపురం నుండి నకరికల్లు వరకూ గల ప్రాజెక్టును ఎప్పుడు ప్రారంభిస్తారు? కనీసం 2025-26 బడ్జెట్‌లో నిధులు కేటాయించి లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఆధారపడిన

రైతులకు నీరందించాలని, అలాగే లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఆధారపడి మంచినీటి చెరువులు నింపుకునే గ్రామాలు కూడా ఉన్నాయి. కాబట్టి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించి రైతులను, ఆ గ్రామాలను ఆదుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU): అధ్యక్షా, ధన్యవాదాలు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం మొత్తం 4,02,70,000 ఎకరాలు ఉన్న స్థితిలో సాగుకు పనికివచ్చే విస్తీర్ణం 1,99,4,000 అంటే ఉన్న భౌగోళిక విస్తీర్ణంలో 50శాతం సాగుకి అనుకూలంగా ఉంది. ఉన్న సుమారు 1,99,00,000 ఎకరాలకు ప్రస్తుతం 1,06,00,000 ఎకరాలకు ఇప్పుడు సాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం పురోగతిలో ఉన్న ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా 43లక్షల కొత్త ఆయకట్టుని ఇవ్వబోతున్నాం. ఇంకా మిగిలిన సాగు విస్తీర్ణం 48,612 ఎకరాలుంది. దానిని కూడా భవిష్యత్తులో సాగులోకి తీసుకురావలసిన అవసరముంది.

ఉ.09.10

అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ భూములు నివాస స్థలాలుగా మారుతున్న పరిస్థితులు, పరిశ్రమల కోసం ల్యాండ్ అక్విజిషన్, కన్వర్షన్ కింద మారుతున్న భూములను ఆయకట్టు నుండి తొలగించే పరిస్థితి లేదనే విషయం వాస్తవమే. ఎందుకంటే ల్యాండ్ కన్వర్షన్ జరిగిన తరవాత రెవెన్యూ శాఖ జలవనరుల శాఖకు సమాచారమిచ్చి ఆయకట్టు రికార్డుల నుండి కన్వర్షన్ అయిన భూమిని తొలగించాలి. ఇది ప్రతి సంవత్సరం చేయాల్సిన ప్రక్రియ. కానీ గత ముప్పై సంవత్సరాల నుండి ల్యాండ్ కన్వర్షన్ అయిన భూముల వివరాలను రెవెన్యూ శాఖ ఇరిగేషన్ శాఖకు ఇవ్వకపోవడం, ఇరిగేషన్ శాఖ కూడా దీని మీద దృష్టి పెట్టకపోవడం వల్ల ల్యాండ్ కన్వర్షన్ అయినా కూడా వ్యవసాయ భూములుగానే ఉంటున్నాయి. గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని దృష్టిలో పెట్టుకుని 25వ తేదీన కలెక్టర్స్ సమావేశం ఉంది, 26జిల్లాలలో ల్యాండ్ కన్వర్షన్ అయిన భూముల వివరాలు సేకరించాలని చెబుతాము. రెవెన్యూ శాఖ శిస్తు వసూలు చేస్తారు కాబట్టి దాని ద్వారా వారికి ఐడెంటిఫై అవుతుంది. అలాగే ల్యాండ్ కన్వర్షన్ రెవెన్యూశాఖలోని తహశీల్ధారు, ఆర్డీవోలు చేస్తారు కాబట్టి వారి వద్ద ఆ వివరాలు ఉంటాయి. వ్యవసాయ శాఖ ప్రతి సంవత్సరం ఈ-క్రాప్ ద్వారా పంట వివరాలు నమోదు చేస్తారు. అదేవిధంగా జలవనరుల శాఖలో నీటి వినియోగం మీద లస్కర్లు, ఏఈ వంటి వారు నీటి అజమాయిషీ చేస్తూ ఉంటారు. రెవెన్యూ, వ్యవసాయ, జలవనరుల శాఖలు మూడు అనుసంధానం చేసి రాబోయే నెల, రెండు నెలల్లో రాష్ట్రంలో ల్యాండ్ కన్వర్షన్ జరిగిన భూముల వివరాలు తీసుకుని వాటిని ఆయుకట్టు నుండి తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుడతామని, 25న జరిగే కలెక్టర్ల సమావేశంలో సమాచారమిచ్చి ఈ ప్రక్రియను మొదలు పెడతామని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదేవిధంగా గౌరవ సభ్యులు పుల్లారావుగారు అడిగారు, పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టులో హరిశ్చంద్రాపురం వద్ద చేపట్టిన గోదావరి-పెన్నా లింకు ఫేజ్-IIIని కలిపే ప్రాజెక్టు పరిశీలన, డీపీఆర్ జరుగుతోంది. పరిశీలన అనంతరం సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని గౌరవ సభ్యులు ఇచ్చిన సూచన ప్రకారం బనకచర్లను ఇన్‌క్లూడ్ చేయడానికి గల అవకాశాలను పరిశీలిస్తామని మీద్వారా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా నాగార్జునసాగర్ రైట్ మెయిన్ కెనాల్‌కు డీసిల్టింగ్, weed removal లేని పరిస్థితి గురించి మేము కూడా ముఖ్యమంత్రిగారి దృష్టిలో పెట్టాం. ఎందుకంటే ప్రతి సంవత్సరం వాస్తవంగా నీటి నిర్వహణ పన్నులు కట్టించుకుని ప్రతి సంవత్సరం ఓ అండ్ ఎమ్ పనులు చేస్తూ ఉంటాం. దురదృష్టవశాత్తు గత ఐదు సంవత్సరాలలో ఎక్కడా కూడా ఓ అండ్ ఎమ్ నిధులు ఒక్క రూపాయి కూడా లేని పరిస్థితి ఉంది. ఇప్పుడు కూడా మార్చి నెల ఎస్టిమేషన్స్ వేసి ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి మే నెలలో పనులు చేయాలి. కానీ నిధులు లేని కారణంగా ముఖ్యమంత్రిగారిని అడిగాము. వేల కోట్ల రుపాయలు ఖర్చు పెట్టి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు కట్టుకుని ప్రతి సంవత్సరం మెయింటెనెన్స్ చేయకపోతే అవన్నీ ఉపయోగం లేని స్థితి ఉంటుంది. కాబట్టి కచ్చితంగా ఓ అండ్ ఎమ్ పనులు చేపడతామని మీద్వారా తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ప్రశ్న నం.559

తోటపల్లి ప్రాజెక్టు కాలువల అధునీకరణ

MODERNIZATION OF CANALS OF THOTAPALLI PROJECT

ప్రశ్న నం.559 (122)

శ్రీ నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే

SRI NIMMAKA JAYAKRISHNA, MLA

గౌరవనీయులైన జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలిపెదరా;

అ) శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాగావళి నది, తోటపల్లి ఆనకట్ట ప్రాజెక్టు కాలువల వ్యవస్థ ఆధునీకరణకు సంబంధించిన అంచనాలను తాజా ఎస్‌ఎస్‌ఆర్ ప్రకారం సవరించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన విషయం వాస్తవమేనా;

ఇ) అయినచో, ఎప్పటిలోగా నిధులు కేటాయించి పనులను తిరిగి ప్రారంభిస్తారు?

గౌరవనీయులైన జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి (డా.నిమ్మల రామానాయుడు):

HON'BLE MINISTER OF WATER RESOURCE DEVELOPMENT (DR.NIMMALA RAMANAIDU):

అ) లేదండీ.

ఆ) అవునండీ.

ఇ) పనిని సమీక్షించి, అవసరాన్ని బట్టి సముచిత చర్య తీసుకోవడమవుతుంది.

శ్రీ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్.ఈ.ఆర్) (SRI NADUKUDITI ESWARARAO (N.E.R)) (ఎచ్చెర్ల): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు లేదండీ అని సమాధానం ఇచ్చారు. ఉత్తరాంధ్రలో తోటపల్లి ప్రాజెక్టు అతి ముఖ్యమైనది. గత ఆరు సంవత్సరాలుగా తోటపల్లి కుడి కాలువలో సాగునీటికి, తాగునీటికి ఒక్క చుక్క నీరు రాలేదు. పూడిక తీయకుండా, గుర్రపుడెక్క తొలగించకుండా సరిగ్గా నిర్వహణ చేయకపోవడం వలన పార్వతీపురం నుండి చీపురుపల్లి, నెల్లిమర్ల, ఎచ్చెర్ల మండలాలలోని టెయిల్‌ఎండ్ భూములకు గత ఆరు సంవత్సరాల నుండి ఒక్క చుక్క నీరు రాలేదు. ఈరోజు గౌరవ మంత్రివర్యులు కనీసం ఎటువంటి సమాధానం చెప్పకుండా లేదు, కాదు అంటున్నారు. రైతాంగం ఎన్డీయే ప్రభుత్వం వచ్చిందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారు. మన ప్రభుత్వం వచ్చిన తరవాత కాలువల ద్వారా నీరు వస్తుందని ఎదురు చూస్తున్నారు. అటు కుడి కాలువ పనులు కూడా అలాగే ఉన్నాయి. దీనిమీద మన ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరముంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రజలు తోటపల్లి ప్రాజెక్టు మీద ఆధారపడి ఉన్నారు.

అధ్యక్షా, ఇదే సమయంలో నారాయణపురం కుడి కాలువ, ఎచ్చెర్లకు వచ్చేది, అలాగే మడ్డువలస ప్రాజెక్టు, ఎప్పుడో గత 30 సంవత్సరాల క్రితం స్టేజ్–I పనులు అయిపోయాయి. స్టేజ్–II పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదు. గత ప్రభుత్వంలో నామమాత్రంగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి సుమారు ₹30కోట్లుకు పనులు ప్రారంభించారు. కాంట్రాక్టరు నాలుగైదు శాతం పనులు చేసినా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించనందుకు ఆ కాంట్రాక్టరు పనిని ఆపేశాడు. ఆ స్టేజ్– II పనులు పూర్తి చేస్తే అటు ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరుకు, ఎచ్చెర్ల నియోజకవర్గానికి కలిపి సుమారు 12వేల ఎకరాల ఆయకట్టుకు నీరు వస్తుంది. అధ్యక్షా, స్టేజ్–II పనులు పూర్తి చేసి 12వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు వచ్చేలా మనం చేయాలి. ఆ కాంట్రాక్టరుని పిలిపించి మాట్లాడి ఈ సంవత్సరం కొంత, వచ్చే సంవత్సరం కొంత అలా స్టేజ్‌ల వారీగా పెట్టుకుని పూర్తి చేసుకుంటే 12వేల ఎకరాలే కాకుండా త్రాగునీరు కూడా అందుతుంది. అధ్యక్షా, ఇరిగేషన్ పనుల మీద దృష్టి పెట్టి త్రాగునీరు, సాగునీరు అందించాల్సిన బాధ్యత మన మీద ఉంది. రైతాంగం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తోంది. దీనిమీద దృష్టి పెట్టాలని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పరిటాల సునీతమ్మ (SMT.PARITALA SUNITHAMMA) (రాప్తాడు): అధ్యక్షా, ధన్యవాదాలు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటిరంగం పూర్తిగా విఫలమయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో త్రాగునీరు, సాగునీరు అవసరాల కొరకు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును రాప్తాడు నియోజకవర్గంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో వర్షాలు సరిగ్గా రాక రైతులు, ప్రజలు తీవ్ర

ఇబ్బందులు పడి వలసలు వెళ్లే పరిస్థితి ఉండేది. ఈ విషయాన్ని తన పాదయాత్రలో భాగంగా ప్రాజెక్టు సమీపంలో బస చేసి ప్రాజెక్టును సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అధికారంలోకి వచ్చిన తరవాత జీవో నం.59 ద్వారా సుమారు ₹804కోట్లతో సోమరవాండ్లపల్లి పుట్టకనుమ రిజర్వాయర్ల నిర్మాణంతోబాటు జీడిపల్లి పేరూరు మధ్య 54కిలోమీటర్ల కాలువ నిర్మాణం చేపట్టారు. అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో మెగా ఇంజనీరింగు కంపెనీతో ₹592కోట్లతో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించి సుమారు 28శాతం మేర పనులు అనగా కాలువ నిర్మాణంతోపాటు నాలుగు పంప్ హౌస్‌లు సోమరవాండ్లపల్లి రిజర్వాయరు పనులు చేయడం జరిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులు ప్రక్కన పెట్టి కొత్తగా మూడు ప్రాజెక్టులు నిర్మిస్తామని గొప్పలు చెప్పి ఒక ఎకరా భూ సేకరణ కూడా చేయకుండా రైతులకు అన్యాయం చేయడమే కాక నేడు చిలకపలుకులు పలుకుతున్నారు. 53కి.మీ.ల కాలువతోబాటు రెండు జలాశయాల నిర్మాణానికి 1000ఎకరాలకు పైగా భూసేకరణ అవసరం కాగా కేవలం 95 ఎకరాలకు ₹5కోట్లు మాత్రమే చెల్లించారు. ప్రస్తుతం 67 ఎకరాల భూసేకరణ చెల్లింపుల కోసం ₹14.50కోట్ల బిల్లులు సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్ చేశారు. వెంటనే ₹14.50కోట్ల నిధులు విడుదల చేసి రైతులకు ఇవ్వాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.9.20

ఇంకా భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ భూములకు ఈనాటి ధర ప్రకారం పరిహారం మంజూరు చేసి ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని రైతుల తరపున కోరుతున్నాను. జీడిపల్లి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి అయితే అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల క్రింద ఉన్న 10వేల ఎకరాల ఆయకట్టుతోపాటు మరో 15వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. మా నియోజకవర్గంలోని ప్రాజెక్టుల కోసం ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవు. అంచనాల ప్రకారం నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియజేయాల్సిదింగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU): అధ్యక్షా, 1908లో నాగావళి నది మీద తోటపల్లి ఓల్డ్ రెగ్యులేటర్ వ్యవస్థ నిర్మాణం జరిగింది. ఈ వ్యవస్థ క్రింద 39,544 ఎకరాలు సాగులో ఉంది. ఆ ఓల్డ్ రెగ్యులేటర్ వ్యవస్థ క్రింద రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఒకటి లెఫ్ట్ కెనాల్ రెండు రైట్ కెనాల్. లెఫ్ట్ కెనాల్ 37 కి.మీ పరిధిలో పాలకొండలో 27,410 ఎకరాలు, రాజాంలో 4,298 ఎకరాలు మొత్తం 31,602 ఎకరాలు సాగులో ఉంది. రైట్ కెనాల్ క్రింద 17 కి.మీ పరిధిలో కురుపాం నియోజకవర్గంలో 7,942 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న పరిస్థితి.

ఈ రెండు కెనాల్స్‌లో ఓల్డ్ రెగ్యులేటర్ వ్యవస్థ ఉంది. దానిని నిర్మించి దాదాపు వంద సంవత్సరాలు అయినందున శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఆధునీకరణ పనుల నిమిత్తం

28.06.2018 తేదీన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ₹195.34కోట్లు మంజూరు చేసి, సాయిలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీని ఫిక్స్ చేసింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వారికి బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడం వలన పనులు నత్తనడక నడిచి, 17.59లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయాల్సి ఉండగా, వారు కేవలం 6లక్షల 12వేల క్యూబిక్ మీటర్ల పని మాత్రమే చేశారు. ఇంకా 11లక్షల 47క్యూబిక్ మీటర్ల మట్టి పనులు బ్యాలెన్స్ ఉంది. అదేవిధంగా లెఫ్ట్ కెనాల్‌లో లైనింగ్ పనులను 37.6 కి.మీలకుగానూ కేవలం 17.5కి.మీ మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 20.09కి.మీలు బ్యాలెన్స్ ఉంది. అలాగే రైట్ కెనాల్ లైనింగ్ పనులను 17.6కి.మీలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 9.3కి.మీలు మాత్రమే పూర్తయ్యింది. ఇంకా 8.2కి.మీలు బ్యాలెన్స్ ఉంది.

లెఫ్ట్ కెనాల్ క్రింద మొత్తం 358 స్ట్రక్చర్స్ చేయాల్సి ఉండగా, ఐదు మాత్రమే పూర్తయినాయి. ఇంకా 353 స్ట్రక్చర్స్ పనులు చేయాల్సి ఉంది. రైట్ కెనాల్ క్రింద మొత్తం 109 స్ట్రక్చర్స్ పనులు చేయాల్సి ఉండగా ఒక్క స్ట్రక్చర్‌కి సంబంధించిన పనిని కూడా మొదలుపెట్టలేదు. కాబట్టి ఆ 109 స్ట్రక్చర్స్ పనులను ఇప్పుడు చేయాల్సి ఉంది. ఈ రకంగా మొత్తం ప్రాజెక్టు పనులు కేవలం 22శాతం మాత్రమే గత ఆరు సంవత్సరాల్లో పూర్తయ్యాయి. మొత్తం ₹41.22కోట్లు ఇప్పటివరకు ఖర్చు పెట్టడం జరిగింది. 2018లో ప్రారంభించిన పనులు కావడం, ఓల్డ్ ఎస్ఎస్ఆర్ రేట్లు కావడం, అప్పటి కాంట్రాక్టర్ పని చేయడానికి సుముఖంగా లేకపోవడం వంటి కారణాల రీత్యా ఇప్పటివరకు ప్రారంభించని పనులను, 25శాతం కంటే తక్కువ జరిగిన పనులను, ఆల్‌రెడీ ఉన్న ప్రభుత్వ జీవో ప్రకారం ఆయా పనులను రద్దు చేసే ప్రక్రియలో ప్రభుత్వం ఉంది. అయితే గౌరవ సభ్యుల విజ్ఞప్తి మేరకు, ఈ ప్రాజెక్టు అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని మిగిలినపోయిన ఆధునికీకరణ పనులకు రీ-ఎస్టిమేషన్ తయారు చేసి కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం టెండర్లు పిలిచే ప్రక్రియకు శ్రీకారం చుడతామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యురాలు పరిటాల సునీతమ్మగారు మాట్లాడుతూ అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు సంబంధించి సోమందేపల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. మొన్న బడ్జెట్ సందర్భంలో తమరు చూశారు. రాష్ట్రంలో ఉన్న ఏ ప్రాజెక్టుకు కేటాయించనంత మొత్తాన్ని అక్షరాలా ₹3,240కోట్లను హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించాం. దాని ద్వారా రాప్తాడు నియోజకవర్గం లబ్ధి పొందుతుంది. మల్యాల అంటే ఎక్కడ నుంచైతే నీటిని జీరో కిలోమీటర్ దగ్గర ప్రస్తుతం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉంది. ఇప్పుడు దాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచుతున్నాం. జీడిపల్లి రిజర్వాయర్‌లో ఇప్పుడు వాటర్ డబుల్ అవుతుంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్‌కు, సోమందేపల్లి రిజర్వాయర్‌కి జలాలు వస్తాయి. కాబట్టి ఖచ్చితంగా బ్యాలెన్స్ వర్కులను పూర్తి చేస్తాం. అప్పర్ పెన్నార్ క్రింద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద రైతులకు చెల్లించాల్సిన ₹14కోట్లను త్వరలో చెల్లిస్తాం. రేపు జూన్, 2025 నాటికి హంద్రీ-నీవా సుజల స్రవంతి పనులను పూర్తి చేసే ప్రక్రియలో డిస్ట్రిబ్యూషన్ సిస్టంను కూడా భవిష్యత్తులో అభివృద్ధి చేస్తామని తమరి ద్వారా తెలియజేస్తున్నాం.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): పై ప్రశ్నను అడిగిన గౌరవ సభ్యులు సభకు ఆలస్యంగా వచ్చారు. రికార్డుల కోసం వారి అభిప్రాయాన్ని కూడా తీసుకుంటాం. జయకృష్ణగారూ మాట్లాడండి.

శ్రీ నిమ్మక జయకృష్ణ (SRI NIMMAKA JAYAKRISHNA) (పాలకొండ): అధ్యక్షా, గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి రిజర్వాయర్ ఎడమ కాలువ ఆధునీకరణ పనులను పూర్తిగా విస్మరించింది. సుమారు 60వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టు ఇది. గత ప్రభుత్వంలో కేవలం ఆరు శాతం పనులు మాత్రమే జరిగాయి. మా నియోజకవర్గంలో ఉన్న తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ పనులు కేవలం 20శాతం జరగడం వలన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 20శాతం లోపు జరిగిన పనులను రద్దు చేయమని గౌరవ ముఖ్యమంత్రిగారు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం తోటపల్లి ఎడమ కాలువకు నిధులు మళ్ళా కేటాయించి, ఆ కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ప్రధాన కాలువల ఆధునీకరణ
MODERNIZATION OF MAJOR CANALS OF BRR VAMSADHARA PROJECT

ప్రశ్న నం.643(123)

సర్వశ్రీ/శ్రీమతి మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి , గౌతు శిరీష, ఎమ్మెల్యేలు

SARVASRI/SMT. MAMIDI GOVINDARAO, BAGGU RAMANAMURTHY, GOUTHU SIREESHA, MLAs

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలిపెదరా;

అ) పాతపట్నం నియోజకవర్గంలోని బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ప్రధాన కాలువలను ఆధునీకరించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) ప్రతిపాదనలపై మదింపు నివేదికను ప్రభుత్వానికి సమర్పించారా;

ఇ) అయినచో, ఆ వివరాలు ఏమి?

గౌరవనీయులైన జలవనరుల శాఖ మంత్రి (డా.నిమ్మల రామానాయుడు):

HON'BLE MINISTER OF WATER RESOURCES DEPARTMENT (DR.NIMMALA RAMANAIDU):

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

శ్రీ మామిడి గోవిందరావు (SRI MAMIDI GOVINDARAO) (పాతపట్నం): అధ్యక్షా, వంశధార ప్రాజెక్టు మా జిల్లాకే తలమానికం. మా సిక్కోలు ప్రజలకు జీవనాధారం. అయితే 1971 నుండి 1977 మధ్య ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఆ నిర్మాణ సమయంలో ఈ ప్రాజెక్టు పేరును బీఆర్ఆర్

ప్రాజెక్టు అని నామకరణం చేశారు. అయితే ఈ ప్రాజెక్టుకు కుడి ఎడమ కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ ద్వారా 12 మండలాల్లో సుమారు లక్షా 50వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం. కుడి కాలువ ద్వారా ఏడు మండలాల్లో సుమారు 62వేల ఎకరాలకు సాగునీరును అందిస్తున్నాం. ఐతే గత సైకో ప్రభుత్వం మాయ మాటలు చెప్పి, బడ్జెట్‌లో అంకెల గారడీ చేసి 2023-24 బడ్జెట్‌లో ₹98కోట్లు, 2024-25 బడ్జెట్‌లో ₹10కోట్లు కేటాయించినట్లు చూపిస్తూ మాయమాటలు చెప్పారు గానీ, నిధులు కేటాయించలేదు. అయితే మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ₹183కోట్లు కేటాయించింది. గత సైకో ప్రభుత్వం వల్ల రెండు కాలువల్లో పూడికలుగానీ, ఏ విధమైన మరమ్మతులుగానీ, అభివృద్ధి పనులుగానీ జరగలేదు. దాని వల్ల కాలవల చివరి భూములకు సాగునీటిని అందించడం చాలా కష్టంగా ఉంది. కాలువ గట్టుపైన, కాలువ లోపల వంద మిల్లీ మీటర్ల సీసీ లైనింగ్ చేయడం వల్ల కాలువ చివరి భూములకు నీళ్ళు అందించగలం.

ఉ.9.30

అధ్యక్షా, గొట్ట బ్యారేజ్ విషయంలో చాలా ఇబ్బందులెదుర్కొంటున్నాం. పాతపట్నం నియోజకవర్గం అనగానే అక్కడ వంశధార ప్రాజెక్టు ఉంది, దానివల్ల ఆ ప్రాంతం సస్యశ్యామలంగా ఉందని అనుకుంటారు, కానీ, మాకు ఆ ప్రాజెక్టు కింద అంతంతమాత్రం ఆయకట్టు ఉంది. ఎందుకంటే అక్కడ ఎక్కువ భాగం కొండ ప్రాంతం. ఎత్తైన భూమి కారణంగా వర్షాధార ప్రాంతంగా ఉంటుంది. అందువల్ల ఎత్తైన ప్రాంతంలో అవసరమున్నచోట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని తమద్వారా విన్నవించుకుంటున్నాను.

శ్రీ బగ్గు రమణమూర్తి (SRI BAGGU RAMANAMURTHY) (నరసన్నపేట): అధ్యక్షా, వంశధార ఎడమ కాలవలో ఎక్కువ శాతం సాగునీరు అందించే ప్రాంతం నరసన్నపేట. ఆ ప్రాజెక్టు కింద 1,46,000 ఎకరాలు సాగైతే అందులో సగభాగం నరసన్నపేటలో ఉంది. అంటే, 70,000ఎకరాల పైచిలుకు మా నరసన్నపేటలో సాగవుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి సుమారు 75 సంవత్సరాలైంది. ఆధునీకరణ పనులు చేయకపోవడం వల్ల సాగునీరు అందడం లేదు. చివరి ప్రాంతమైన పలాస, టెక్కలికి సాగునీరు అందడంలేదు. అలాగని వర్షాలు, వరదలు వస్తే ముంపుకు గురవుతుంది. 2014-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆధునీకరణకు డీపీఆర్‌లు తయారై, టెండర్లు పిలిచే దశలో ప్రభుత్వం మారిపోయింది. తరవాత ఐదేళ్లు గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గాలికి వదిలేసింది. ఈనాడు ఆ ప్రాంతానికి సాగునీరు అందడం కష్టంగా ఉంది.

అధ్యక్షా, ఇది కాకుండా మరో సమస్య కూడా ఉంది. సమైక్యాంధ్రప్రదేశ్‌లో 15 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పెద్ద ఎత్తున షట్టర్ల కుంభకోణం జరిగింది. దానిపై విజిలెన్స్ ఎంక్వైరీ వేశారు. ఈనాటి వరకూ ఆ ఎంక్వైరీ పూర్తి కానందున షట్టర్లు లేవు. నీరు వృథాగా పోతోంది. షట్టర్లకు సంబంధించిన మెటీరియల్ ఉంది కానీ, తుప్పు పట్టిపోతోంది. సమస్య ఇలా ఉంటున్నందువల్ల మేము

గ్రామాల్లో తిరగలేకపోతున్నాం. ఆధునీకరణకు కొంత సమయం పట్టినా, ఈ ఏడాది నిర్వహణకు కనీసం షట్టర్లు బిగించడం, సిల్ట్ తీయడానికైనా ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మా ప్రాంత జీవనాడి వంశధార. మా బ్రతుకే వంశధార. వంశధార నీరు వస్తేనే 1,46,000 ఎకరాలు సాగవుతాయి. అందులో సగభాగం మా ప్రాంతం. ఈ సీజన్‌లో రైతుల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. మొన్న ఎన్నికల్లో గెలిచిన తరవాత సొంత డబ్బులతో రైతులను ఒప్పించి పది మిషన్లు పెట్టి ఎక్కడిక్కడ రిపేర్లు చేసి పొలాలకు నీరందించాం. మరి, ఈ సంవత్సరం ప్రభుత్వం కరుణించాలి. ఇప్పటినుండి ప్రణాళిక ప్రకారం కావలసిన నిధులు అందించేందుకు కృషి చేయాలి. మా ప్రాంతం ఒక్కటే కాదు, టెక్కలి, పలాస వరకూ నీరందుతుంది. షట్టర్లు, చిన్న చిన్న రిపేర్లు, సిల్ట్ తీసే పనులు, లీకేజ్ ఉన్న బండ్స్‌ను పూడ్చడం వంటి పనులు చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీమతి గౌతు శిరీష (SMT.GOUTHU SIREESHA) (పలాస): అధ్యక్షా, శ్రీకాకుళానికి ప్రాణధార అయిన వంశధార గత ఐదేళ్లలో ఎంత నిర్లక్ష్యానికి గురైందో ప్రజలందరికీ తెలుసు. గతంలో మా ప్రాంతం నుండి ఒక రెవెన్యూ శాఖ మంత్రి, స్పీకర్ గారు, పశుసంవర్ధక శాఖ మంత్రిగారు ఉన్నా ఎవరూ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రజలలో నమ్మకం కలిగింది. దానికి ఉదాహరణ ఐదు సంవత్సరాలు పలాసకు కనీసం వంశధార ఎడమ కాలువ ద్వారా చుక్క నీరందించలేదు. మన ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే కలెక్టరు, అధికారులు, జిల్లా మంత్రివర్యుల సహకారంతో ఐదేళ్లు వారు తీసుకురాలేని నీటిని జూలై నెలలోనే అందించారు. అయితే, ఇది ఈ ఒక్క సంవత్సరంతో సరిపోదు. వంశధార ఎడమ కాలువను ఆధునీకరిస్తే కచ్చితంగా టెయిల్ ఎండ్ వరకూ నీరందుతుంది. ఎడమ కాలువను ఆధునీకరిస్తే 12 మండలాల్లో 1,50,000 ఎకరాలకు నీరందుతుంది. మన ప్రభుత్వం వచ్చిందన్న నమ్మకంతో గత జులైలో వంశధార ఎడమ కాలువ పనుల నిమిత్తం వారి స్వంత డబ్బులు ఖర్చు పెట్టి రైతులే జంగిల్ క్లియరెన్స్ చేసుకున్నారు. ఆ బిల్స్ మాత్రం ఇప్పటివరకూ రాలేదు. రైతులకు బిల్స్ క్లియర్ చేయాలని మీద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. ఇప్పటి నుండి జాగ్రత్త పడితే వంశధార ఎడమ కాలువ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 12 మండలాలకు సాగునీరు అందుతుంది. వీటిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరుతున్నాను.

శ్రీ గొండు శంకరరావు (SRI GONDU SANKARARAO) (శ్రీకాకుళం): అధ్యక్షా, కాలువ ఆయకట్టు 30,000 ఎకరాలు నా నియోజకవర్గంలో ఉంది. మాది టెయిల్ ఎండ్ ప్రాంతం. 37 T.E. పనులు ఇంతవరకూ ముగింపు కాలేదు. మొన్ననే దానిని క్లోజ్ చేయించాం. రీఎస్టిమేషన్ వేయించాం. మిగతా RMC పనులు ముగించాల్సిందిగా కోరుతున్నాం. వత్సవలస లిఫ్ట్ ఇరిగేషన్ ప్రపోజల్ పెట్టాం. దానిని కూడా పరిశీలించాల్సిందిగా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను. కళింగపట్నంలో ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయి. మోటార్లు కూడా వచ్చాయి, చాలా కాలమైంది కాబట్టి అవన్నీ

తుప్పుపట్టాయి. Narrow bridge second phase ఇంతవరకూ పూర్తవలేదు. ఒడిశా ట్రైబ్యునల్ క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ ఆ రాష్ట్రం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఇప్పుడు కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉంది కనుక దానిని త్వరగా తేలిస్తే, మా జిల్లాకి జీవనాడి సెకండ్ ఫేజ్ క్లియర్ అవుతుంది. Side viewer ద్వారా ప్రస్తుతానికి flood flow ద్వారా కెనాల్‌కి నీరు వస్తోంది. ఆ నీటిని లిఫ్ట్ చేసేందుకు గత ప్రభుత్వం ₹175కోట్లు మంజూరు చేసింది గానీ, ఐదు శాతం పనులు కూడా చేపట్టలేదు. 90 శాతం పూర్తయిన మా హీరమండలం రిజర్వాయర్‌లో నీరు ఉంచగలిగితే, ఆ నీటిని మరల గ్రావిటీ ద్వారా నదిలోకి పంపి రెండు కాలవల ద్వారా నీటిని పంపే అవకాశముంటుంది. తమద్వారా గౌరవ మంత్రిగారిని కోరేదేమంటే, ఈ ₹175కోట్లతో ప్రారంభం చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును, అలాగే 10 శాతం పనులు మిగిలి ఉన్న రిజర్వాయర్ పనులను పూర్తిచేయాలని కోరుతున్నాను. ఒడిశా రాష్ట్రంతో ఉన్న డిస్ప్యూట్‌ని కూడా త్వరగా ముగించి మాకు సాగునీరు అందించాలని కోరుతున్నాను.

డా.నిమ్మల రామానాయుడు (DR.NIMMALA RAMANAIDU): అధ్యక్షా, బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు స్టేజ్-1కు సంబంధించి శ్రీకాకుళం జిల్లా హీరమండలం గొట్ట గ్రామం వద్ద వంశధార నదిపై 476 మీటర్ల బ్యారేజ్‌ని నిర్మించడమైంది. గౌరవ సభ్యులు చెప్పినట్లు ఎడమ కాలువద్వారా 104.2 కి.మీ., 68 డిస్ట్రిబ్యూటర్స్, 12 మండలాలు, 398 గ్రామాలు 1,48,238 ఎకరాలకు నీరు అందిస్తుంది. 1970లో ప్రారంభమై 1977లో పూర్తైంది. సభ్యులు చెప్పినట్లు నరసన్నపేటలో 63,300, టెక్కలిలో 62,706, పాతపట్నంలో 2,066, పలాసలో 20,158 మొత్తం 1,48,238 ఎకరాలకు ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా ఆమదాలవలస దగ్గర 62,000 ఎకరాలకు నీరందుతోంది. కుడి కాలువ పనులు ఈమధ్యనే చేయడం వల్ల పెద్దగా ఇబ్బంది లేదు. ఎడమ కాలువ విషయంలో పనులు జరిగి 48 సంవత్సరాలు అయినందున 2,481క్యూసెక్కుల సామర్థ్యం ఉండే కాలువ ప్రస్తుతం 1,800, 1,900క్యూసెక్కులకు పడిపోయింది. చివరి ఆయకట్టు 25,000ఎకరాలకు సాగునీరు అందడం లేదు. దీని తోడు ఈ మధ్యనే 24 లిఫ్ట్‌లను ఎడమ కాలువ మీద తీసుకున్నందున మరో 29,000 ఎకరాలకు అదనంగా టెక్కలి లిఫ్ట్ ఇరిగేషన్‌కు తీసుకోవడంతో 360క్యూసెక్కుల నీరు అదనంగా అవసరమవుతోంది. 2,480 క్యూసెక్కులు రావలసి ఉండగా 1,800, 1,900 క్యూసెక్కులు మాత్రమే వస్తోంది. వాటికి తోడు లిఫ్ట్‌ల వల్ల మరో 360 క్యూసెక్కులు తగ్గడం వల్ల చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు.

ఉ.9.40

దీనికి కారణాలపై కూడా మేము రెవ్యూ చేశాం. పర్టిక్యులర్ స్ట్రక్చర్స్ తయారుచేసి ఇప్పటికి 48సంవత్సరాలు దాటడమే కాకుండా నిర్మాణం రాతి కట్టడం కారణంగా అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అదే విధంగా కొన్ని చోట్ల కెనాల్‌కు షట్టర్స్ కూడా లేవు. ఇవన్నీ పునర్‌నిర్మాణం చేయవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా కెనాల్‌లో పూడిక కూడా పేరుకుపోయింది. గత

ఐదేళ్లలో కెనాల్ నిర్వహణ సరిగా లేక పూడిక ఉండడం వలన పూర్తి స్థాయిలో కెనాల్‌లో నీరుపారే పరిస్థితి లేదు. ఈ రెండింటికి మించి కెనాల్ కాలువ కట్టలు కూడా బలహీనంగా ఉండడం వల్ల నీళ్లు ఎక్కువగా వదిలినా కెనాల్‌పై పొర్లిపోయే పరిస్థితి ఉంది. కాబట్టి కాలువ కట్టలను కూడా బలోపేతం చేసే నిమిత్తం వాటిని పునర్‌నిర్మించవలసిన అవసరం ఉంది. అన్ని పనుల కోసం 2018-19లో మన ప్రభుత్వ హయాంలో ₹676కోట్లతో ప్రతిపాదన చేశారు. అయితే గత ఐదు సంవత్సరాల్లో మళ్లీ దీనిపై దృష్టి సారించకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. అందుకే గౌరవ సభ్యులు ఇచ్చిన అభ్యర్థన మేరకు ఇప్పుడు అత్యవసరంగా నిర్వహించవలసిన పనులపై మరొకసారి ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఆధునీకరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని తెలియజేస్తున్నాను. అదే విధంగా గొట్ట బ్యారేజీకి కూడా మరమ్మతుల నిమిత్తం ₹12.68కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే దీనికి డిజైన్లు కూడా సిద్ధం చేశారు. కాంట్రాక్టర్లు కూడా మరమ్మతు పనులు నిర్వహించేందుకు అంగీకరించారు. అయితే రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో ₹16కోట్ల వరకు అవుతుందని చెప్పారు. సత్వరమే రివైజ్డ్ ఎస్టిమేషన్స్ చేసి గొట్ట బ్యారేజీ మరమ్మతు పనులు కూడా నిర్వహిస్తామని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ప్రశ్న నం.831

పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు డీఎస్‌పీ పదోన్నతులు
DSP PROMOTIONS TO POLICE INSPECTORS

ప్రశ్న నం.831 (124)

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే.

SRI PENMETSA VISHNUKUMAR RAJU, MLA.

గౌరవనీయులైన హోం శాఖ మంత్రిగారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) 26, 35ఏళ్ల సర్వీసు ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు ఇంకా డీఎస్‌పిలుగా పదోన్నతి లభించని విషయం వాస్తవమేనా;

ఆ) నిర్ణీత సంఖ్యను మించిన సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించడం ద్వారా వారికి పదోన్నతి కల్పిస్తే రాష్ట్ర ఖజానాపై పడే ఆర్థిక భారం ఎంత మరియు;

ఇ) ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు ఎప్పటిలోగా డీఎస్పీ పదోన్నతులు కల్పిస్తారు?

గౌరవ హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీమతి వంగలపూడి అనిత):

HON'BLE MINISTER OF HOME & DISASTER MANAGEMENT (SMT.VANGALAPUDI ANITHA):

అ) అవునండీ. ఈరోజు నాటికి 1995 బ్యాచ్‌కి చెందిన 65 మంది అధికారులు (30 సంవత్సరాల సర్వీసు) పదోన్నతి కోసం వేచి ఉన్నారు.

ఆ) ఈరోజు నాటికి, 862 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్లు (సివిల్) 6 సంవత్సరాల కనీస సర్వీసును పూర్తి చేసి ఉన్నారు. కొత్త పోస్టులను కల్పించినట్లైతే, 862 పోస్టులకు గాను ఒక్కో సంవత్సరానికి ₹101,31,30,150/- (సంవత్సరానికి ఒక్కో వ్యక్తికి ₹11,75,325) మొత్తం ఆర్థిక భారం ప్రభుత్వంపై పడుతుంది. ప్రస్తుతమున్న పోలీస్ ఇన్‌స్పెక్టరు పోస్టులను అప్‌గ్రేడ్ చేసినట్లయితే, అప్పుడు, 862 పోస్టులన్నింటికీ సంవత్సరానికి సగటు వార్షిక ఆర్థిక భారంతో వ్యత్యాసం (సంవత్సరానికి ఒక్కో వ్యక్తికి ₹2,08,740) ₹17,99,33,880 ఉంటుంది.

ఇ) డీఎస్పీగా (సివిల్) పదోన్నతి కోసం కనీస సర్వీసు పోలీసు ఇన్‌స్పెక్టరు (సివిల్) హోదాలో 6 సంవత్సరాలుగా ఉంది.

డీఎస్పీ (సివిల్) హోదాలో సంవత్సరం వారీగా ఆశించిన ఖాళీలు క్రింది విధంగా ఉన్నాయిః

ప్యానల్ సంవత్సరం	డీఎస్పీ (సివిల్) హోదాలో సుమారుగా ఖాళీలు
2024-2025	58
2025-2026	56
2026-2027	47
2027-2028	36
2028-2029	37
2029-2030	43

రాబోయే ఐదు సంవత్సరాల్లో 277మందికి ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉంది. అంతేకాక, 26 సైబర్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిపాదన పరిశీలనలో ఉందని తెలియజేయడమయింది.

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్‌రాజు (SRI PENMETSA VISHNUKUMAR RAJU) (విశాఖపట్నం నార్త్): అధ్యక్షా, ధన్యవాదాలు. హోం మంత్రిగారి మనసు వెన్న, కానీ నేను చాలాసార్లు సూపర్‌న్యూమరరీ పోస్టుల గురించి అడిగాను. కానీ వారి మనసు కరగలేదు. మంత్రివర్యులు మా సోదరి సమానురాలు. ఆవిడ చెప్పిన దాంట్లో 1995 బ్యాచ్‌కి చెందిన 65మంది పోలీసు అధికారులు 30సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్నా ఇప్పటివరకు ప్రమోషన్లు పొందలేదు.

అధ్యక్షా, మాకు తెలిసిన ఒక వ్యక్తి ఎస్ఐ కేడర్లో విధుల్లో చేరి కొంత కాలం సర్వీసు పూర్తిచేసుకున్నాక తదుపరి సీఐగా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ప్రమోషన్ వస్తుంది. కానీ పోలీసు శాఖలో 30సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్నా కూడా ఇప్పటికీ తదుపరి డీఎస్పీ ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్నారు. అట్లాగే రాబోయే కాలంలో అంటే ఐదు సంవత్సరాలు ఎదురుచూస్తే 277 మందికి ప్రమోషన్లు వస్తాయని

సగర్వంగా మంత్రిగారు చెప్పారు. కింది కేడర్లో కనీస 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న 862మంది పోలీసు అధికారులు పదోన్నతికి సిద్ధంగా ఉండగా భవిష్యతులో పోస్టులు వస్తాయి, వాళ్లకు ప్రమోషన్లు వస్తాయని, ఇరవై సంవత్సరాల కాలానికి ప్రభుత్వం లెక్కలేసి చెబితే ఇంకా బోలెడు వస్తాయని చెప్పవచ్చు.

అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన అంశం. ఆత్మాభిమానం చంపుకుని పోలీసు అధికారులు పదోన్నతుల కోసం చేస్తున్న పోరాటంగా అభివర్ణించాలి. పదోన్నతుల విషయంలో ప్రభుత్వాన్ని ఎందుకు ఒప్పించలేక పోతున్నామో మాకు అర్థం కావడం లేదు. ఆంధ్ర రాష్ట్రంలో 1995 బ్యాచ్, 1996 బ్యాచ్, 1998 బ్యాచ్ పోలీసు అధికారులు ఇప్పటికీ పదోన్నతులు రాక సీఐలుగానే పనిచేస్తున్నారు. అందులో కొంత మంది పోలీసు అధికారులు పదోన్నతులు వస్తాయని ఎదురుచూసి సర్వీసులో ఉండగానే మరణించిన వాళ్లు కూడా ఉన్నారు. ఏ తప్పు చేయకుండా సర్వీస్ రికార్డు బాగున్నా ఎందుకు ప్రమోషన్లు ఇవ్వడంలేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని కూడా మంత్రిగారు చెప్పారు. కనీసం సూపర్‌న్యూమరరీ ప్రమోషన్లు ఇవ్వమనండి. అందులో ఎటువంటి సమస్యలు ప్రభుత్వానికి ఎదురుకావు. ఎందుకంటే వాటి క్రియేషన్ వల్ల ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక భారం పడదు. ఎక్కువ కాలం సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు అధికారులకు ప్రమోషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. కేవలం సీఐ కేడర్ నుంచి డీఎస్పీ కేడర్‌కు వెళ్లే అధికారుల విషయంలోనే జాప్యం జరుగుతోంది. అదే డీఎస్పీ పైస్థాయి పోలీస్ అధికారులతోబాటు ఐపీఎస్ అధికారుల విషయంలో ప్రతి నాలుగు సంవత్సరాలకొకసారి పదోన్నతులు వస్తాయి. కానీ సివిల్ పోలీసులుగా ఎంతో కాలం నుంచి కష్టపడి పనిచేస్తున్న పోలీస్ అధికారుల విషయంలో పదోన్నతులు లభించక పోవడం అత్యంత దారుణం.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): త్వరగా ముగించండి. ఇది ప్రశ్నోత్తరాల సమయం కదా!

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్‌రాజు (SRI PENMETSA VISHNUKUMAR RAJU): అధ్యక్షా, రెండు నిమిషాల్లో ముగిస్తాను. చాలా ఇంపార్టెంట్ సబ్జెక్ట్. ప్రక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో 1998, 2002 బ్యాచ్ పోలీసు అధికారులైన సీఐలకు డీఎస్పీలుగా ప్రమోషన్లు ఇప్పటికే ఇచ్చారు. అందరూ ఒకేసారి సీఐ పోస్ట్‌లో ఉద్యోగంలో చేరినప్పటికీ అక్కడ సహచర సీఐలు డీఎస్పీలుగా పదోన్నతులు పొందారు కానీ ఇక్కడ మాత్రం పదోన్నతుల విషయంలో జాప్యం జరుగుతోంది. అందువల్ల తమ సహచర మిత్రులకు ముఖం చూపించలేకపోతున్న పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో పనిచేస్తోన్న సీఐల పరిస్థితి.

అధ్యక్షా, ఇప్పటికైనా ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్న సీఐలకు డీఎస్పీలుగా కనీసం సూపర్‌న్యూమరరీ పోస్టులోనైనా పదోన్నతి కల్పించాలని మంత్రిగారిని కోరుతున్నాను. ఆ విషయంలో కూడా ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇదివరకు 2014లో తెలుగుదేశం ప్రభుత్వం 169 సూపర్‌న్యూమరరీ డీఎస్పీ ప్రమోషన్లు ఇచ్చింది. రాష్ట్ర విభజన

సమయంలో పోలీసు అధికారులకు స్టేట్ ఆప్షన్స్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఉండాలా, ఆంధ్ర రాష్ట్రంలో ఉండాలా అనే విషయంలో ఆప్షన్స్ ఇచ్చినప్పుడు చాలా మంది పోలీసు అధికారులు మాతృ రాష్ట్రమైన ఆంధ్ర రాష్ట్రంలో పనిచేస్తామని ఆప్షన్స్ ఇచ్చారు. ఆ విధంగా వాళ్లు స్వచ్ఛందంగా నిస్వార్థంతో పనిచేస్తోన్న సీఐలకు డీఎస్పీలుగా ప్రమోషన్లు ఇవ్వకపోతే ఎట్లా? సూపర్‌న్యూమరరీ ప్రమోషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వానికి మీరే ఒక రూలింగ్ ఇవ్వండి. దయచేసి ఆ దిశగా ఆలోచించమని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఇప్పటికైనా సరే, అర్హులైన సీఐలకు సూపర్‌న్యూమరరీ డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించే విషయంలో మంత్రిగారు చొరవ చూపి ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. ఒకే రోజు ఉద్యోగంలో చేరిన సహచర సీఐలు తెలంగాణ రాష్ట్రంలో డీఎస్పీలుగా పనిచేస్తుండంతో ఆంధ్ర రాష్ట్రంలో పనిచేస్తోన్న సీఐలు మనస్తాపానికి గురౌతున్నారు. సూపర్‌న్యూమరరీ పదోన్నతులు కల్పిస్తే ప్రభుత్వంపై ఆర్థికభారం పడదు. ఆర్థికభారం ప్రభుత్వంపై పడనప్పుడు అర్హులైన సీఐలకు ఎందుకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించడంలేదు? మంత్రిగారి మనసు ఎందుకు కరగడం లేదు? అట్లాగే డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ, అడిషనల్ ఎస్పీ నుంచి ఎస్పీ స్థాయిలో కూడా సత్వరమే డీపీసీ నిర్వహించి అర్హులైన పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించవలసిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ప్రభుత్వం ఈ అంశానికి ప్రాధాన్యత కల్పించి కనీసం 10, 15 రోజుల్లో అర్హులైన సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. వాళ్లంతా ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వారి పట్ల కనికరం చూపించాలని మరొకసారి మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి వంగలపూడి అనిత (SMT.VANGALAPUDI ANITHA): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సంబంధించి కొన్ని వాస్తవాలు సభ ముందు ఉంచదలిచాను. సూపర్‌న్యూమరరీ పోస్టులు ఇవ్వడం వల్ల వచ్చే లాభనష్టాల గురించి, ఆ విషయంలో ప్రభుత్వానికి ఉన్న టెక్నికల్ ఇష్యూస్ కూడా గౌరవ సభ్యులు కొంచెం అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నాను. పోలీస్ వెల్ఫేర్ మీద మొట్టమొదటిగా ఆలోచించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. గౌరవ సభ్యులు ఇందాకా ఒక విషయం చెప్పారు. అర్హులైన సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించక పోవడానికి కొన్ని నిర్దిష్ట కారణాలున్నాయి. గౌరవ హైకోర్టు డబ్ల్యూ.పి.నం.9654/2016, తేది.19.09.2017న సాధారణ ఉత్తర్వుల ప్రకారం జీవో నం.54, తేది. 22.02.2014న హోం డిపార్టుమెంట్ జారీ చేసిన జీవో ప్రకారం సీనియారిటీ జాబితాను సవరించారు. సవరించిన తరవాత జీవోఎం.ఎస్.నం.153, తేది. 05.10.2018లో మరొకసారి సీనియారిటీ లిస్ట్‌ను హోం డిపార్టుమెంట్ ఇచ్చింది. అయితే ఆ సీనియారిటీ లిస్ట్‌కు సంబంధించి సంయుక్త డీఎస్పీల సీనియారిటీ జాబితా, అదనపు ఎస్పీ, ఎస్పీల సీనియారిటీ జాబితాలు 2014వరకు జారీ చేయబడినాయి. తరవాత ఇచ్చిన సీనియారిటీ లిస్ట్‌లో 1995 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ ఆఫ్ పోలీస్, ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సివిల్)గా పనిచేస్తోన్న

ఎల్లకూరు వెంకటేశ్వర్లు అనే పోలీసు అధికారి సీనియారిటీ లిస్టును తిరిగి నిర్ణయించాలని హైకోర్టులో డబ్ల్యూ.పి.నం.967/2020 దాఖలు చేశారు. దాని తరవాత న్యాయస్థానం ఉత్తర్వులను పక్కన పెడుతూ ఆదేశాలు జారీ చేసింది.

ఉ.9.50

వాస్తవానికి ఈ పోస్టులకు సంబంధించి ఇప్పటికి కూడా కోర్టు కేసులు ఉండడం వల్ల కొన్ని సందర్భాల్లో స్యూపర్‌న్యూమరరీ పోస్టులను మంజూరు చేయడానికి ప్రభుత్వానికి కొన్ని ఆటంకాలు వచ్చాయి. గౌరవసభ్యులు చెప్పిన విధంగా 2014లో సుమారు 169 సూపర్‌న్యూమరరీ పోస్టులిచ్చారు. నేను కాదని అనడం లేదు. సీనియారిటీ లిస్టు ప్రకారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన తర్వాత కొంతమంది డీఎస్పీలుగా పదోన్నతి పొందిన వారికి సీఐలుగా రివర్షన్ ఇచ్చారు. ఆ సమయంలో ఈ సూపర్‌న్యూమరరీ పోస్టుల్లో పదోన్నతులిచ్చి వారిని సస్టైన్ చేశాం. డీఎస్పీ సూపర్‌న్యూమరరీ పోస్టులు క్రియేట్ చేసినపుడు కొన్ని సీఐ పోస్టులు సప్రెస్ అవుతాయి. కొంతమంది ఎస్ఐలు సీఐలుగా పదోన్నతి పొందినపుడు వారు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఇదంతా ఒక లింక్‌డ్ ప్రొసీజర్. కోర్టు ఎప్పుడైతే పదోన్నతులు నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చిందో అప్పటినుంచి సమస్య ప్రారంభమైంది. ఈ ప్రక్రియ రేంజ్‌వైజ్ కూడా జరుగుతుంది. కొన్ని రేంజ్‌లలో కొంత స్పీడ్‌గా, మరికొన్ని రేంజ్‌లలో కొంత నెమ్మదిగా జరుగుతుంది. డీఎస్పీలుగా పదోన్నతి కల్పించిన తర్వాత రెండు రాష్ట్రాల తెలుగువారు ఎలా విభజింపబడ్డారో ఈ పదోన్నతుల విషయంలో ఆ టెక్నికల్ ఇష్యూ కూడా వస్తుంది. రేంజ్‌ల వారీగా కొంతమంది ఇబ్బందిపడే పరిస్థితులు కూడా ఉన్నాయి.

అధ్యక్షా, తెలంగాణలో ఇప్పటికే పదోన్నతులు కల్పించారని ఇందాక గౌరవసభ్యులు చెప్పారు. అక్కడ కోర్టు ఇష్యూ లేదు. మరో విషయం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సబ్ డివిజన్లు పెంచారు. దీనివల్ల ఆర్థికభారం ఉండదని గౌరవసభ్యులు చెప్పారు. కానీ, పోస్టులు క్రియేట్ చేయడం వల్ల ఆర్థికభారం కూడా ఉంటుంది. అయినప్పటికీ టెక్నికల్ ఇష్యూలన్నీ పరిష్కరించి వారికి పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

అధ్యక్షా, గౌరవసభ్యులు ఎస్పీ పదోన్నతుల గురించి మాట్లాడారు. ఎస్పీ నుంచి డీఐజీ పదోన్నతి పొందాలంటే 14 సంవత్సరాల సర్వీసు, డీఐజీ నుంచి ఐజీకి 4 సంవత్సరాలు, ఐజీ నుంచి అడిషనల్ డీజీకి 7 సంవత్సరాలు, అడిషనల్ డీజీ నుంచి డీజీగా పదోన్నతి పొందాలంటే దాదాపు 5 సంవత్సరాల సమయం పడుతుంది. డీఎస్పీలుగా పదోన్నతి కోసం వెయిటింగ్‌లో ఉన్న 1995 బ్యాచ్ 65మంది సీఐలకు పదోన్నతి కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంటే మళ్లీ ఇటీవల మా శాఖలో కొంతమంది కోర్టును ఆశ్రయించడం వల్ల ఆ పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పదోన్నతుల కోసం డిపార్టుమెంటు నుంచి మేము కూడా కోర్టులో కౌంటర్లు ఫైల్ చేస్తున్నాం. కోర్టు కేసులు క్లియర్ అవ్వగానే వారికి పదోన్నతులు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఐదు సంవత్సరాల్లో 277 మాత్రమే

కాకుండా సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్లు పెరిగితే ఇంకా సబ్‌డివిజన్లు పెరుగుతాయి. ఈ సూపర్‌న్యూమరరీ పోస్టులకు సంబంధించి కోర్టు కేసులు క్లియర్ చేయడానికి, అందరికీ పదోన్నతులు కల్పించడానికి గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాలతో ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసి ఆ కమిటీ ద్వారా చర్చించి వెంటనే పరిష్కరిస్తామని సభద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): హోంమంత్రి గారూ, టెక్నికల్ ఇష్యూల గురించి గౌరవసభ్యులతో చర్చించి పరిష్కరించడం కోసం ప్రయత్నించండి.

శ్రీమతి వంగలపూడి అనిత (SMT.VANGALAPUDI ANITHA): అధ్యక్షా, శాఖాధికారులతోపాటు ఒకసారి గౌరవసభ్యులతో సమావేశమై ఈ సమస్యను ఏవిధంగా పరిష్కరించాలో వారి సూచనలు కూడా తీసుకుంటాం.

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్ రాజు (SRI PENMETSA VISHNUKUMAR RAJU): అధ్యక్షా, ఎవరో కోర్టును ఆశ్రయించారని ఆ శాఖలో మొత్తం పదోన్నతులు నిలిపివేస్తారా? సహజంగా పదోన్నతులు రానివారు కోర్టును ఆశ్రయిస్తూనే ఉంటారు. ఇలాగే ఎవరో ఒకరు కోర్టుకు వెళుతూ ఆలస్యమైపోతే పదోన్నతులు వచ్చేనాటికి వారు చనిపోతారు. వారు చనిపోక ముందే పదోన్నతి కల్పించి వారికి గౌరవమివ్వండి. వారు ఏదో తప్పుచేశారేమో అందుకే పదోన్నతి రావడం లేదని వారి కుటుంబసభ్యులు భావిస్తున్నారు. నా కుటుంబసభ్యులు లేదా స్నేహితులెవరూ పోలీసుశాఖలో పనిచేయడం లేదు. నేను నా స్వార్థం కోసం అడగడం లేదు. దశాబ్దాలుగా ఎటువంటి పదోన్నతి లేకుండా పనిచేస్తూ ఎదురుచూస్తున్న పోలీసు అధికారులకు తగిన గౌరవం ఇవ్వాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

బీసీ బాలికలకు నూతన గురుకుల పాఠశాలలు
NEW GIRLS RESIDENTIAL SCHOOLS TO BCs

ప్రశ్న నం.772(125)
శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే
SRI VASANTHA VENKATA KRISHNA PRASAD, MLA

గౌరవనీయులైన బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలియజేస్తారా?

అ) ఇతర జిల్లాలతో పోల్చితే ఎన్.టి.ఆర్ జిల్లాలోని గ్రామాల్లో అక్షరాస్యత శాతం తక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించినదా;
ఆ) అయినచో, అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు తీసుకోనున్న చర్యలు ఏమి;

ఇ) 65 నూతన పాఠశాలల భవనాలకు మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసినదా;

ఈ) ఎన్‌టీఆర్ జిల్లాలో వెనుకబడిన తరగతుల బాలికల కోసం నూతన గురుకుల పాఠశాలలను స్థాపించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

గౌరవనీయులైన బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి (శ్రీమతి ఎస్.సవిత):

HON'BLE MINISTER OF BC WELFARE; ECONOMICALLY WEAKER SECTIONS WELFARE; HANDLOOMS & TEXTILES (SMT.S.SAVITHA):

అ) 2011 జనాభా లెక్కల ప్రకారం, కృష్ణా జిల్లా (ఎన్టీఆర్ జిల్లాతో సహా) 73.74 శాతం అక్షరాస్యత రేటును కలిగి ఉంది. ఇది రాష్ట్రంలో రెండవ అత్యధికం, రాష్ట్ర సగటు 67.41 శాతం, జాతీయ సగటు 73.0 శాతం కంటే ఎక్కువ. కృష్ణాజిల్లాలో పురుషుల అక్షరాస్యత 78.30 శాతంగా ఉంది, స్త్రీల అక్షరాస్యత 69.18 శాతంగా ఉంది. రెండూ జాతీయ సగటును మించి ఉన్నాయి.

ఆ) కృష్ణా జిల్లాలో 2020-22 సంవత్సరాలలో కేంద్ర ప్రతిపాదిత పథకం "పఢ్నా లిఖ్నా అభియాన్" కింద 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల 7,454 మంది అభ్యాసకులు వారి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రాన్ని పూర్తిచేశారు. అంతేగాక, 2024-25లో, ఉల్లాస్ కార్యక్రమం (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసాన్ని అర్థం చేసుకోవడం ఉల్లాస్) కింద ఎన్‌టీఆర్ జిల్లాలో 7,000 మంది అభ్యాసకులకు ప్రాథమిక సంఖ్యాశాస్త్రం, అక్షరాస్యత తరగతులను నిర్వహించడమయింది.

ఇ) అవునండీ. 65 పాఠశాలలకు ప్రాథమిక సౌకర్యాలను కల్పించడమయింది.

26-06-2018 తేదిగల, బీసీడబ్ల్యూ (బి) శాఖ, జి.ఓ.ఎంఎస్.నం.12 ప్రకారం, ప్రభుత్వం 65 కొత్త పాఠశాలలను మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఈ పాఠశాల భవనాలను మంజూరు చేయలేదు. 65 కొత్త పాఠశాలల్లో, ప్రస్తుతం 18 పాఠశాలలు (బాలికలు-8, బాలురు-10) అద్దెరహిత భవనాలలో పనిచేస్తున్నాయి. మిగిలిన 47 పాఠశాలలు (బాలికలు-23, బాలురు-24) ప్రైవేట్ అద్దె భవనాలలో పనిచేస్తున్నాయి.

శ్రీ సత్యసాయి జిల్లాలలోని రొద్దం, వైఎస్ఆర్ జిల్లాలోని తొండూరులో పాఠశాలల శాశ్వత భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

22 పాఠశాలల శాశ్వత భవనం నిర్మాణం కోసం అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించడమయింది, ఎంజెపీపీడీసీడబ్ల్యూఆర్ఐ సొసైటీ కార్యదర్శి నుండి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక అందింది. దానిని పరిశీలించి ఆర్థిక శాఖ రిమార్కుల కోసం పంపించడమయింది. వారి నుంచి సమాధానం అందాల్సి ఉంది.

మిగిలిన 41 పాఠశాలల కోసం, శాశ్వత పాఠశాల భవనాల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఇప్పటికే అభ్యర్థించడమయింది.

ఈ) లేదండీ.

శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాద్ (SRI VASANTHA VENKATA KRISHNAPRASAD) (మైలవరం): అధ్యక్షా, ధన్యవాదాలు. బీసీలు తెలుగుదేశం పార్టీకి పట్టుగొమ్మలు కాబట్టి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 65 బీసీ హాస్టళ్లను మంజూరుచేశారు. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ పాఠశాలలకు మౌలికవసతులు మెరుగుపర్చడానికి ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. బటన్ నొక్కితే చాలు నా పని అయిపోయిందని మహానుభావులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిగారు అనుకున్నారు. కొన్ని పాఠశాలలు స్వంత భవనాల్లో నడుస్తున్నాయని ఇందాక మంత్రిగారు చెప్పారు. అటువంటి పాఠశాలల్లో మా మైలవరం నియోజకవర్గం కొండపల్లి గ్రామంలో కూడా ఒక పాఠశాల ఉంది. పాత హాస్టల్ భవనాన్ని పాఠశాలగా మార్చారు. అదే పాఠశాల, అదే హాస్టల్ భవనం. 480మంది బాలురు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆ పాఠశాలలో వసతులు పూర్తిగా లేవు. ఆ పాఠశాలలో అదనపు తరగతి గదులు కావాలి. ఎనిమిది, తొమ్మిది తరగతులకు కేవలం ఒక్కొక్క సెక్షన్ మాత్రమే ఉంది. ఆ పాఠశాలలో చాలా ఎక్కువమంది పిల్లలు చదువుకుంటున్నారు. అక్కడ ఎక్కువ డిమాండ్ ఉంది. కానీ, వారందరినీ మనం అక్కడ అకామడేట్ చేయలేకపోతున్నాం. అదనపు తరగతి గదులు, డార్మిటరీ, వంటశాలలకు కూడా అక్కడ ఇబ్బంది ఉంది. కొండపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్న పిల్లలు చదువును కొనసాగించడం కోసం ఇంటర్మీడియట్ కళాశాలను కూడా అక్కడ కేటాయించాలి.

అధ్యక్షా, బీసీ బాలికలకు ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా వసతిగృహం లేదు, ప్రత్యేక గురుకుల పాఠశాల లేదు. దయచేసి మైలవరం నియోజకవర్గంలో తక్షణమే బీసీ బాలికల కోసం గురుకుల పాఠశాలను మంజూరు చేయాలి. దానికోసం స్థలం కూడా సిద్ధంగా ఉంది. ఆ స్థలంలో గురుకుల పాఠశాలను వెంటనే ప్రారంభించాలి.

అధ్యక్షా, 480 మంది విద్యార్థులతో ఉన్న కొండపల్లి బాలుర పాఠశాల చాలా చిన్న స్థలంలో ఉంది. ఆ పాఠశాల పక్కనే పోలీసుశాఖకు చెందిన ఎకరం భూమి ఉంది. ఈ విషయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మగారు హోంశాఖ మంత్రి అనితమ్మ గారితో మాట్లాడి ఆ ఎకరం భూమిని బాలుర పాఠశాల కోసం కేటాయిస్తే 480మంది పిల్లలకు ఆటస్థలంగా ఉపయోగపడుతుంది. దయచేసి ఆ ఎకరం స్థలం కొండపల్లి బాలుర పాఠశాలకు హోంశాఖ మంత్రిగారు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని మీద్వారా గౌరవ బీసీ సంక్షేమశాఖ మంత్రిగారిని కోరుతున్నాను. ఇందాక ఈ విషయాన్ని నేను హోం మంత్రిగారిని అడిగితే పోలీసుశాఖకు స్థలాలు తక్కువగా ఉన్నాయి. ఆ స్థలంలో కాంప్లెక్స్‌ను నిర్మిస్తే పోలీసుశాఖకు అద్దెలు వస్తాయని చెప్పారు. ఆ స్థలం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి

పనికిరాదని నేను చెబితే వారి పోలీసుశాఖకు ఆదాయం చూపించుకోవాలని అనితమ్మ గారు ఆ స్థలంలో కళ్యాణమండపం నిర్మిస్తామని వెంటనే చెప్పారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముకలా ఉంటారు కాబట్టి వారి పిల్లలకోసం ఆ స్థలం కేటాయిస్తే తప్పకుండా వారికి ఆటస్థలంగా ఉపయోగపడుతుంది. అదేవిధంగా బాలికల కోసం గురుకుల పాఠశాలను కూడా మంజూరు చేయాలని మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.10.00

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOUDARY) (రాజమండ్రి రూరల్): అధ్యక్షా, 2018-19లో గురుకుల బాలికల పాఠశాల మంజూరు చేస్తే స్థలం కూడా ఇచ్చాం. ప్రస్తుతం అద్దె భవనంలో ఉంది, అధ్వానమైన స్థితిలో ఉంది, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. అత్యంత వెనుకబడిన కమ్యూనిటీ ఉన్న ప్రాంతం. భవన నిర్మాణం చేసి శాటిలైట్ సిటీగా నిర్మాణం చేయించాలని అభ్యర్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ప్రశ్నోత్తరాలు యాభై శాతం కూడా పూర్తికాలేదు, వాటికి గంట సమయం పట్టింది. సమయాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడండి.

శ్రీమతి ఎస్.సవిత (SMT.S.SAVITHA): అధ్యక్షా, గత ఎనిమిది నెలలుగా మా నియోజకవర్గాల్లో వెనుకబడిన ప్రాంతాలున్నాయని, అక్కడ గురుకుల పాఠశాలలు కావాలని సభ్యులు కృష్ణప్రసాద్‌గారు, ఇతర సభ్యులు అడుగుతున్నారు, వాటిని పరిశీలిస్తున్నాం. గురుకులాలకు నాంది పలికింది తెలుగు రాష్ట్రాల ముద్దుబిడ్డ, సూర్యచంద్రులు ఉన్నంతకాలం మరవలేని నాయకుడు అన్న నందమూరి తారక రామారావుగారు.

రాష్ట్రం విడిపోయినపుడు 41 గురుకులాలు ఉన్నాయి. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు బీసీల పక్షపాతి అని మరొక్కసారి రుజువు చేసుకున్నారు. 2014-18లో 65 గురుకుల పాఠశాలలను మంజూరు చేశారు. అవి ఇప్పుడు 108 అయ్యాయి. 108లో 106 గురుకులాలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మంజూరు చేస్తే గత ప్రభుత్వంలో రెండు మాత్రమే మంజూరు చేశారు.

రెసిడెన్షియల్ పాఠశాలు ఎన్ని ఉన్నాయని గౌరవసభ్యులు అడిగారు. రాష్ట్రం విడిపోయిన తరవాత మొత్తం 43 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. 108 వెల్ఫేర్ స్కూల్స్‌కు గాను 28 పాఠశాలలకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మిగిలినవన్నీ అద్దె భవనాల్లో ఉన్నాయి. 28 భవనాలకు స్థలం మంజూరు అయింది. మిగిలిన వాటికి భూసేకరణ చేసి ల్యాండ్ ఇవ్వాలని అన్ని జిల్లా కలెక్టర్లకు తెలియజేశాం. 2014-18లో 2,09,00మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇప్పుడున్న హాస్టల్స్ పరిస్థితులు బాగా లేవు, ముఖ్యమంత్రిగారు, ఆర్థికశాఖ మంత్రిగారి దృష్టిలో కూడా పెట్టాం. 28

గురుకుల పాఠశాలలకు సొంత భవనాల కోసం ₹1,200కోట్లతో డీపీఆర్‌ను అందజేశాం. గురుకుల పాఠశాలన్నీ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలోనే కచ్చితంగా పూర్తి చేస్తామన్న విషయాన్ని తెలియజేస్తున్నాను. కొండపల్లికి నేను కూడా వెళ్లాను. మా బీసీ బిడ్డల కోసం ఆ స్థలం చాలా అవసరం. హోంమంత్రిగారు దయఉంచి కేటాయించాలని కోరుతున్నాను. ప్రస్తుతం అక్కడ పాములు, ముళ్ల చెట్లు ఉన్నాయి. ఈ సభద్వారా హోంమంత్రిగారిని ప్రత్యేకంగా అడుగుతున్నాం.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): నా సూచన ఏమంటే కొత్త గురుకుల పాఠశాలల గురించి కొంచెం సమయం తీసుకున్నా ఫరవాలేదు. ఎన్టీ రామరావుగారు పెట్టిన గురుకుల పాఠశాలలు చాలా ఉన్నాయి, అవి మంచి పాఠశాలలు, వాటికి మౌలికసదుపాయాలు చాలావరకు కొరతగా ఉన్నాయని నాకు తెలుసు, నేను కూడా చూశాను. మీ డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడుకుని ఎలా మెరుగుపరచాలో వాటిపై దృష్టి పెట్టండి.

శ్రీమతి ఎస్.సవిత (SMT.S.SAVITHA): అధ్యక్షా, నారాయణ, చైతన్య పాఠశాలల కన్నా గురుకులాల పాస్ పర్సెంటేజ్ 98.2శాతం వస్తుంది, మీరు చెప్పిన దానికి కచ్చితంగా పరిశీలిస్తాం.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ప్రశ్న నం.639, ప్రశ్న వేసిన వైసీపీ పార్టీ సభ్యులు సభలో లేరు. దీని మీద చిన్న వివరణ ఇవ్వాలనుకుంటున్నాను. సభలో సీనియర్ నాయకులు, మంత్రులుగా చేసినవారు చాలామంది సభ్యులు ఉన్నారు. సభ దృష్టికి ఒక విషయాన్ని తీసుకురావలసిన అవసరం ఉంది. ఈ సమావేశాలలో దురదృష్టవశాత్తు దాదాపు 25 ప్రశ్నలకు సభలో సమాధానాలు లభించలేదు. వైసీపీ పార్టీ గౌరవసభ్యులు ప్రశ్నలు వేస్తున్నారు కానీ సభకు రావడం లేదు. వారు ప్రశ్నలు వేయడం వల్ల ఇతర సభ్యులు మాట్లాడే అవకాశం కోల్పోతున్నారు. అలా చేయడం ప్రజాస్వామ్యంలో సమంజసం కాదు. ప్రశ్నలు అడగడానికి వారు సభలో ఉండటం లేదు. వారు వేసిన ప్రశ్నలు వస్తున్నాయి కానీ సభకు రాని కారణంగా ఇతర సభ్యులు ప్రశ్నలు అడిగే అవకాశాన్ని కోల్పోతున్నారు, అలా జరగడం చాలా దురదృష్టకరం.

సభకు ఎన్నికైన గౌరవసభ్యులు గౌరవంగా సభకు రావాలి. సభకు వెళ్లి సమస్యలపై మాట్లాడాలని వారిని ప్రజలు ఎన్నుకున్నారు. ఎవరికీ కనిపించకుండా దొంగల్లా వచ్చి సభ్యుల హాజరుపట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. వారు గౌరవసభ్యులు, ప్రజలు ఎన్నుకున్నారు, గౌరవప్రదమైన హోదాలో ఉండి, దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టే కర్మ ఏమిటి? హాజరుపట్టీలో సంతకం చేసి సభకు మొహం చాటెయ్యడం వారికి గౌరవాన్ని తగ్గించేదే తప్ప పెంచేది కాదని నా అభిప్రాయం. నా దృష్టికి వచ్చిన పేర్లను చెబుతాను, వై.బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, రేగం మత్యలింగం, విరూపాక్షి, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, దాసరి సుధ గార్లు.

24-02-2025న గవర్నర్‌గారి ప్రసంగం ముగిసిన తరవాత వేరు వేరు తేదీల్లో హాజరుపట్టీలో సంతకాలు పెట్టినట్లు నా దృష్టికి వచ్చింది. దొంగచాటున వచ్చి దొంగల మాదిరి సంతకాలు పెట్టాల్సిన అవసరం లేదు. హాజరుపట్టీలో సంతకాలు ఉన్నాయి గానీ సభలో వారెవ్వరూ నాకు కనిపించలేదు, ఇక్కడున్న సభ్యులకు ఎవరికైనా కనిపించారా?

(లేదు, లేదు అని కొంతమంది సభ్యులు అన్నారు)

అలా చేయడం ఎంతవరకు సమంజసమో వారే నిర్ణయించుకోవాలి. మనల్ని ఎన్నుకున్న ప్రజలకు ఆదర్శంగా నిలవాలే తప్ప ఓటు వేసిన ప్రజలకు తలవంపులు తెచ్చేవిధంగా ప్రవర్తించకూడదని నా అభిప్రాయం. ఆ విషయాలను సభ ముందు ఉంచాలని అనుకున్నాను. వారు సభకు రాలేదు కనుక వారు వేసిన ప్రశ్నను deemed to have been answeredగా ప్రకటిస్తున్నాను.

GREENKO PROJECT IN KURNOOL

Question No.639 (126)

SARVASRI Y.BALANAGIREDDY, B.VIRUPAKSHI, MLAs.

Will the Minister for Energy be pleased to state:

a) the stage at which the proposed Greenko project in Kurnool district stands at present;
b) the details of investment made and employment generated through the said project and
c) the inception details of the project?

HON'BLE MINISTER OF ENERGY (SRI GOTTIPATI RAVIKUMAR):

a) With respect to 1680MW Pumped Storage Project, all the civil and hydromechanical works are substantially completed, with only minor works remaining in the upper reservoir and penstock areas, which are expected to be completed shortly. The Project comprises of eight units (6x240MW, 2x120MW) and they are in various stages of commissioning. All units are scheduled for commissioning by the end of March 2025.
b) The total project cost of Pinnapuram Pumped Storage Project is ₹10,000Crores This is in addition to ₹13,700Crores investment pertaining to 2800MW Solar projects. During peak construction period, Pinnapuram Pumped Storage Project generated employment for 9,000 people which includes technical and non-technical construction jobs. In addition to that, the project will generate 1,500 jobs during operations.
c) The Pumped Storage Project construction was started during June 2021 which is under trial run and scheduled for commissioning by 31.03.2025.

వక్ఫ్ ఆస్తుల రికార్డుల డిజిటైజేషన్
DIGITISATION OF RECORDS OF WAQF PROPERTIES

ప్రశ్న నం.551(3)

శ్రీ ఎం.షాజహాన్ బాషా, ఎమ్మెల్యే

SRI M.SHAJAHAN BASHA, MLA

గౌరవనీయులైన న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలిపెదరా ;

అ) రాష్ట్రంలో డిజిటైజేషన్ చేసిన వక్ఫ్ ఆస్తుల వివరములు ఏమి;

ఆ) ఆక్రమణలకు గురైన, న్యాయ వివాదం లేని ఆస్తుల వివరములు ఏమి;

ఇ) వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళిక ఏమి?

గౌరవనీయులైన న్యాయ; మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ నశ్యం మహమ్మద్ ఫరూక్)ః

HON'BLE MINISTER OF LAW & JUSTICE; MINORITY WELFARE (SRI NASYAM MOHAMMED FAROOK):

అ) వక్ఫ్ ఆస్తుల డిజిటైజేషన్ వివరాలు అనుబంధంలో–ఎలో జతపరచడమయింది.

ఆ) ఆక్రమణకు గురైన, వ్యాజ్యరహిత ఆస్తుల వివరాలు అనుబంధంలో–బిలో జతపరచడమయింది.

ఇ) వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యచరణ ప్రణాళికను అనుబంధం–సి లో జతపరచడమయింది.

అనుబంధం - ఎ			
జిల్లాల వారీగా వక్ఫ్ ఆస్తుల డిజిటైజేషన్ వివరాలు			
వరుస సంఖ్య	పూర్వపు జిల్లా పేరు	మొదటి సర్వే ప్రకారం సంస్థల సంఖ్య	ఎకరాలు – సెంట్లలో విస్తీర్ణం మొత్తం
1	2	3	4
1	శ్రీకాకుళం	41	1671.22
2	విజయనగరం	36	23.54
3	విశాఖపట్నం	80	7800.61
4	తూర్పు గోదావరి	185	1810.70
5	పశ్చిమ గోదావరి	137	971.23
6	కృష్ణా	372	2663.56
7	గుంటూరు	309	3670.83
8	ప్రకాశం	237	4321.52
9	నెల్లూరు	208	1279.50
10	చిత్తూరు	186	6671.00
11	అనంతపురం	330	10340.00
12	వైఎస్ఆర్ కడప	277	1960.27
13	కర్నూలు	1104	22599.90
మొత్తం		3502	65783.88

గమనిక: వక్ఫ్ రికార్డులు అంటే గెజిట్ & సర్వే కమీషనరు నివేదికలు ఏపి ఆన్‌లైన్ వెబ్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయడమయింది. ఆర్ఎస్ఆర్ గ్రామ మ్యాప్‌లు మరియు ఇతర సంబంధిత పత్రాల వంటి రెవెన్యూ సంబంధిత రికార్డులను డిజిటైజ్డ్ చేయాల్సి ఉంది మరియు ప్రక్రియలో ఉంది.

అనుబంధం – బి

స్వాధీనం చేసుకున్న, అన్యాక్రాంతం చేసిన, కోర్టు కేసులో కోల్పోయిన వక్ఫ్ భూముల జిల్లాల వారీగా స్థితి ఆక్రమణ మరియు ఆక్రమణ విముక్తి పునర్ వ్యవస్థీకరణ

వరుస సంఖ్య	పూర్వపు జిల్లా పేరు	మొదటి సర్వే ప్రకారం సంస్థల సంఖ్య	ఎకరాలు – సెంట్లలో విస్తీర్ణం మొత్తం	వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు ఎకరాలు - సెంట్లలో	వక్ఫ్‌బోర్డు బదలాయించిన ఎకరాలు - సెంట్లలో	వివిధ కోర్టు కేసులలో వివాదంలో ఉన్న వక్ఫ్ భూములు ఎకరాలు -సెంట్లలో	రెవెన్యూ శాఖతో వివాదంలో (ఇనాంరద్దు చట్టం ప్రకారం / భూముల పునరుద్ధరణ క్రింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు) ఎకరాలు - సెంట్లలో	ఆక్రమణ క్రింద గుర్తించిన భూములు ఎకరాలు – సెంట్లలో	దావా మరియు ఆక్రమణ రహిత భూములు విముక్తి పొందిన (4-5-6-7-8-9)ఎకరాలు – సెంట్లలో
1	2	3	4	5	6	7	8	9	10
1	శ్రీకాకుళం	41	1671.22	0	0	0	1115.14	261.55	294.53
2	విజయనగరం	36	23.54	0	0	0	0	0	23.54
3	విశాఖపట్నం	80	7800.61	2598.20	0	0	2172.95	2226.42	803.04
4	తూర్పు గోదావరి	185	1810.70	18.43	0	0	0	1659.17	133.10
5	పశ్చిమ గోదావరి	137	971.23	0	0	0	0	667.31	303.92
6	కృష్ణా	372	2663.56	299.99	149.61	0	0	984.08	1229.88
7	గుంటూరు	309	3670.83	144.28	53.58	329.22	0	467.81	2675.94
8	ప్రకాశం	237	4321.52	0	20.68	0	0	3299.25	1001.59
9	నెల్లూరు	208	1279.50	0	4.10	0	0	1040.21	235.19
10	చిత్తూరు	186	6671.00	12.49	0.06	0	4747.35	146.84	1764.26
11	అనంతపురం	330	10340.00	86.80	0	0	6797.00	290.45	3165.75
12	వైఎస్ఆర్ కడప	277	1960.27	47.61	0	0	0	371.46	1541.20
13	కర్నూలు	1104	22599.90	1200.42	0	639.84	1918.64	2459.51	16381.49
	మొత్తం	3502	65783.88	4408.22	228.03	969.06	16751.08	13874.06	29553.43

అనుబంధం-సి

- చట్ట వ్యతిరేక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం కోసం ఏపీ రాష్ట్ర వక్ఫ్ చట్టం, 1995లోని సెక్షన్ 51, 52, 54, 55 ప్రకారం నోటీసులు/అభ్యర్థనలు జారీ చేస్తూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటోంది.
- ఆక్రమణల నివారణ కోసం ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు కూడా జిల్లా యంత్రాంగానికి లేఖలు రాస్తోంది.
- జిల్లా వక్ఫ్ ఇన్స్పెక్టర్, ఆడిటర్లు చర్యలను చేపడుతూ రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారుల సహకారంతో వక్ఫ్ ఆస్తుల చుట్టూ ₹127.97లక్షల వ్యయంతో సుమారు (163) హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం, (130) ఫెన్సింగ్ స్తంభాలను ఏర్పాటు చేయడం, ప్రహరీ గోడలను నిర్మించడం జరిగింది.
- ఖాళీగా ఉన్న వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం వక్ఫ్ చట్టం, వక్ఫ్ ప్రాపర్టీస్ లీజు నియమావళి ప్రకారం వాణిజ్యపరంగా లాభదాయకమైన ఆస్తులను లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించడమయింది.
- ఈ చర్య సంస్థల ఆదాయంతోబాటు సంరక్షణను కూడా పెంచుతుంది. వాటి సంరక్షణ కోసం విస్తారమైన భూములను జియో ఫెన్సింగ్ వేయాలని యోచిస్తోంది. వక్ఫ్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టడమయింది.
- వీటితోపాటు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో వక్ఫ్ భూముల కబ్జాలను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమం (ఐడిఎం) శాఖ,13-10-2014 తేదిగల జి.ఓ.ఎం.ఎస్.నం.18, సాధారణ పరిపాలన (క్యాబినెట్.1) శాఖ, 17-06-2023 తేదిగల జి.ఓ.ఎం.ఎస్.నం.60లను జారీ చేసింది.
- మెమో నంబరు 2479800/ఐడిఎం-1/2024, తేది.09-08-2024, 21-10-2024 తేదిగల లేఖ వక్ఫ్ ఆస్తులను పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఎండబ్ల్యూశాఖ, తేది.13-10-2014, జీఏడీ జి.ఓ.ఎంఎస్.నం.60, తేది.17-06-2023ల ప్రకారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంబంధిత అధికారులందరికీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- జి.ఓ.ఎం.ఎస్.నం.18, తేది.13-10-2024లోని మార్గదర్శకాల ప్రకారం వక్ఫ్ ఆస్తుల సర్వే పురోగతిని సమీక్షించాల్సిన అంశాన్ని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

సభ్యులు అడిగిన సమాచారం అంతా సభాసమక్షంలో టేబుల్‌పై ఉంచడమైంది. వివరంగా చదవాలంటే 10 పేజీల దాకా ఉంది, చాలా సమయం పడుతుంది. అనుమతి ఇస్తే చదువుతాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): సభాసమక్షంలో ఉంచారు.

శ్రీ ఎం.షాజహాన్ బాషా (జహా) SRI M.SHAJAHAN BASHA (JAHA) (మదనపల్లె): అధ్యక్షా, ఇంత పెద్ద ఇష్యూని చావు కబురు చల్లగా చెప్పిన చందంగా గౌరవమంత్రిగారు సమాధానం చెప్పారు. వక్ఫ్ ఆస్తులకు ఎవరూ దిక్కు లేకుండా పోయింది. వాటిని పట్టించుకునే నాథుడు ఎవరూ లేడు. కొన్ని వేల కోట్ల ఆస్తుల గురించి సరైన అవగాహన లేదు, పూర్తి బాధ్యత లేకుండా పోతుంది. కొన్ని విషయాలను సభ దృష్టికి తీసుకొస్తాను. కర్నూలు జిల్లాలో సర్వే నం.524లో దాదాపు ₹500కోట్లు విలువ చేసే 10.40ఎకరాలు కల్లూరు మండలం కల్లూరు గ్రామంలో దుర్వినియోగం అయింది. అందులో డెంటల్ కాలేజ్ ఉంది. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.జయమ్మ పేరుతో రిజిస్టర్ చేశారు.

ఉ.10.10

కర్నూలులోని జులేఖా మసీదుకి ఉన్న 200ఎకరాల భూమి అన్యాక్రాంతం అయింది. సుల్తాన్ మొహమ్మద్ మసీదుకు సెంటు కోటి రూపాయలు ఖరీదు చేసే 4ఎకరాల భూమి కూడా దుర్వినియోగం అయింది. నంద్యాలలో దాదాపు 70ఎకరాలు, కడపలో సర్వే నం.14, 15, 16లో సొందల దర్గాకి చెందిన భూమి దుర్వినియోగమయింది. కడపలోని హజ్‌రత్ రఫ్బీ-షా-వలి దర్గాకు చెందిన దాదాపు 5ఎకరాల 75సెంట్ల భూమి గత ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు దుర్వినియోగపరిచారు. Seven Roads Mosque, సొందల్ పంజాలకు చెందిన సర్వే నం.748, 749లలో ప్రైమ్ ల్యాండ్స్‌ను ఆరోజుల్లో కొందరు కాంగ్రెస్ లీడర్లు దుర్వినియోగపరిచారు. Seven Roadsలో గంజిపీర్‌కి సంబంధించిన తొమ్మిది సెంట్ల ప్రైమ్ ల్యాండ్‌లో ఇప్పుడు కాంప్లెక్స్ కడుతుంటే వక్ఫ్ బోర్డు, సంబంధిత శాఖ ఎక్కడ పని చేస్తున్నాయి? ఇవి మీ దృష్టి తేవాలని చెబుతున్నాను. దేవదాయ, వక్ఫ్ భూములు క్లాసిఫికేషన్‌లో దేవదాయ కిందకి వస్తాయి. ఇవి నిషేధిత జాబితాలో ఉంటాయి. నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ ఈ ఆస్తులు ఎలా రిజిస్టర్ అవుతున్నాయి? రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ ఏం చేస్తున్నాయి? వక్ఫ్ బోర్డుతో కలిసి వారు ఎప్పుడు రెవ్యూలు చేశారు? ఈ భూములపై స్పష్టత ఏముంది? ఇంత ప్రైమ్ ప్రాపర్టీల విషయంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. ఈ అస్తులు ఎవరి గ్రాంటెడ్ ప్రాపర్టీస్ కాదు, ఎలాటెడ్ ప్రాపర్టీస్ కాదు. స్వాతంత్ర్యానికి ముందు ఈ ఆస్తులు జమీందారుల నుంచి వచ్చాయి. వారు 200ఎకరాలను అల్లా పేరుతో ఇచ్చారు. The Donee has granted the grant in the name of the Almighty. దానం చేసిన వారు ఇప్పుడు బ్రతికిలేరు. రాబోయే తరాల భవిష్యత్తు కోసం వక్ఫ్ పేరుతో ఇచ్చిన ఆస్తులపై స్పష్టత లేకుండా, వాటిని కాపాడకుండా పూర్తి స్థాయిలో దుర్వినియోగపరుస్తున్నారు. దీనిపై దాదాపు ఒక గంట చెప్పవచ్చు.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): క్వశ్చన్ అవర్‌లో ప్రశ్న అడగాలి. సమయం చూసుకోవాలి. మీరు కావాలంటే వేరే ఫార్మాట్‌లో రావచ్చు.

శ్రీ ఎం.షాజహాన్ బాషా (జహా) (SRI M.SHAJAHAN BASHA (JAHA)): అధ్యక్షా, ఆన్‌లైన్‌లో వక్ఫ్ ఆస్తుల సమాచారం లేదు. ఈ ఆస్తుల వివరాల డిజిటైజేషన్ జరిగిందా? వక్ఫ్ ఆస్తుల వివరాలు వెబ్‌సైట్‌లో కనపడవు. కోర్టు కేసులు ఉన్నాయి. నోటిఫైడ్ వక్ఫ్ ప్రాపర్టీ 62 గెజిట్‌లో ఉంది. కోర్టు కేసులు ఎలా వస్తాయి? మదనపల్లె నియోజకవర్గంలో వక్ఫ్ సర్వే 25-10-1955న జరిగింది.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): మంత్రిగారూ, మీరు సమాధానం చెప్పండి.

(మాట్లాడేందుకు ఇంకొంత సమయం ఇవ్వాలని గౌరవ సభ్యులు షాజహాన్ బాషాగారు కోరారు)

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): సమయం లేదు. ప్రశ్నోత్తరాల సమయంలో కాదు, వేరే ఫార్మాట్‌లో రండి. మాకు ముందుగా నోటీసు ఇవ్వడమో లేదా రూల్ 307 ద్వారానో రావాలి.

శ్రీ నశ్యం మహమ్మద్ ఫరూక్ (SRI NASYAM MOHAMMED FAROOK): అధ్యక్షా, గౌరవ సభ్యులు షాజహాన్‌గారు వక్ఫ్ బోర్డు ఆస్తుల గురించి చాలా విషయాలు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 63 నుంచి 64వేల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులున్నాయి. వాటిలో దాదాపు 50శాతం అన్యాక్రాంతం అయ్యాయి. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 50శాతం అన్యాక్రాంతం చేశారు. అన్యాక్రాంతం చేసిన వారు ఎవరు? అమ్మినవారు ఎవరు? కొన్నవారు ఎవరు? ముతవల్లీలే అమ్మారు. దాదాపుగా 13వేల నుంచి 14వేల ఎకరాలు అన్యాక్రాంతం అయిపోయాయి. అక్కడ గృహ నిర్మాణాలు, కమర్షియల్ కాంప్లెక్సులు, సినిమా థియేటర్లు వచ్చాయి. ఆ స్థలాలను ఏం చెయ్యాలి, ఏరకంగా వీటిని పరిరక్షించాలో, అభివృద్ధి చేయాలో ఆలోచించాలి.

గౌరవ సభ్యులు చెప్పినట్లు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని నేను కూడా ఒప్పుకుంటున్నాను. ఈ విషయాన్ని నేను గత 40ఏళ్ల నుంచి చెబుతున్నాను. ఇందులో మార్పు తీసుకురావాలి. వక్ఫ్ బోర్డులో ప్రభుత్వాన్ని కల్పించుకోవద్దంటారు కానీ ప్రశ్నలు మాత్రం ప్రభుత్వాన్ని అడుగుతున్నారు. అలాంటప్పుడు ప్రభుత్వం కల్పించుకోకుంటే ఎలా? వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరముంది కాబట్టి వాటికి రిజిస్ట్రేషన్ చెయ్యకూడదని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు నోటీస్ ఇచ్చాం. ఉదాహరణకు సర్వే నం.420 ఉంటే దానికి ఏ, బీ, సీ, డీలు చేర్చి వాటిని రిజిస్టర్ చేస్తున్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను నేనే జాయింట్ సర్వే చేయించాను. తరవాత 10సంవత్సరాలపాటు, రాజశేఖర్‌రెడ్డిగారి పాలనలో కూడా కొంతవరకు సర్వే చేశారు. కానీ జగన్మోహన్‌రెడ్డిగారి ప్రభుత్వం వచ్చిన తరవాత వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సర్వే ఏదీ చేయలేదు. సర్వే చేసే వారికి జీతభత్యాలు కూడా సరిగ్గా అందలేదు.

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత మనం మళ్లీ ఈ పనులు మొదలుపెట్టాం. ఆస్తుల వివరాలను డిజిటైజ్ చేయాలని నిర్ణయించాం. దాన్ని తప్పకుండా చేస్తాం. ఈ విషయం గౌరవ సభ్యులు షాజహాన్‌గారు ఒక్కరికే కాదు ఇతర ముస్లిం సోదరులందరికీ సంబంధించినది. ఇప్పుడు నా

పక్కన కూర్చున్న గౌరవ సభ్యులు కూడా షాదీఖానాలు, మసీదులు, శ్మశానాల కోసం నిధులు కావాలని నన్ను అడుగుతున్నారు. వక్ఫ్ బోర్డు పటిష్టంగా ఉంటే ఈ సమస్యలు రావు. వక్ఫ్ బోర్డును, ఆస్తులను ఏరకంగా పరిరక్షించాలో మీరందరూ ఆలోచించి సలహాలు ఇవ్వాలని కోరుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ వక్ఫ్ ఆస్తులను పరిరక్షించమని సూచించారు. 2001లో వక్ఫ్ ఆస్తుల సర్వే చేశాం. తరవాత కొంత గ్యాప్ వచ్చింది. 2014-19లో మళ్లీ సర్వే చేశాం. తరవాత ఆ మహానుభావుడు అధికారంలోకి వచ్చిన తరవాత ఏమీ పట్టించుకోలేదు. అసెంబ్లీకే రావడం లేదు. దీనిపై ఏం చేయాలో మీరు సలహా ఇవ్వండి. 13వేల ఎకరాలు నంద్యాలలో, కర్నూలులోనే కాదు రాష్ట్రం అంతా ఉన్న వక్ఫ్ భూములను ఆక్రమించుకున్నారు. ప్రభుత్వానికి పవర్స్ ఉన్నాయి, ల్యాండ్ అక్విజిషన్ చేయడానికి కూడా ప్రభుత్వానికి అవకాశముంది.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): మంత్రిగారూ, ఈ సమస్య గురించి అందరికీ తెలిసిందే. మీ ప్రాంతంలోనే కాదు విశాఖపట్నం ప్రాంతంలో కూడా ఆక్రమణలు జరిగాయి. దీనికొక పరిష్కార మార్గం ఆలోచించాలి. 1983 నుంచే ఈ సమస్యను చూస్తున్నాం. ఒక కమిషన్ వేసి లేదా అధికారులు, ఎమ్మెల్యేలతో ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కార మార్గం ఆలోచించి ఖరీదైన వక్ఫ్ భూములను కాపాడుకోవాలి.

ప్రశ్న నం.536

పోలీసు కానిస్టేబుళ్ల నియామకం
RECRUITMENT OF POLICE CONSTABLES

ప్రశ్న నం.536(21)

శ్రీ కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే

SRI KONATHALA RAMAKRISHNA, MLA

గౌరవనీయులైన హోం శాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో పోలీసు కానిస్టేబుల్ పోస్టుల ఖాళీల వివరాలు ఏమి;

ఆ) అవి ఎప్పటిలోగా భర్తీ చేయబడతాయి;

ఇ) 2014 -2019 మధ్య కాలంలో కానిస్టేబుల్ నియామకాలు ఏవైనా జరిగినవా;

ఈ) అయినచో, ఆ వివరములు ఏమి?

గౌరవనీయులైన హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీమతి వంగలపూడి అనిత):

HON'BLE MINISTER OF HOME & DISASTER MANAGEMENT (SMT. VANGALAPUDI ANITHA)

అ) మొత్తం 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, వాటిలో 6,100 పోస్టులకు నియామకం పూర్తయింది. క్యాడెట్ కానిస్టేబుల్స్ శిక్షణ దాదాపుగా పూర్తి చేస్తున్నారు. మిగిలిన 10,762 ఖాళీగా ఉన్నాయి.

ఆ) మిగిలిన 10,762 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల ఖాళీల నియామకానికి ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు సమర్పించడమయింది. సదరు ప్రతిపాదన ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నది.

ఇ) అవునండీ.

ఈ) 2014-2019 కాలంలో మొత్తం 7,623 పోలీస్ కానిస్టేబుల్స్‌కు నియామకాలు చేపట్టడమయింది. వివరాలు కింది దిగువన ఇవ్వడమయింది.

క్రమ సంఖ్య	నోటిఫికేషన్ తేది	వర్గం	భర్తీ చేసిన పోస్టుల సంఖ్య
1	22-07-2016	ఎస్‌సీటీపీసీ (సివిల్)	3,693
		ఎస్‌సీటీపీసీ (ఏఆర్)	1,171
2	27-08-2016	ఎస్‌సీటీపీసీ (కమ్యూనికేషన్)	493
3	01-09-2016	ఎస్‌సీటీపీసీ (మెకానిక్)	25
		ఎస్‌సీటీపీసీ (డ్రైవర్లు)	134
4	12-11-2018	పీసీ (సివిల్)	1,528
		పీసీ (ఏఆర్)	279
		పీసీ (ఏపీఎస్‌పీ)	300
మొత్తం			7,623

శ్రీ కొణతాల రామకృష్ణ (SRI KONATHALA RAMA KRISHNA): అధ్యక్షా, ధన్యవాదాలు. గౌరవ ముఖ్యమంత్రిగారికి, మంత్రిగారికి మీద్వారా అభినందనలు తెలియపరుస్తున్నాను. గతంలో 2014-19లో పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ జరిగింది. మళ్లీ ఇప్పుడు ఆరు వేల మంది పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. ఇంకో పది వేల ఖాళీలను కూడా త్వరలో పూర్తి చేసే ప్రతిపాదన ఉందని తెలియపరిచినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తదుపరి పోలీస్ కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్‌లో ప్రత్యేకంగా ట్రైబల్ బెటాలియన్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నాను.

ఉ.10.20

అధ్యక్షా, అదేవిధంగా కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ అయిన తరవాత ట్రైనింగ్ మాన్యువల్‌లో మార్పులు చేయవలసిన అవసరముంది. సైబర్ సెక్యూరిటీ, ఫ్రెండ్లీ పోలీసింగ్, మోరల్ పోలీసింగ్‌కు సైకాలజీ మీద నూతన పోకడలపై ట్రైనింగ్ ఇవ్వవలసిన అవసరముంది కాబట్టి వాటిపై చర్యలు తీసుకోవాలి. ఇంకొక ముఖ్యమైన విషయం పోలీసులకు సంబంధించి సెలవులు, ఆరోగ్య భద్రత పరిమితిని కుదిస్తున్నారు. గతంలో పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ కింద అన్‌లిమిటెడ్‌గా ఇచ్చేవారు. తరవాత ₹10, ₹5లక్షలు చేశారు. కానీ, ప్రస్తుతం ₹1లక్ష మాత్రమే ఇస్తున్నారు. పెద్ద గాయమైనా, శాశ్వతంగా వైకల్యం వచ్చినా ఆ లక్ష రూపాయలే ఇస్తున్నారు. అఫిషియల్‌గా ఆన్‌డ్యూటీలో ఉన్నప్పుడు వారికి యాక్సిడెంట్ జరిగినా, మావోయిస్టులతో పోరాటం జరిగినప్పుడు ఏమైనా సంఘటనలు జరిగినా కూడా వారికి ఆరోగ్య భద్రత వర్తించడం లేదు. దాని వలన వారు ఆర్థికంగా చాలా ఇబ్బందిపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ₹1,200 నుండి ₹2,000వరకు వారు ప్రీమియం చెల్లిస్తున్నారు. మనం 100 కట్టి టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ₹5లక్షలు ఇన్సూరెన్స్ ఇస్తున్నారు. పోలీసులు ₹1200, ₹2000 ప్రీమియం కట్టినా వారికి ₹1లక్ష మాత్రమే ఇస్తున్నారు. ఆ విధంగా ఇంతవరకూ ఎక్కడా చూడలేదు. దానిని ₹25లక్షలకు పెంచవలసిన అవసరముంది. అంతేకాకుండా Family General Medical Insurance అని ప్రభుత్వ ఉద్యోగులందరికీ ₹2 నుండి ₹3లక్షలు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమంత్రి మోదీగారు ₹5లక్షలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ పథకంలో ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా అమలుపరిచే అవకాశం ఉందా అని అడుగుతున్నాను.

కె.ఎస్.వ్యాస్‌గారు ఉన్నప్పుడు పోలీస్ హౌసింగ్ కింద అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ రేట్ల ప్రకారం పోలీసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఇంతకు ముందు డీపీసీ గురించి మాట్లాడారు. 12 మంది డీఎస్పీలు రెండు మూడు నెలల్లో రిటైర్డ్ అవుతున్నారు. అందువలన ప్రత్యేకంగా డీపీసీ ఏర్పాటుచేసి వాళ్లకు ప్రమోషన్లు ఇస్తే బాగుంటుందని కోరుతున్నాను. (బెల్) ఆర్థికభారం లేకుండా డీపీసీ ఏర్పాటుచేసుకుని నోషనల్ సీనియారిటీతో గానీ అడ్‌హాక్ ప్రమోషన్ గానీ కల్పించవలసిందిగా తమరి ద్వారా మంత్రి గారికి విన్నవించుకుంటున్నాను.

శ్రీమతి వంగలపూడి అనిత (SMT.VANGALAPUDI ANITHA): అధ్యక్షా, ధన్యవాదాలు. సభ్యులు చెప్పినట్లుగా 10వేల కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఇంతకుముందు సమైక్యాంధ్రలో 13వేల మందికి ట్రైనింగ్ ఇచ్చే సామర్థ్యం ఉండేది. రాష్ట్రం విడిపోయిన తరవాత కేవలం 6వేల మందికి మాత్రమే ట్రైనింగ్ ఇచ్చే సామర్థ్యం ఉంది. దాని వలన దశల వారీగా తీసుకుని 6వేలు చొప్పున ట్రైనింగ్ ఇస్తున్నాం. కానిస్టేబుల్స్ నియామకాలలో మెయిన్ ఎగ్జామ్ ఒక్కటే పెండింగ్‌లో ఉంది ఆ అంశం కోర్టు పరిధిలో ఉంది. దానికి కూడా అఫిడవిట్ ఇచ్చి నెల, నెలన్నర లోగా ప్రొసీజర్ అంతా కంప్లీట్ చేసి కొత్తగా కానిస్టేబుల్స్‌ని ట్రైయినింగ్‌కు కూడా పంపిస్తాం. ఇప్పుడు నాలుగు కొత్త ఇండియన్ రిజర్వ్ బెటాలియన్స్

శాంక్షన్ అయి ఓపెన్ చేయడానికి రెడీగా ఉన్నాయి. గౌరవ సభ్యులు సూచించిన మేరకు ట్రైబల్ బెటాలియన్ ఏర్పాటుచేయుటకు కూడా కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. దానిపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించేట్లు మాట్లాడతాం.

గౌరవ సభ్యులు చెప్పినట్లు ట్రైనింగ్ మాన్యువల్స్ ప్రకారం ప్రస్తుతానికి 13డీటీసీలు, 4పీటీసీలున్నాయి. సైబర్ క్రైం, behavioral aspects అన్నీ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ స్థాయి నుండి ఐపీఎస్ ఆఫీసర్ల వరకు కంటిన్యూగా ట్రైనింగ్ ప్రోగ్రామ్ జరుగుతూనే ఉంటుంది. ట్రైనింగ్ మాన్యువల్‌లో ఆ సిస్టమ్ పొందుపరిచాం. సభ్యులు చెప్పిన సూచనల ప్రకారం ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌లో ఇంతకు ముందు కమ్యూనికేషన్ స్కిల్ ఉన్న వారిని, టెక్నికల్ నాలెడ్జ్ ఉన్న వారిని సెపరేట్‌గా తీసుకుని ట్రైనింగ్ ఇచ్చే బాధ్యత తీసుకుంటున్నామని సభ ద్వారా తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఆరోగ్య భద్రత గురించి అడిగారు. అది ఎప్పటినుండో నలుగుతున్న సమస్య. మొన్ననే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి దృష్టికి తీసుకెళ్లాం. డీజీపీ, హోం సెక్రటరీతో రెండు మూడు సమావేశాలు ఏర్పాటుచేసుకుని హైబ్రిడ్ మోడల్‌లో తీసుకెళ్లి ప్రతి పోలీసు కుటుంబానికి ₹10లక్షల నుండి ₹15లక్షల వరకు ఆరోగ్య భద్రత కల్పించడానికి ప్రతిపాదనలు రెడీ చేశాం. త్వరలో ఇంప్లిమెంట్ చేసే బాధ్యత తీసుకుంటాం. గౌరవ సభ్యులు ప్రమోషన్లు గురించి కూడా అడిగారు. వాటిని కూడా పరిశీలిస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీ కొణతాల రామకృష్ణ (SRI KONATHALA RAMAKRISHNA) (అనకాపల్లి): (మైకు లేకుండా) ఎన్టీఆర్ ఆరోగ్య భద్రత.

శ్రీమతి వంగలపూడి అనిత (SMT.VANGALAPUDI ANITHA): ఎన్టీఆర్ ఆరోగ్య భద్రత హైబ్రిడ్ మోడల్‌లోకి మారిపోతుంది. హైబ్రిడ్ మోడల్ తీసుకొస్తే అవన్నీ కవర్ అవుతాయి.

మిస్టర్ స్పీకర్: ప్రశ్న నం.483

కేంద్ర ప్రాయోజిత పథకాలు
CENTRALLY SPONSORED SCHEMES

ప్రశ్న నం.483(30)

సర్వశ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కూన రవికుమార్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్యేలు

SARVASRI DHULIPALLA NARENDRAKUMAR, KOONA RAVIKUMAR, GORANTLA BUTCHAIAH CHOUDARY, MLAs

గౌరవనీయులైన ఆర్థికశాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయములు తెలిపెదరా;

అ) 2019-2024 మధ్యకాలంలో రాష్ట్ర వాటాను విడుదల చేయకపోవడంవల్ల కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు నిరుపయోగమైన విషయం వాస్తవమేనా;

ఆ) అయినచో, శాఖల వారీగా సంవత్సరాల వారీగా ఆ విషయములు ఏమి;

ఇ) నిరుపయోగమైన నిధులను తిరిగి పొందడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమి?

గౌరవనీయులైన ఆర్థికశాఖ మంత్రి (శ్రీ పయ్యావుల కేశవ్):

HON'BLE MINISTER OF FINANCE; PLANNING; COMMERCIAL TAXES & LEGISLATIVE AFFAIRS (SRI PAYYAVULA KESHAV):

అ) అవునండీ.

ఆ) జూన్ 12, 2024 నాటికి (92) కేంద్ర ప్రాయోజిత పథకాలకు చెల్లింపుల విడుదల నిమిత్తం ₹7,230.41 కోట్లు పెండింగులో ఉన్నాయి.

ఇ) మార్చి 3, 2025 నాటికి పేర్కొన్న కేంద్ర పథకాల నిమిత్తం ₹12,336.52 కోట్లు విడుదల చేయడమయయింది. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద శాఖల వారీగా, పథకాల వారీగా పెండింగ్ చెల్లింపులు, తదుపరి విడుదల వివరాలు అనుబంధంలో జతపరచడమయింది.

ANNEXURE

(Rs. in Crores)

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
1	Panchayat Raj And Rural Development Secretariat	AP123	Mahatma Gandhi National Rural Employment Guarantee Programme	1,012.86	1,873.57
2	Panchayat Raj And Rural Development Secretariat	AP172	JAL JEEVAN MISSION (JJM)/NRDWM	571.96	875.05
3	Panchayat Raj And Rural Development Secretariat	AP155	PRADHAN MANTRI GRAM SADAK YOJNA	125.32	420.11
4	Panchayat Raj And Rural Development Secretariat	AP428	MGNREGA - Admin	121.42	371.89
5	Panchayat Raj And Rural Development Secretariat	AP168	NATIONAL RURAL LIVELIHOOD MISSION	197.73	298.36
6	Panchayat Raj And Rural Development Secretariat	AP160	Swachh Bharat Mission (Grameen DWS)	98.02	188.40
7	Panchayat Raj And Rural Development Secretariat	AP167	Pradhan Mantri Krishi Sinchayi Yojna-Integrated Watershed Development Program	29.36	111.43
8	Panchayat Raj And Rural Development Secretariat	AP255	NATIONAL RURAL LIVELIHOOD MISSION - RSETI	15.66	15.66
9	Panchayat Raj And Rural Development Secretariat	AP154	Shyama Prasad Mukherjee Rurban Mission	18.64	-
10	Health Medical & Family Welfare Secretariat	AP115	Flexible Pool for RCH & Health System Strengthening, National Health Programme and national urban health Mission	164.71	1,851.09
11	Health Medical & Family Welfare Secretariat	AP73	Human Resources for Health and Medical Education-Establishment of New Medical Colleges	127.45	183.52
12	Health Medical & Family Welfare Secretariat	AP73	Human Resources for Health and Medical Education-Providing Additional Infrastructure to enhanced PG seats in Government Medical Colleges	56.70	56.70

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
13	Health Medical & Family Welfare Secretariat	AP73	Providing additional Infrastructure to enhanced PG Seats in Government Medical colleges	28.98	28.98
14	Health Medical & Family Welfare Secretariat	AP285	Mission Shakti - SAMARTHYA -Pradhan Mantri Matru Vandana Yojana	38.66	113.60
15	Health Medical & Family Welfare Secretariat	AP370	PRADHAN MANTRI AYUSHMAN BHARAT HEALTH INFRASTRUCTURE MISSION (PM-ABHIM)	45.68	45.68
16	Health Medical & Family Welfare Secretariat	AP370	Pradhan Mantri Ayushman Bharat Health Infrastructure Mission (PMABHIM)	13.95	5.92
17	Health Medical & Family Welfare Secretariat		Emergency Response Hospital Strengthening Preparedness Package – Phase II (ECRP-II)	139.30	-
18	Health Medical & Family Welfare Secretariat		NHM-Infrastcture Maintanence	30.27	452.61
19	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP351	SAKSAM ANGANWADI AND POSHAN 2.0 (Supplementary Nutrition Programme)	44.83	569.87
20	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP70	Pradhan Mantri Poshan Shakti Nirman (PM POSHAN) - Cooking Cost	59.26	335.26
21	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP347	SAKSHAM ANGANWADI AND POSHAN 2.0 (ICDS - Anganwadi Services)	32.65	700.45
22	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP349	SAKSHAM ANGANWADI AND POSHAN 2.0 - CONSTRUCTION OF ANGANWADI CENTER BUILDINGS UNDER ICDS/APIP	8.01	8.01
23	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP406	Mission Shakti - SAMARTHYA - SHAKTI SADAN	5.31	14.22
24	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP353	MISSION VATSALYA (Child Protection Services and Child Welfare Services)	4.77	11.92

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
25	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP441	Mission Vatsalya-Swachhata Action Plan(SAP)	0.76	0.76
26	WOMEN CHILDREN DIFFERENTLY ABLED AND SENIOR CITIZENS SECRETARIAT	AP350	SAKSHAM ANGANWADI AND POSHAN 2.0 (Poshan Abhiyan)	0.21	54.10
27	Secondary Education Secretariat	AP291	Samagra Shiksha	238.06	1,403.35
28	Secondary Education Secretariat	AP438	PM SHRI (PM Schools for Rising India)	88.71	236.08
29	Secondary Education Secretariat	AP72	Pradhan Mantri Poshan Shakti Nirman (PM POSHAN) - Honorarium to Cook cum Helpers	15.45	86.37
30	Secondary Education Secretariat		Padhna Likhna Ahiyan (PLA)	0.03	-
31	Agriculture Marketing & Cooperation Secretariat	AP12	RKVY - PMKSY-Per Drop More Crop	41.17	467.01
32	Agriculture Marketing & Cooperation Secretariat	AP81	Rashtriya Krushi Vikasa Yojana (RKVY)	85.94	85.94
33	Agriculture Marketing & Cooperation Secretariat	AP81	Rashtriya Krushi Vikasa Yojana (RKVY)	35.27	31.20
34	Agriculture Marketing & Cooperation Secretariat	AP56	Krishionnati Yojana - Integrated Development of Horticulture	31.13	67.97
35	Agriculture Marketing & Cooperation Secretariat	AP405	Krishionnati Yojana - Oil Palm	29.42	73.60
36	Agriculture Marketing & Cooperation Secretariat	AP343	PM FORMALIZATION OF MICRO FOOD PROCESSING ENTERPRISES PM-FME	19.26	19.26
37	Agriculture Marketing & Cooperation Secretariat	AP17	Krishionnati Yojana -Food and Nutrition Security	16.88	22.56

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
38	Agriculture Marketing & Cooperation Secretariat	AP24	Krishionnati Yojana - Agricultural Extension	2.69	11.80
39	Agriculture Marketing & Cooperation Secretariat	AP414	Digitalization of Primary Agriculture Cooperative Societies	6.24	21.34
40	Agriculture Marketing & Cooperation Secretariat	AP324	RKVY - National Project on Management of Soil Health and Fertility	5.35	9.62
41	Agriculture Marketing & Cooperation Secretariat	AP222	Krishionnati Yojana-Edible Oils (Oilseeds)	1.55	6.56
42	Agriculture Marketing & Cooperation Secretariat	AP329	Krishionnati Yojana - Seed and Planting Material	1.45	2.37
43	Agriculture Marketing & Cooperation Secretariat	AP306	RKVY - Rainfed Area Development (RAD)	0.35	0.35
44	Agriculture Marketing & Cooperation Secretariat	AP283	RKVY - Sub Mission on Agriculture Mechanisation	0.15	5.13
45	Agriculture Marketing & Cooperation Secretariat		Coconut Palm Insurance Scheme	0.03	0.03
46	Agriculture Marketing & Cooperation Secretariat		Implementation of Sericulture Schemes	7.77	7.77
47	Agriculture Marketing & Cooperation Secretariat		PM Fasal Bima Yojana	0.61	-
48	Housing Secretariat	AP259	Pradhan Manthri Awas Yojana (Grameen)	140.82	361.91
49	Housing Secretariat	AP345	PMAY-URBAN-BLC Scheme	1,166.63	-
50	Municipal Administration & Urban Development Secretariat	AP303	Swachh Bharat Mission (SBM) - Urban - Miscelleneous	6.50	-

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
51	Municipal Administration & Urban Development Secretariat	AP411	Swachh Bharat Mission (SBM) - Urban -Solid Waste Management (SWM)	75.95	75.95
52	Municipal Administration & Urban Development Secretariat	AP409	Swachh Bharat Mission (SBM) - Urban - IHHL/CT/PT/ASPIRATIONAL TOILETS	13.54	13.54
53	Municipal Administration & Urban Development Secretariat	AP136	Atal Mission for Rejuvenation and Urban Transformation (AMRUT) Scheme	177.28	3.44
54	Municipal Administration & Urban Development Secretariat	AP419	AMRUT2.0 Project Fund - URBAN REJUVENATION MISSION-500 CITIES (AP419)	751.72	-
55	Municipal Administration & Urban Development Secretariat	AP422	AMRUT 2.0 Reforms	60.00	-
56	Municipal Administration & Urban Development Secretariat	AP410	Swachh Bharat Mission (SBM) - Urban -USED WATER MANAGEMENT(UWM)	99.00	99.00
57	Municipal Administration & Urban Development Secretariat	AP239	Deendayal Antyodaya Yojana-National Urban Livelihoods Mission (DAY-NULM)	7.66	0.77
58	Municipal Administration & Urban Development Secretariat	AP371	MISSION FOR DEVELOPMENT OF 100 SMART CITIES - AMARAVATI	50.00	-
59	Municipal Administration & Urban Development Secretariat	AP396	NATIONAL RIVER CONSERVATION PLAN-OTHER BASINS - GODAVARI	8.84	8.84
60	Home Secretariat	AP363	Modernisation Of Police Forces - Special Central Assistance for Most Left Wing Extremism Affected Districts	45.91	45.91
61	Home Secretariat	AP362	Modernisation of Police Forces -FPS, SIB under SIS	35.73	35.73
62	Home Secretariat	AP333	Modernisation of Police Forces - SRE	10.49	10.49
63	Skill Development Entrepreneurship And Innovation Secretariat	AP224	Deen Dayal Upadhyaya Grameen Kaushalya Yojana DDUGKY (NRLM)	287.17	72.51

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
64	Skill Development Entrepreneurship And Innovation Secretariat		National Apprenticeship Promotion Scheme (NAPS)	6.27	-
65	Skill Development Entrepreneurship And Innovation Secretariat		NATIONAL CAREER SERVICE	1.73	-
66	Tribal Welfare Secretariat	AP300	DEVELOPMENT OF PARTICULARLY VULNERABLE TRIBAL GROUPS (PVTGs)	32.57	32.57
67	Tribal Welfare Secretariat	AP180	SPECIAL CENTRAL ASSISTANCE TO TRIBAL SUB-SCHEMES	14.59	14.59
68	Tribal Welfare Secretariat	AP431	SUPPORT TO TRIBAL RESEARCH INSTITUTES-Creation of Capital Assets (CCA)	1.25	1.25
69	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP451	Livestock Health and Disease Control Programme - ASCAD - Grant for training, awareness etc.	0.34	0.68
70	Tribal Welfare Secretariat	AP187	POST MATRIC SCHOLARSHIP to STs	114.71	106.53
71	Tribal Welfare Secretariat		Grants under proviso to Article 275(1) of the Constitution	23.21	37.87
72	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP432	Livestock Health and Disease Control Programme - ESVHD-MVU	16.71	32.03
73	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP397	Livestock Health and Disease Control Programme	10.22	12.47
74	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP427	National Livestock Mission - Livestock Insurance	3.33	5.92
75	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP404	National Livestock Mission - Assistance For Quality Fodder Seed Production	2.72	3.42
76	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP402	National Livestock Mission - SEMINARS	2.05	2.05

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
77	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP403	National Livestock Mission - TRAININGS	0.35	0.60
78	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP408	Livestock Census and Integrated Sample Survey - INTEGRATED SAMPLE SURVEY SALARY COMPONENT	0.30	0.42
79	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat	AP407	Livestock Census and Integrated Sample Survey - INTEGRATED SAMPLE SURVEY OTHER COMPONENTS	0.03	0.03
80	Animal Husbandry, Dairy Development & Fisheries Secretariat		National Plan for Dairy Development	17.32	-
81	Social Welfare Secretariat	AP193	PM AJAY - SCA to SCSP	8.79	18.04
82	Social Welfare Secretariat	AP198	SMEPCRA-1995 AND PREVENTION OF ATROCITIES ACT 1989 - INTERCASTE MARRIAGES	2.67	2.71
83	Social Welfare Secretariat	AP148	Pre-Matric Scholarship to SCs	42.95	-
84	Planning Secretariat	AP145	IRRIGATION CENSUS-ROMIS	0.20	0.65
85	Consumer Affairs, Food and Civil Supplies Secretariat	AP433	Assistance to StateAgencies for intra-State Movement of foodgrains and FPS dealers margin under NFSA	105.44	-
86	Environment, Forests, Science & Technology Secretariat	AP25	Project Elephant	0.05	0.31
87	Backward Classes Welfare Secretariat	AP146	PM-YASASVI Post- Matric Scholarship for OBC, EBC & DNT	222.97	-
88	Backward Classes Welfare Secretariat	AP144	PM-YASASVI Pre- Matric Scholarship for OBC, EBC & DNT	31.51	-
89	POLAVARAM PROJECT		Canals and Distributaries	0.10	66.34

S.No.	DEPARTMENT	SLS Code	SLS name	Amount Pending till 12.06.2024	Amount Released from 12.06.2024 to 03.03.2025
90	POLAVARAM PROJECT		Project Establishment under Chief Engineer, Polavaram Project	8.72	124.06
91	WATER RESOURCES SECRETARIAT		PMKSY - Har Khet Ko Pani - RRR of WBs Scheme	2.04	-
92	YOUTH ADVANCEMENT, TOURISM AND CULTURE SECRETARIAT		National Service Scheme (NSS)	0.05	0.44
	Grand Total			**7,230.41**	**12,336.52**

శ్రీ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (SRI DHULIPALLA NARENDRAKUMAR) (పొన్నూరు): అధ్యక్షా, గౌరవ మంత్రిగారి సమాధానంలో 06.12.2024 నాటికి దాదాపు ₹7,200కోట్లు పెండింలో ఉన్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ₹12,366కోట్లుగా చెప్పారు. జూన్ 12 నాటికి సమాధానంలో చూపిన దాని కంటే కొన్ని కాంపొనెంట్స్‌లో ఎక్కువ రిలీజ్ చేశారు. ఎందుకంటే 12.06.2024నాటికి ఉదాహరణకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కింద ₹1,000కోట్లు అయితే పేమెంట్ ఇవ్వవలసిన పెండింగ్ బిల్లు కింద దాదాపు ₹1,800కోట్లు రిలీజ్ చేశారు. ఆవిధంగా చెబితే చాలా ఉంది. ఆ తరవాత ₹571కోట్లయితే ₹875కోట్లు, ₹125కోట్లయితే ₹420కోట్లు, ₹121 కోట్లయితే ₹371కోట్లు పెండింగ్ కింద చెల్లించాల్సిన దాని కంటే మొత్తం ₹5వేల కోట్లు అదనంగా చెల్లించినట్లు మంత్రిగారి సమాధానంలో చెప్పారు. దానికి కారణాలు ఏమిటని నేను మంత్రిగారిని అడుగుతున్నాను.

గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులు మళ్లించడం వలన వాటితోబాటు ₹12వేల కోట్లు నిధులు విడుదల చేశారా, లేదా అనేది చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను. అదే విధంగా కొన్ని కాంపొనెంట్స్‌కి పేమెంట్స్ చేయవలసిన అవసరముంది. 2019–2024 మధ్య రాష్ట్రంలో 92 కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు ఉన్నాయని చెప్పారు. అవే పథకాలు ఉన్నాయా, ఇంకా ఎక్కువ ఏమైనా ఉన్నాయా అనేది చెప్పాలి. దాని నిమిత్తం రాష్ట్రంలో మొత్తం ఎంత పనిచేశారు? 92 పథకాల ద్వారా చేయవలసిన పని ఎంత? చేసింది ఎంత? దానిలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎంత? రాష్ట్ర ప్రభుత్వం ఎంత రిలీజ్ చేయాలి? అదే విధంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులలో ఎంత డైవర్ట్ చేశారో తెలియజేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

గతంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రాగానే మాయమైపోయి ఎక్కడికో వెళ్లిపోయాయి. అలాగే రాష్ట్రంలో కొవిడ్‌తో మరణించిన వారికి ఒక్కొక్కరికి ₹50వేల చొప్పున ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే, ఆ మొత్తం ₹1100 కోట్లు డైవర్ట్ చేశారు. అంతకంటే దారుణం ఏమి ఉంటుంది? గత ప్రభుత్వంలో కొవిడ్‌తో వందల మంది మరణిస్తే ఆ కుటుంబాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం పొందలేదు. 2019-24 మధ్య మన రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను తీసుకుంది? దానిలో కేంద్ర ప్రభుత్వం వాటా ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంత? దానిలో డైవర్ట్ చేసిన మొత్తం ఎంతో చెప్పవలసిన అవసరముంది. వాటిని డైవర్ట్ చేయడం వలన రాష్ట్రంపై పడిన ఆర్థికభారం ఎంత? ఎందుకంటే దాని వలన మనం బయట అప్పులు తెచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ వెసులుబాటు తగ్గడంతో అదనపు భారం పడింది. ఎన్నివేల కోట్ల రూపాయలు రాష్ట్రప్రభుత్వం నష్టపోయింది? రాష్ట్ర ప్రభుత్వం మీద అదనపు భారం ఎంత పడిందో చెప్పాలని నేను గౌరవ ఆర్థిక మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.10.30

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): కూన రవికుమార్‌గారూ, కాస్త టైమ్ దృష్టిలో పెట్టుకుని మాట్లాడండి.

శ్రీ కూన రవికుమార్ (SRI KOONA RAVIKUMAR) (ఆమదాలవలస): అధ్యక్షా గౌరవ సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌గారు చాలా వరకు అన్ని ప్రశ్నలు కవర్ చేశారు, నేను ఒకటే అడుగుతాను. ₹7,230కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అంటే గౌరవ సభ్యులు అడిగినట్లు ఈ డబ్బును డైవర్ట్ చేశారా, ఆ నిధులు 60శాతానికి సమానమా లేక 100శాతానికి సమానమా అనే క్లారిటీ ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చే ప్రతి పథకంలో 60 శాతం కేంద్రానిది, 40శాతం రాష్ట్రానిది ఉంటుంది. ₹7,230కోట్లు 60శాతానికి సమానమా లేక 100 శాతానికి సమానమా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 03.03.2025 నాటికి ₹12,336కోట్లు విడుదల చేశామని చెప్పారు. అనుబంధంలో చూస్తే 92 ప్రాయోజిత పథకాలు అన్నారు. ఆ 92 పథకాలు కాకుండా ఇంకా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏమైనా ఉన్నాయా? ఎందుకంటే ఇందులో నాకు కొన్ని పథకాలు కనపడలేదు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ఉంది. 2014-19లో బీపీఎల్ ఫ్యామిలీలలో ఎవరైనా చనిపోతే ఆ కుంటుంబ సభ్యులు అప్లై చేసుకుంటే ఆ కుటుంబానికి ₹25వేలు వస్తాయి. ఇప్పుడు ఆ పథకం ఈ లిస్ట్‌లో ఉందో లేదో తెలియడం లేదు. 2019-24మధ్య కాలంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో బీపీఎల్ ఫ్యామిలీలో చనిపోయిన అర్హత ఉన్నవారికి ఒక్కరికి కూడా ఆ పథకం వర్తించలేదు. అంటే నిధులు వచ్చి వర్తించలేదా, లేకుంటే జగన్మోహన్‌రెడ్డి పేదవాడి శవాల మీద కూడా పేలాలు ఏరుకునే ప్రభుత్వం కాబట్టి ఆ నిధులు కూడా డైవర్ట్ చేశారా ? ఇంకా ఇటువంటివి ఎన్ని ఉన్నాయి?

రెండవది గతంలో జగన్మోహన్‌రెడ్డిగారు చంద్రన్న బీమా కంటే దాని అమ్మ కంటే మించిన పథకాన్ని పెడుతున్నానని వైఎస్ఆర్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. వైఎస్ఆర్ బీమా యోజన చూస్తే రాష్ట్రంలో ఆరువేల క్లెయిమ్స్‌కు నిధులు రాలేదు. ఎందుకు రాలేదని నేను విచారిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ వారు ఇవ్వలేదు, ఎందుకు ఇవ్వలేదని చూస్తే అందులో కూడా టై అప్ ఫండ్స్ ఉన్నాయి. ఉదాహరణకు నా నియోజకవర్గంలోనే ఒక వ్యక్తి పిడుగుపడి చనిపోయాడు. పిడిగుపడి చనిపోతే వారు ఇచ్చిన నివేదిక ఏమంటే వర్షం పడుతున్నప్పుడు పిడుగు పడే సందర్భంలో అతను భూమి మీద మోకాళ్లు ఆనించి కిందకు వంగి కూర్చోవాలి కానీ వెళ్లి చెట్టు కింద నిలబడ్డాడు. అందుకే పిడుగు పడింది. అందుకే అతను చనిపోయాడు కాబట్టి అతని వైఎస్ఆర్ బీమా యోజన వర్తించదు అని రాసి ఉంది. నా ఎస్సీలు, నా బీసీలు, నా దళితులు, నా రైతులు అంటాడు, మేము ప్రస్తావించిన అంశాలు ఏమంటే జగన్మోహన్‌రెడ్డి అనే ఫ్యాక్షన్ స్వభావం కలిగిన వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటే ఎటువంటి అనర్థాలు రాష్ట్ర ప్రజానీకానికి జరుగుతాయనేది ఇవన్నీ నిదర్శనాలు. వీటి మీద కూడా పూర్తిస్థాయిలో వివరాలు ఇవ్వాలి.

గౌరవ మంత్రివర్యులకు సూటి ప్రశ్న ఏమంటే కేంద్ర ప్రాయోజిత పథకాలు ఎన్ని ఉన్నాయి? వాటిల్లో ఎన్నింటికి 60శాతం, ఎన్నింటికి 70శాతం, ఎన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం టై అప్ చేసింది, ఎన్నింటికి చేయలేదు? ప్రభుత్వం 100శాతం నిధులు విడుదల చేసిందా? అంటే జగన్మోహన్‌రెడ్డి డైవర్ట్ చేసిన నిధులు కూడా ప్రస్తుతం ఉన్న చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వం భరించి ఇచ్చిందా అని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ఒక ప్రశ్న అని చెప్పి పది ప్రశ్నలు అడిగావు. బుచ్చయ్య చౌదరిగారూ, మాట్లాడండి.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (SRI GORANTLA BUTCHAIAH CHOUDARY): అధ్యక్షా, గౌరవ ఆర్థిక శాఖ మంత్రిగారిని ఒక వివరణ కోరుతున్నాను. రాష్ట్రం నుండి కేంద్రానికి ఐటీ, జీఎస్టీ వంటి పన్నుల నుండి ఆదాయం వెళ్లిన నిధులలో తిరిగి ఎంత శాతం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తుంది? నాకు తెలిసినంత వరకు 40శాతం మనకు వస్తుంది. 60 శాతం కేంద్రానికి వెళుతుంది. ఆ 60శాతం నుండే కేంద్ర ప్రాయోజిత పథకాలు వస్తున్నాయి. వివిధ పథకాల క్రింద కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్నది. వాటిని ఉపయోగించుకోకపోతే మనకు వచ్చే దామాషా తగ్గిపోతున్నది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అనేక ప్రాజెక్టులు ఆగిపోయాయి. ఇది ఒక్కటే కాదు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, ఆఖరికి పేదవారికి పంచవలసిన బియ్యం కూడా తప్పుదారి పట్టాయి. 15వ ఆర్థిక సంఘం వలన నష్టం జరిగింది. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదు. దీనిలో ఇప్పుడు క్లారిటీ రావాల్సింది ఏమంటే, ప్రభుత్వం ఇచ్చిన నిధులు ₹12వేలకోట్లు ఆన్‌గోయింగ్ స్కీమ్స్‌లోకి వస్తుందా, లేక పాత దానిలోనే జమ అవుతుందా? జల్‌జీవన్ మిషన్ చాలా మంచి పథకం, అన్ని రాష్ట్రాలు ఉపయోగించుకున్నాయి. ప్రతి

పేదవాడికి త్రాగు నీరు ఇవ్వాలనే లక్ష్యంతో వచ్చిన ఈ పథకాన్ని గత ప్రభుత్వం నీరుగార్చేశారు. ఈరోజు మరలా ఆ పథకాన్ని చేపట్టాలంటే పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. మనకు ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులు ఉన్నా కూడా అనేక పథకాలున్నాయి. గతంలో ఎమ్ఎన్ఆర్ఈజీయస్‌లో రోడ్లు, కాలువల పనులు చేసేవాళ్లు. మొన్న ఒక లక్ష రూపాయలకు మించి విలువైన పనిని కాలువలలో చేయకూడదని అన్నారు. ఆ విషయం గౌరవ మంత్రిగారి దృష్టికి వచ్చిందని అనుకుంటున్నాను. ఎమ్ఎన్ఆర్ఈజీఎస్‌లో కాలువల పనులు, డ్రైనేజీ వ్యవస్థ పనులు జరగడం లేదు. కేంద్రం 60శాతం ఇచ్చే పథకాలను అమలులోకి తీసుకువస్తే రాష్ట్రానికి ఉపయోగంగా ఉంటుంది.

శ్రీ పయ్యావుల కేశవ్ (SRI PAYYAVULA KESHAV): అధ్యక్షా, ధన్యవాదాలు. ముగ్గురు సీనియర్ శాసనసభ్యులు ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారు. అవన్నీ సమాధానం చెప్పాలంటే షార్ట్ డిస్కషన్ అవుతుంది. ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌గారు మాట్లాడుతూ పెండింగ్ నిధుల కంటే ఎక్కువ చెల్లించారని అడిగారు. దానిలో రెండవది డైవర్షన్ ఏమైనా ఉందా అని అడిగారు. ఈ రెండూ కూడా వాస్తవమే. ఇందులో డైవర్షన్ ఉన్నది వాస్తవం. కేంద్రం నుండి వచ్చే ప్రాయోజిత పథకాలలో 60:40 కేటాయింపుల కింద కొన్ని ఉన్నాయి, 70-30 కేటాయింపుల కింద కొన్ని ఉన్నాయి. బ్రాడ్‌గా 60:40 కేటాయింపులకు సంబంధించిన పథకాలు తీసుకుంటే ఆరోజుకి ₹7,230కోట్లు బకాయిలు ఉన్నాయి. కూన రవికుమార్‌గారు 60శాతమా, 100 శాతమా అని అడిగారు. ఇది 100శాతం. ఇందులో 60శాతం ₹4,350కోట్లు కేంద్రం వాటా గత ప్రభుత్వంలో డైవర్ట్ చేశారు. మనం స్కీమ్‌ను రివైవ్ చేయడానికి ₹4,350కోట్లు చెల్లించాల్సి వచ్చింది. మరలా అదనంగా రాష్ట్ర వాటా చెల్లించాల్సి వచ్చింది. రాష్ట్రానికి అసలే ఆర్థిక ఇబ్బందులు ఉన్న పరిస్థితులలో ఒక పథకాన్ని తిరిగి ప్రారంభించడానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చిందనే విషయాన్ని తమరిద్వారా సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాం. ప్రజల దృష్టికి కూడా తీసుకువెళ్లదలచుకున్నాం.

కేంద్రం ₹60/- ఇస్తే రాష్ట్రం ₹40/- కడితే ఎకానమీ నడిచేది, కానీ ఆ ₹60/-ను గత ప్రభుత్వం వాడేశారు కాబట్టి ఎకానమీ స్లోడౌన్ ఎఫెక్ట్ కూడా పడింది. ఈ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం)కు పెద్ద ఎత్తున ₹40వేల కోట్లు కావాలని అడుగుతున్నాం. ₹40వేల కోట్లు ఖర్చు పెడితే ఈ రాష్ట్రానికి సౌకర్యాలు మెరుగుపడడంతోపాటు ట్యాక్సేషన్ కూడా మెరుగుపడుతుంది. కేంద్ర ప్రాయోజిత పథకాలను ఉపయోగించుకోకపోవడం వలన డైరెక్ట్‌గా జరిగిన నష్టం ఒక ఎత్తయితే ఇన్‌డైరెక్ట్‌గా జరిగిన నష్టం చాలా ఎక్కువగా ఉంది. సొసైటీలో మనీ సర్క్యులేషన్ పడిపోవడం వలన ట్యాక్సులు పడిపోవడం జరిగాయనేది వాస్తవం. నరేంద్రగారు మాట్లాడుతూ ఎందుకు ఎక్కువ చెల్లించారని అడిగారు. దానికి కారణమేమంటే ఈ మధ్య కాలంలో అడిషనల్ ఇన్‌స్టాల్‌మెంట్స్ డిమాండ్స్ రెయిజ్ అయ్యాయి. కాబట్టి ఎమ్ఎన్ఆర్ఈజీఎస్ పథకం కంటిన్యూగా జరిగేది. ఆరోజుకు ఉన్న బకాయి ₹1,000కోట్లు అయితే ₹1,800కోట్లు చెల్లించాల్సి వచ్చింది. 12.06.2024 నుండి

30.03.2025 మధ్య కాలంలో ఎక్కువ పని జరగడం, అడిషనల్‌గా కేంద్రం నిధులు ఇవ్వడం వల్ల మన వాటా కూడా పెరిగి మనం అదనంగా చెల్లించాల్సి వచ్చింది.

ఉ.10.40

అన్ని పథకాల్లో ఎక్కడైతే ఎక్సెస్ పేమెంట్లు కనబడుతున్నాయో అవన్నీ అడిషనల్ వర్కుల నిమిత్తం ఇవ్వడం జరిగింది. ఇప్పటివరకు ఆగిపోయిన 94 కేంద్ర ప్రాయోజిక పథకాలలో 74 పథకాలను రివైవ్ చేశాం. పెండింగ్ ఉన్న పథకాలు రెండు రకాలు ఉన్నాయి. కొన్ని పథకాలను కేంద్ర ప్రభుత్వమే ఆపేసింది. వాటి విషయంలో మనం చేయగిలిగింది ఏమి లేదు. మరి కొన్ని పథకాల విషయంలో waiting for funds clearance. మన కంఫర్ట్ ఇంకా పెరగలేదు. కొన్ని పథకాలను ఆన్‌లైన్‌లో స్ట్రీమ్‌లైన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాం. పని విలువ ఎంత? చేస్తుంది ఎంత? ఆ వివరాలు కావాలంటే ప్రస్తుతం సమాధానం చెప్పలేం. ఎందుకంటే ఆన్‌గోయింగ్ ప్రాసెస్ అది. ప్రతి రోజు సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. గౌరవ సభ్యులకు సవివరంగా పథకాల వివరాలను అందించాం. అదనపు సమాచారం కూడా ఇవ్వడం జరుగుతుంది. ₹4,300కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాం. గౌరవ సభ్యులు కూన రవికుమార్ మాట్లాడుతూ 60శాతమా 100శాతమా తెలియజేయమని అడిగారు వంద శాతానికి సమానం. ₹4,300కోట్లు గత ప్రభుత్వంలో డైవర్షన్ జరిగింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆలస్యం కావడం వలన రాష్ట్ర ప్రభుత్వంపై పడిన అదనపు భారం ఎంతని గౌరవ సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అడిగారు. ప్రత్యక్షంగా పడే భారం కన్నా పరోక్షంగా పడే భారం ఎక్కువ ఉంటుంది. ఒక సంవత్సరం మొత్తం ఈ పథకాలు నిలిచిపోవడం వలన, క్షేత్రస్థాయిలో పనులు ఆగిపోవడం, ప్రజలు అసౌకర్యానికి గురికావడం, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కోల్పోవడం, ట్యాక్సేషన్ కోల్పోవడం ఈ రకమైన భారం ఒక రకంగా పడితే, కేంద్రం నిధులు విడుదల చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోతే దాదాపు ₹350కోట్లు పెనాల్టీ వేసింది. దాన్ని మేమైతే పే చేయలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తున్నాం. ఇవాళ ఒక్క రూపాయి కూడా విలువైనది. ₹350కోట్లు పే చేయాల్సి ఉందని తమరి దృష్టికి తీసుకొస్తున్నాం.

నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ వివరాలను తెలియజేయమని గౌరవ సభ్యులు కూన రవికుమార్‌గారు, మొత్తం ఎన్ని పథకాలు ఉన్నాయని మరో ఇద్దరు గౌరవ సభ్యులు అడిగారు. ఇప్పటికి 194 స్కీమ్స్ ఆపరేషన్‌లో ఉన్నాయి. ఒక్కొక్క రాష్ట్రం కొన్ని పథకాలను యాక్టివ్‌గా అమలు చేసుకుంటుంది. కొన్ని రాష్ట్రాలు కొన్ని పథకాలను ఉపయోగించుకోవు. మనం రకరకాల దశల్లో 194 పథకాలను ఉపయోగించుకున్నాం. వాటిల్లో ఆగిపోయిన పథకాల్లోని 94 పథకాలను ప్రయారిటీ క్రింద గుర్తించి రివైవ్ చేయడం జరుగుతోంది. ఇవిగాక పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పులు, అమృత్ స్కీమ్,

ప్రీ–మెట్రిక్ స్కీమ్ లాంటి కొన్ని క్లోజ్ అయిన పథకాలు ఉన్నాయి. వాటిని వదిలేసి, నడుస్తున్న పథకాలను రివైవ్ చేయాలని చూస్తున్నామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

పెద్దలు బుచ్చయ్యచౌదరిగారు మాట్లాడుతూ డెవల్యూషన్ నుంచి మనకు ఎంత వస్తుందని అడిగారు. వారికి మరో ఫార్మాట్‌లో సమాధానం పంపిస్తాను. ఎందుకంటే నా దగ్గర ప్రస్తుతం సమాచారం లేదు. కేంద్ర ప్రాయోజిత పథకాల సమాచారం మాత్రమే ఉంది. కేంద్రం నుంచి రావాల్సిన డెవల్యూషన్ ఎంత అనేది తర్వాత చెబుతాను. కేంద్ర ప్రాయోజిత పథకాల వరకు మాత్రం సింగిల్ నోడల్ ఏజన్సీ అకౌంటు ద్వారా ఇంకా ₹14వేల కోట్లు చెల్లించాల్సి ఉంది.

రాష్ట్రంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
POLES AND TRANSFORMERS IN THE STATES

ప్రశ్న నం.717 (88)
శ్రీ బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే
SRI BATHULA BALARAMAKRISHNA, MLA

గౌరవనీయులైన ఇంధనశాఖ మంత్రిగారు దయచేసి ఈ కింది విషయాలు తెలిపెదరా;

అ) పంపిణీ సంస్థల వారీగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య ఎంత?

ఆ) అదనంగా అవసరమయ్యే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య ఎంత?

గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి (శ్రీ గొట్టిపాటి రవికుమార్):
HON'BLE MINISTER OF ENERGY (SRI GOTTIPATI RAVIKUMAR):

అ) వివరాలను జతచేయడమయింది, సభా సమక్షంలో ఉంచడమయింది.

ఆ) వివరాలను జతచేయడమయంది, సభా సమక్షంలో ఉంచడమయింది.

అనుబంధం-I

ఏపీ డిస్కమ్‌లలో మొత్తం 1,08,47,312 విద్యుత్ స్తంభాలు, 13,68,642 ట్రాన్స్‌ఫార్మర్లు డిస్కామ్‌ల వారీగా వివరాలు క్రింది విధంగా ఉన్నాయిః

క్రమ సంఖ్య	డిస్కమ్	విద్యుత్ స్తంభాల సంఖ్య	ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య
1.	ఏపీఈపీడీసీఎల్	37,30,040 (సుమారు)	3,24,572
2.	ఏపీసీపీడీసీఎల్	44,89,225 (సుమారు)	3,11,954

3.	ఏపీఎస్‌పీడీసీఎల్	26,28,047	7,32,116
మొత్తం		**1,08,47,312**	**13,68,642**

అనుబంధం-II

ఏపీ డిస్కమ్‌లలో అవసరమైన అదనపు విద్యుత్ స్తంభాల సంఖ్య 4,58,942, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు 54,231.

క్రమ సంఖ్య	డిస్కమ్	విద్యుత్ స్తంభాల సంఖ్య	ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య
1.	ఏపీఈపీడీసీఎల్	1,82,644	16,987
2.	ఏపీసీపీడీసీఎల్	1,43,700	12,330
3.	ఏపీఎస్‌పీడీసీఎల్	1,32,598	24,914
మొత్తం		**4,58,942**	**54,231**

శ్రీ బత్తుల బలరామకృష్ణ (SRI BATHULA BALARAMAKRISHNA) (రాజానగరం): అధ్యక్షా, విద్యుత్ స్తంభాల కొరత చాలా ఎక్కువ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేక చాలా ఇబ్బంది పడటమే కాకుండా డ్యామేజీ అయిన స్తంభాలను రీప్లేస్ చేయడంలేదు. గత ఐదేళ్ళలో ఎక్కడ డ్యామేజ్ అయినా పోల్స్‌ను రీప్లేస్ చేయలేదు. అలాగే పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను రీప్లేస్ చేయకుండా ఇబ్బంది పెట్టారు. ఇప్పటికీ అదే జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రాత్రిపూట తిరగాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. మా రాజానగరం నియోజకవర్గంలో ముఖ్యమైన కూడళ్లలో సుమారు 703 విద్యుత్ స్తంభాలు అవసరం. 1851 స్ట్రీట్‌లైట్లు లేక ఇబ్బంది పడుతున్నారు. మా రాజానగరం నియోజకవర్గంలో 83 గ్రామాలు ఉండగా 20 గ్రామాల్లో లైన్‌మెన్‌లు లేరు. లైన్‌మెన్‌లు, మెటీరియల్ లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 350 పెండింగ్ ఉన్నాయి. పెండింగ్ ఉన్న వీటన్నింటినీ తొందరగా క్లియర్ చేసి రైతులను ఆదుకోవాలి. సమ్మర్ ఎంటరవుతుంది కాబట్టి నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజలు చాలా ఇబ్బంది పడతారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ మూలకు వెళ్ళినా మాకు గత ఐదేళ్ళలో జరిగిన ఇబ్బందే ఇప్పుడు కూడా కొనసాగుతోందని చెబుతున్నారు. ఏఈలను, డీఈలను అడిగితే వాళ్ళు చెప్పేదేమంటే గత ఐదేళ్ళలో మెటీరియల్ డ్రా చేయలేదు గనుక మేము అందించలేకపోతున్నాం, త్వరలో క్లియర్ చేస్తామని చెబుతున్నారు. దీంతోపాటు డ్యామేజ్డ్ పోల్స్‌ను రీప్లేస్‌మెంట్ పేరుతో రియల్ ఎస్టేట్ సైట్స్‌లో వేసి అక్రమాలకు పాల్పడిన విషయాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయా అని ప్రశ్నిస్తున్నాను.

అదేవిధంగా, ఇరిగేషన్ కెనాల్ గట్ల మీద, పోరంబోకు పొలాల్లో విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకొని వైసీపీ హయాంలో రైతులు కరెంటును వాడుకున్నారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం

విద్యుత్ కనెక్షన్‌కు అప్లై చేస్తే ఇవ్వని పరిస్థితులు చూశాం. కానీ, అక్రమంగా కెనాల్ గట్ల మీద కనెక్షన్లు ఏర్పాటు చేసుకుంటే పట్టించుకోవడం లేదు. ఇలాంటివి నాలుగైదు ఇష్యూస్ మా రాజానగరం నియోజకవర్గంలో రీసెంట్‌గా వచ్చాయి. ఇరిగేషన్ కెనాల్స్‌ను కూడా కబ్జా చేస్తున్నారు. ఇలాంటిది ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని నేను ప్రశ్నిస్తున్నాను.

శ్రీ కాలవ శ్రీనివాసులు (SRI KALAVA SRINIVASULU): అధ్యక్షా, విద్యుత్ పరంగా వెనుకబడిన మా ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. డీడీ కట్టిన తర్వాత మామూలుగా మూడు నాలుగు నెలలకు కనెక్షన్ ఇస్తే రైతులు చాలా సంతోషపడతారు. ఎందుకంటే, బోర్లు ఆరేడు వందల అడుగులు వేసినా నీరు పడని చోట, నీరు పడినా ఆ బోర్లలోని నీటిని పైరులకు ఉపయోగించుకోలేని దయనీయమైన పరిస్థితి మాది. మా రాయదుర్గం నియోజకవర్గంలో ఏడాది కిందట కట్టిన రైతులకు ఇప్పటికీ వ్యవసాయ కనెక్షన్ ఇవ్వడం లేదు. మాకు జనవరి ఒకటవ తేదీ నాటికి 513 డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్స్ కావాలి. ఈ తొమ్మిది నెలల కాలంలో 36 కనెక్షన్లు ఇచ్చారు. అంతకు మించి ఇవ్వలేదు. నేను గతంలో మంత్రిగారి దృష్టికి తీసుకెళ్ళాను. కండక్టర్ 464.49కిలో మీటర్ల మేర అవసరమైతే దానికి కూడా షార్టేజ్ ఉంది. ఇంతవరకు సరఫరా చేయలేదు. నా నియోజకవర్గంలో కొత్తగా 12 సబ్‌స్టేషన్‌లు అవసరం. సబ్‌స్టేషన్‌లు మంజూరు అయ్యాయి గానీ ఒక్క సబ్‌స్టేషన్ పనులు కూడా ప్రారంభించలేదు. చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రి అయిన తర్వాత డ్రిప్ ఇరిగేషన్‌కు చాలా వెసులుబాటును కల్పించారు. పెద్దయెత్తున రైతులకు డ్రిప్ పరికరాలను అందిస్తున్నారు. ఈరోజు డీడీ కడితే వారం తిరగక మునుపే రైతు పొలంలో డ్రిప్ పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. అదే విధంగా వ్యవసాయ కనెక్షన్ల విషయంలో కూడా మంత్రిగారు ఒక నిర్దిష్టమైన కాల పరిమితిని పెట్టుకొని, డీడీ కట్టిన తర్వాత నెల, రెండు నెలలు, మూడు నెలల లోపలైన విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయమని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ.10.50

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (SRI SOMIREDDY CHANDRAMOHAN REDDY) (సర్వేపల్లి): అధ్యక్షా, ఇప్పుడు మంత్రిగారు ఇచ్చిన సమాధానంలో మనకు అవసరమైన విద్యుత్ స్తంభాల సంఖ్య 4,58,942, ట్రాన్స్‌ఫార్మర్స్ 54,231 అని చెప్పారు. నిన్నగాక మొన్న మార్చి 18న 10,000 ట్రాన్స్‌ఫార్మర్స్ కోసం APSPDCL టెండర్లు పిలిచింది. గౌరవ ముఖ్యమంత్రిగారు MSMEలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. యథాతథంగా ఇన్ని సంవత్సరాలుగా చేస్తున్న రెండు పెద్ద కంపెనీలకే ఆ పదివేల ట్రాన్స్‌ఫార్మర్స్ పనిని అప్పజెపుతున్నారు. నేను కోరేదేమంటే 5,000 ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీ కోసం ఐదు MSMEలకు ఇవ్వండి. Transformers manufacturing అనేదేమీ భారీ ప్రాజెక్టు కాదు. రాష్ట్రంలో MSMEలను ప్రమోట్ చేయాల్సిన బాధ్యత మనమీద ఉంది. అలాగే, మిగతా సభ్యులు

చెప్పినట్లు ట్రాన్స్‌ఫార్మర్స్, కండక్టర్స్, పోల్స్ కొరత ఉన్న మాట వాస్తవం. ఆ సమస్య పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని నేను మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ గొట్టిపాటి రవికుమార్ (SRI GOTTIPATI RAVIKUMAR): అధ్యక్షా, ముందు బత్తుల బలరామకృష్ణ గారు విద్యుత్, అగ్రికల్చరల్ అవసరాలకు ట్రాన్స్‌ఫార్మర్స్ కొరత ఉందని అడిగారు. గడచిన ఐదేళ్లలో ఒక్క పోల్ కూడా మార్చలేదని, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్స్‌ని రీప్లేస్ చేయమని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తామని మొన్న కూడా చెప్పాను. రాజానగరం నియోజకవర్గంలో 350 అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మర్స్ పెండింగ్ ఉన్నాయని వారం క్రితమే వేరే ప్రశ్న రూపంలో సభ్యులు అడిగారు. వాటిని కొనుగోలు చేస్తున్నాం. తప్పకుండా వచ్చే వ్యవసాయ సీజన్‌లోగా అందజేస్తామని సభ్యులకు తెలియజేస్తున్నాను. కాలవ శ్రీనివాసులుగారు కొత్తగా సబ్‌స్టేషన్లు కావాలని అడిగారు. కచ్చితంగా అక్కడున్న లోడ్ ప్రకారం, పరిస్థితుల ప్రకారం మంజూరు చేస్తాం. APSPDCL కింద 22 సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచాం. Load factorను బట్టి వరుసగా రైతులకు అందిస్తామని తెలియచేస్తున్నాం. 513 ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు ఇంకా పెండింగ్ ఉన్నాయని సభ్యులు చెబుతున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రాబోయే సీజన్‌లో వాటిని అందిస్తామని తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, చంద్రమోహన్‌రెడ్డిగారు APSPDCL కింద 10,000 ట్రాన్స్‌ఫార్మర్లు ఒకే కంపెనీకి ఇస్తున్నామని చెప్పారు. గడచిన ఐదేళ్లలో 90 శాతం ఒక కంపెనీకి, 10 శాతం ఒక కంపెనీకి ఇచ్చే ప్రక్రియ ఉంది. ఇప్పుడు అలా కాకుండా MSMEలను ప్రోత్సహిస్తున్నాం. టెండరు ప్రక్రియలో అందరూ పాల్గొనే విధంగా కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటాం. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్ ధరలు విపరీతంగా ఉండేవి. డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన టీమ్‌ని ఇతర రాష్ట్రాలకు పంపించి అక్కడ ఏమేరకు ధరలున్నాయో తెలుసుకున్నాం. ఒక్కోటి ₹4,400 ₹4,600లు పైన ఉన్నది. పోల్స్ నాణ్యత బట్టి ధరలుంటాయి. 9.1 మీటరు ఉండే పోల్స్, 8 మీటర్లు ఉండే పోల్స్ ధర ₹4,600 నుండి ₹3,750కు తగ్గించాం. పూర్తిగా ధరలు తగ్గించుకుంటూ పోతే నాణ్యత ఉండదు. క్వాలిటీతోబాటు, రేట్లు కూడా తగ్గాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నాం. ట్రాన్స్‌ఫార్మర్స్ కూడా 16కె.వి., 25కె.వి., 40కె.వి., 63కె.వి. వంటివి ఉంటాయి. రైతులకు, పరిశ్రమలకు, కమర్షియల్ వాడకానికి తగ్గట్లు కెపాసిటీ, క్వాలిటీ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ రేటుకు ఎక్కువ కంపెనీలు టెండర్లలో పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ప్రశ్నోత్తరాలు ముగిసింది. సభ్యులకు గమనిక. నిన్న, మొన్న అందరం కలిసి క్రీడాపోటీలను నిర్వహించుకున్నాం. సభ్యులంతా ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి గారి లాంటి పెద్దలు కూడా వయసుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. మేము ఊహించినదానికంటే బ్రహ్మాండంగా మహిళా సభ్యులు అందరూ రెండు రోజులూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయవాడ ప్రజానీకం కూడా నేషనల్ స్పోర్ట్స్ మీట్ చూసేందుకు వచ్చినట్లు

స్టేడియంకు వచ్చారు. చాలా సంతోషం. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ రోజు మన సభ్యులు విభిన్న కళారంగాల్లో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తారు. ఇప్పటికే కొంతమంది పేర్లు ఇచ్చారు. డిప్యూటీ స్పీకర్ కూడా అభినయిస్తారు. సభ్యులందరికీ మరోసారి ధన్యవాదాలు. ఆర్థిక శాఖమంత్రి ఈరోజు మనందరికీ విందు ఏర్పాటు చేశారు. ఈ రోజు సాయంత్రం 4.00 గంటలకు 'A convention'లో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాధారణంగా గ్రౌండ్‌లో పెట్టాలనుకున్నాం కానీ, ఇటీవల సంభవించిన వరదల కారణంగా అనుకూలంగా లేనందున వేదికను మార్చడమైంది. సభ్యులందరూ ఈ రోజు సాయంత్రం 4.00 గంటలకు 'A convention'కు చేరుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా ఈ కార్యక్రమానికి వస్తున్నారు. వారి చేతుల మీదుగానే విజేతలకు బహుమతులు ఇవ్వాలనే నిర్ణయం జరిగింది. వారు కూడా అంగీకరించారు. కాబట్టి సభ్యులందరూ హాజరవ్వాలని కోరుతున్నాను.

అంతేకాకుండా, ప్రస్తుత సమావేశంలో చివరి రోజు 20-03-2025 వరకూ కార్యక్రమ పట్టికలో చేర్చిన 37 నక్షత్రపు గుర్తు ప్రశ్నలకు, రెండు నక్షత్రపు గుర్తులేని ప్రశ్నలకు, 3 స్వల్ప వ్యవధి ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు సభా సమక్షంలో ఉంచబడ్డాయి. అవి సభా కార్యక్రమంలో భాగమవుతాయి. ఇంకా సమాధానాలు ఇవ్వకుండా మిగిలిన 156 నక్షత్రపు గుర్తు ప్రశ్నలకు, 10 నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలకు, 20 స్వల్ప వ్యవధి ప్రశ్నలకు 11 సావధాన ప్రశ్నలకు సమాధానాలు నేరుగా సభ్యులకు పంపుతూ ఈ ప్రతిపాదనను శాసనసభ సచివాలయానికి పంపాలని మంత్రులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రశ్నలకు సమాధానాలు మంత్రులు తమ శాఖలద్వారా సభకు పంపడంలో డిలే చేస్తున్నారు. డిలే అవకుండా మంత్రులు బాధ్యత తీసుకోవాలని కోరుతున్నాను.

శాసనసభలో చాలా బిల్స్ పాస్ చేశాం. అవన్నీ శాసనమండలి ఆమోదం పొందాలి. మనం పంపిన బిల్స్ పైన గౌరవ శాసనమండలి అధ్యక్షుల వారి నుండి వర్తమానం అందింది.

ప్రకటన (ANNOUNCEMENT)

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): మార్చి, 17, 2025న శాసనసభ సమావేశాల్లో ఆమోదించి శాసనమండలికి పంపిన "ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంత) ఆయుర్వేద, హోమియోపతి వైద్యవృత్తిదారుల రిజిస్ట్రీకరణ (సవరణ) బిల్లు, 2025" ప్రతిని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి కార్యనిర్వహణ విధాన నియమావళిలోని 147వ నియమం కింద శాసనసభ ఆమోదించిన రూపంలోనే తిరిగి పంపుతున్నాం.

బిల్లు నం.3, "ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంత) ఆయుర్వేద, హోమియోపతి వైద్యవృత్తిదారుల రిజిస్ట్రీకరణ (సవరణ) బిల్లు, 2025" 18-03-2025న ఎలాంటి సవరణలు లేకుండా శాసనమండలిలో కూడా ఆమోదించి పంపడమైంది. అదే విధంగా మార్చి 18-03-2025, 19-03-2025న జరిగిన

సమావేశాల్లో శాసనసభ ఆమోదించి శాసనమండలికి పంపిన ఈ క్రింది బిల్లుల ప్రతులను ఆంధ్రప్రదేశ్ శాసనమండలి కార్యనిర్వహణ విధాన నియమావళిలో 147వ నియమం ప్రకారం శాసనసభ ఆమోదించిన రూపంలోనే పంపడమైంది. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సదరు బిల్లులను 19-03-2025న ఎలాంటి సవరణలు లేకుండా ఆమోదించిందని తెలియచేస్తున్నాను.

"ఆంధ్రప్రదేశ్ మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల (సవరణ) బిల్లు, 2025"

"ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయముల (స్థాపన, క్రమబద్ధీకరణ) (సవరణ) బిల్లు 2025"

"ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ బిల్లు, 2025"

"ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ (నం.2) బిల్లు, 2025"

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయుల బదిలీల క్రమబద్ధీకరణ బిల్లు, 2025"

"ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయముల (స్థాపన, క్రమబద్ధీకరణ (రెండవ సవరణ) బిల్లు, 2025"

సభ సమక్షంలో ఉంచే పత్రం (PAPER LAID ON THE TABLE)

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): ఎజెండాలో పేర్కొన్న పత్రం సభా సమక్షంలో ఉంచినట్లుగా భావించాలి.

సభా సమక్షంలో ఉంచబడిన పత్రం:

"అనుసూచిత కులాల ఉపవర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ నివేదిక ప్రతి సమర్పణ"

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): తేనీటి విరామానంతరం జీరోఅవర్ నిర్వహించుకుందాం. ఈరోజు బడ్జెట్ సమావేశాల చివరి రోజు కాబట్టి జీరో అవర్‌కు ఎక్కువ సమయాన్ని కేటాయించాలని నిర్ణయించాం. కాబట్టి సభ్యులు సూటిగా, క్లుప్తంగా మాట్లాడగలిగితే ఎక్కువ మంది సభ్యులకు మాట్లాడడానికి అవకాశం వస్తుంది. ఇప్పటివరకు సభలో మాట్లాడని సభ్యులుంటే, వాళ్లకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కూడా నిర్ణయం తీసుకున్నాం. ఛీఫ్ విప్, మిగతా విప్‌లు కలిసి సమన్వయంతో గౌరవ సభ్యులను సంప్రదించి లిస్ట్ మాకు అందజేయండి. మేము జీరో అవర్‌లో వారికి మాట్లాడే అవకాశం ఇస్తాం. ఇప్పుడు 20 నిమిషాలు తేనేటి విరామం.

(తేనేటి విరామం నిమిత్తం సభ ఉదయం గం.11.01 లకు వాయిదా పడింది.)

ఉ. 11.20

(తేనీటి విరామానంతరం సభ గం.11.25ని.లకు పునఃప్రారంభమైనది.)

(గౌరవ ఉపసభాపతిగారు అధ్యక్ష స్థానం వహించారు.)

తీర్మానం (RESOLUTION)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): జీరో అవర్‌కు ముందు చిన్న ఇష్యూ ఉంది. ఇప్పుడు కూన రవికుమార్‌గారు తీర్మానం ప్రతిపాదిస్తారు.

SRI KOONA RAVI KUMAR: Under rule 77, resolution to address the corruption in District Co-operative Central Banks as well as PACS in Andhra Pradesh, and to appoint a House Committee by AP Assembly. Whereas, District Co-operative Central Banks play a vital role in the rural economy of Andhra Pradesh by providing financial services to farmers, small businesses and low income groups and whereas there have been numerous reports of corruption, mismanagement and fraud in District Co-operative Central Banks as well as District Co-operative societies, leading to losses for depositors and undermining public trust and whereas the interest of farmers and small depositors must be safeguarded to ensure the stability of the rural economy. Thank you.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): కూన రవికుమార్‌గారు ప్రతిపాదించిన తీర్మానం సభ సమక్షంలో ఉన్నది.

తీర్మానానికి అనుకూలంగా ఉన్న వారు 'అవును' అనండి.

వ్యతిరేకంగా ఉన్న వారు 'కాదు' అనండి.

అందరూ అవునన్నారు అందరూ అవునన్నారు.

ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.

కమిటీకి అధ్యక్షత వహించేవారి పేరు, సభ్యుల పేర్లు త్వరలో ప్రకటించడం జరుగుతుంది.

శూన్యగంట (ZERO HOUR)

శ్రీ నల్లారి కిషన్‌కుమార్‌రెడ్డి (SRI NALLARI KISHANKUMARREDDY) (పీలేరు): అధ్యక్షా, ధన్యవాదాలు. సౌత్ ఇండియాలోనే అతి పెద్ద టమాట మార్కెట్ మదనపల్లె, కలికిరి, కలకడలో ఉంది. టమాట రైతులకు రేటు రావడంలేదు. ప్రస్తుతం కేజీ టమాట ₹4, 5లు ఉంది. తద్వారా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టి గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి మార్కెట్ యార్డ్ కమిటీ యాజమాన్యం లేదా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కనీసం కిలో టమాట ధర ₹10, 15గా వచ్చేట్టుగా నిర్ణయించి రైతుల దగ్గర టమాట కొని తద్వారా రైతులను ఆదుకోవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కేవలం మా చిత్తూరు జిల్లాలోనే కాకుండా అనంతపురం, అన్నమయ్య జిల్లా, వైఎస్సార్ కడప జిల్లాలో కూడా లక్షల ఎకరాల్లో టమాట సాగు ఉంది. తక్షణమే టమాట రైతులను ఆదుకోవలసిందిగా మరొకసారి ప్రభుత్వాన్ని కోరుతున్నాను. లేని పక్షంలో రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలతోబాటు కడప, అనంతపురం జిల్లాల్లో

లక్షల ఎకరాల్లో రైతులు టమాట సాగు చేస్తున్నారు. దానితోబాటు మార్కెట్ యార్డ్‌ల్లో వ్యాపారులు క్రయవిక్రయాలపై 10శాతం కమీషన్ తీసుకుని రైతులను మోసం చేస్తున్నారు. దానికి తోడు 600కేజీల టమాటకు దగ్గర దగ్గర 60కేజీల టమాటను తరుగు కింద తీసుకుంటున్నారు. వ్యాపారస్తులు రైతుల దగ్గర కమీషన్లు తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కచ్చితంగా మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా రైతుల దగ్గర టమాట కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మరొకసారి ప్రభుత్వాన్ని వ్యవసాయ శాఖ మంత్రిగారిని కోరుతున్నాను. థ్యాంక్యూ.

శ్రీ నంద్యాల వరదరాజులరెడ్డి (SRI NANDYALA VARADARAJULAREDDY) (ప్రొద్దుటూరు): అధ్యక్షా, ధన్యవాదాలు. చౌక ధరల దుకాణాలకు ఇచ్చే బియ్యాన్ని ప్రభుత్వం జనవరి, ఫిబ్రవరి నెలల్లో రెండు పర్యాయాలు ఇచ్చింది. 23.01.2025న ఒక పర్యాయం, 03.02.2025న మరొక పర్యాయం చౌకధరల దుకాణాలకు బియ్యం ఇచ్చారు. కానీ మొదటిసారి ప్రభుత్వం ఇచ్చిన బియ్యాన్ని చౌకధరల దుకాణాదారులు కార్డుదారులకు పంపిణీ చేశారు. తరవాత రెండవసారి ప్రభుత్వం చౌకధరల దుకాణాలకు సరఫరా చేసిన బియ్యాన్ని మాత్రం చౌకధరల దుకాణా నిర్వాహకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. నెలకు ఒక పర్యాయమే చౌకధరల దుకాణాలకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేయవలసి ఉండగా రెండు పర్యాయాలు అతి తక్కువ రోజుల వ్యవధిలో ఎందుకు ఇచ్చిందో తెలియడం లేదు. గతంలో డీలర్లుగా ఉన్న వాళ్ల దగ్గర కొంతమేరకు బియ్యం నిల్వలు ఉండిపోయాయి. దాని వల్ల కొత్తగా వచ్చిన చౌకధరల దుకాణాదారులకు ప్రభుత్వం ఇచ్చే బియ్యం పరిమాణం తగ్గించింది. గత ప్రభుత్వ హయాంలో డీలర్లు ఎక్కువగా బ్లాక్ మార్కెట్లో బియ్యాన్ని అమ్ముకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అవసరం ఉన్నప్పటికీ డీలర్లకు ఇచ్చే బియ్యం పరిమాణాన్ని తగ్గించడం వల్ల వాస్తవంగా రేషన్ కార్డుదారులకు ఇవ్వవలసిన పరిమాణంలో బియ్యం పంపిణీ చేయడం లేదు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో కార్డుదారులకు బియ్యం ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి గత ప్రభుత్వ హయాంలో ఉన్న చౌకధరల దుకాణాదారుల వద్ద బియ్యం నిల్వలను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత వచ్చిన చౌకధరల దుకాణాదారులకు అప్పగించకపోవడం దుర్మార్గం. అటువంటి వాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయవలసిందిగా నేను కోరుతున్నాను. ప్రస్తుతం ఎండీయూల ద్వారా బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.

ఉ.11.30

గత ప్రభుత్వం ఇంటింటికీ బియ్యాన్ని ఎండీయూల ద్వారా పంపిణీచేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆటోలద్వారా వారు బియ్యాన్ని ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి ఉండేది. ఎండీయూల వారు కిలో బియ్యం ₹12 నుంచి ₹15 చొప్పున డీలర్ల నుంచి తీసుకుని వారు బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయకుండా బ్లాక్‌మార్కెట్లో అమ్ముకుంటున్నారు. డీలర్లు డైరక్టుగా లబ్ధిదారులకు పంపిణీ చేసినపుడే పేదలకు సక్రమంగా బియ్యం పంపిణీ జరుగుతుంది. ఎండీయూల ద్వారా బియ్యాన్ని

పంపిణీ చేయడంతో ఎండీయూ వచ్చిన సమయంలో లబ్ధిదారులు ఇంట్లో ఉంటే తీసుకుంటున్నారు, లేకపోతే లేదు. అందువల్ల ఆటోలద్వారా బియ్యాన్ని పంపిణీ చేసే విధానాన్ని పూర్తిగా ఆపేసి పాత పద్ధతిని ప్రవేశపెట్టడం వల్ల లబ్ధిదారులకు మేలు కలుగుతుంది. గతంలో ఈవిధంగా పంపిణీ చేయని వారిపై కేసులు నమోదుచేయాలి. వేలకోట్ల రూపాయలు వెచ్చించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉచితబియ్యం పథకాన్ని అమలుచేస్తుంటే ఆ బియ్యం లబ్ధిదారులకు చేరడం లేదు. ఆ బియ్యం పేదలకు తప్పకుండా చేరేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

అధ్యక్షా, చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని చాలామంది అమ్ముకుంటున్నారు. కేవలం 30, 40శాతం లబ్ధిదారులు మాత్రమే సొంతానికి ఉపయోగించుకుంటున్నారు. కాబట్టి ఈ విధానాన్ని రద్దుచేసి లబ్ధిదారులకు నగదు బదిలీ చేసే విధానం అమలుచేయడం కోసం ప్రభుత్వం ఆలోచిస్తే బాగుంటుంది. నెలలో రెండుసార్లు కాకుండా ఒకసారి చౌకధరల దుకాణాలకు ప్రభుత్వం బియ్యాన్ని పంపాలి. ఎందుకంటే, అక్రమ మార్గాల్లో వారు బ్లాక్‌మార్కెట్‌కు బియ్యాన్ని తరలించే అవకాశముంది. ఎండీయూల ద్వారా బియ్యం పంపిణీచేసే విధానాన్ని వెంటనే రద్దుచేసి పాతపద్ధతినే కొనసాగించాలని, గతంలో పంపిణీ చేయకుండా బ్లాక్‌మార్కెట్లో బియ్యాన్ని అమ్మినవారిపై చర్యలు తీసుకోవాలని మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR. DEPUTY SPEAKER): గౌరవసభ్యులు చక్కటి సూచన చేశారు.

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ (SRI KANNA LAKSHMINARAYANA) (సత్తెనపల్లి): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని అవసరమైన ప్రాంతాల్లో త్రాగునీరు, సాగునీరు ఇవ్వాలనే సదుద్దేశంతో 2014-19 మధ్యలో గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కోసం ఎత్తిపోతల పథకాన్ని ₹6వేల కోట్ల మంజూరుచేసి టెండర్ల ద్వారా పనులను అప్పగించారు. సంబంధిత కాంట్రాక్టర్లు ఆ పనులకోసం మెటీరియల్‌ను కొనుగోలు చేసి ఎర్రబాలెం, రెడ్డిగూడెం వద్ద ఉంచారు. దురదృష్టవశాత్తూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలుపుదల చేశాడు. ఆ పథకాన్ని పునఃప్రారంభించి త్వరగా గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కోసం ప్రారంభించిన ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేయాలని మీద్వారా జలవనరుల శాఖమంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) (SRI DATLA SUBBARAJU (BUCHIBABU)): అధ్యక్షా, నమస్కారం. నేను ఇరిగేషన్‌కు సంబంధించి మాట్లాడుతున్నాను. మా ముమ్మిడివరం నియోజకవర్గం కాలువ చివరిభాగంలో ఉంది. మా ప్రాంత రైతులంతా సాగునీటి విషయంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. గత ఐదు సంవత్సరాల్లో కాలువలు, డ్రెయిన్లలో ఎక్కడా పూడికతీతలు

తీయకపోవడంతో నీటి సంఘాలు, ఇరిగేషన్ అధికారుల ద్వారా చాలా కష్టపడి నీరందివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే మా ప్రాంతంలో ఉన్న కాలువలు, డ్రెయిన్లలో పూడికతీయించాలి. ఇరిగేషన్ శాఖ వంతులవారీగా నీరివ్వడం వల్ల మా ప్రాంతంలోని చివరి భూములకు నీరందక రైతులంతా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆ కాలువల నుంచే ఆర్.డబ్ల్యు.ఎస్. పథకం ద్వారా త్రాగునీరు కూడా అందివ్వాలి. గౌరవ జలవనరుల శాఖమంత్రి ప్రత్యేకశ్రద్ధ వహించి మా ప్రాంతంలో ఉన్న కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని, మా ప్రాంతంలోని చివరి భూములకు రెండవ పంటకోసం ఏప్రిల్ నెలాఖరు వరకు నీరందించాలని మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు@కొండబాబు (SRI VANAMADI VENKATESWARARAO@ KONDABABU) (కాకినాడ సిటీ): అధ్యక్షా, మత్స్యకారుల్లో కొంతమంది చెరువులపై, కొంతమంది సముద్రంపై ఆధారపడి జీవిస్తారు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం చెరువులపై ఆధారపడే వారికి జీవో నం.217ద్వారా లీజులను రద్దుచేసి ఇబ్బందిపెడితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆ జీవో నం.217ను రద్దుచేసి వారందరికీ మేలుచేసింది. సముద్రంలో వేటకు వెళ్లి చనిపోయిన మత్స్యకారులకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని కూడా గత వైసీపీ ప్రభుత్వం ఇప్పించలేదు. డీప్ ఫిషింగ్‌కు వెళ్లిన బోట్లు ఫైర్ అవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల తుపానులో మునిగిపోవడం జరిగినపుడు ఇన్సూరెన్స్ లేక ఆ మత్స్యకార కుటుంబాలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. వారికి ఇన్సూరెన్స్ మొత్తాన్ని ఇప్పించడంలో ప్రభుత్వం సహకరించాల్సిన అవసరముంది. పాండిచ్చేరిలో జీవో నం.15 తేది.01.06.2009 ప్రకారం మత్స్యకారులకు 90శాతం ఇన్సూరెన్స్ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే భరిస్తున్నాయి. ఆ జీవోను మన రాష్ట్రంలో కూడా జారీచేసి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో ఉన్న సుమారు 26వేల ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెల్లిస్తే సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రయోజనముంటుంది. పాండిచ్చేరిలో ప్రభుత్వమే ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెల్లించి మత్స్యకారులను ఆదుకున్న విధంగా మన రాష్ట్రప్రభుత్వం కూడా అటువంటి జీవోను జారీచేసి ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి మత్స్యకారులను ఆదుకోవాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు@బేబినాయన (SRI R.V.S.K.K.RANGARAO@ BABYNAYANA) (బొబ్బిలి): అధ్యక్షా, ధన్యవాదాలు. బాడంగి మండలంలోని పాల్తేరు గ్రామం, బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామం వేగవతి నది ప్రక్కనే ఆ రెండు గ్రామాలలో సుమారు వెయ్యి నుంచి పదిహేను వందల వరకు వ్యవసాయ పంపుసెట్లున్నాయి. మా ప్రాంతంలో పాల్తేరు గ్రామం వ్యవసాయానికి ఎంతో ఆదర్శవంతమైన గ్రామం. అక్కడి రైతులు చాలా కష్టపడి పనిచేస్తారు. పాల్తేరు వద్ద Comprehensive Protected Water Supply (CPWS) స్కీములున్నాయి. గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలంలో 55గ్రామాలకు, బాడంగి మండలంలో 18 గ్రామాలకు

సీపీడబ్ల్యుఎస్ స్కీములున్నాయి. బాడంగి-పాల్తేరు-అలజంగి మధ్య ఒక చెక్‌డ్యాం-కం-కాజ్‌వే నిర్మిస్తే ఆ వెయ్యి, పదిహేను వందల బోర్లు రీఛార్జ్ కావడానికి అవకాశముంటుంది. సుమారు 75గ్రామాల త్రాగునీటికి సంబంధించిన infiltration wells కూడా రీఛార్జ్ కావడానికి అవకాశముంది. కాబట్టి పాల్తేరు, అలజంగి గ్రామాల రైతులకు సాగునీటితోబాటు 75 గ్రామాల ప్రజలకు త్రాగునీటి అవసరాలను తీర్చే విధంగా చెక్‌డ్యాం-కం-కాజ్‌వేను మంజూరుచేసి ఆ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఉ.11.40

శ్రీ వేగుళ్ల జోగేశ్వరరావు (SRI VEGULLA JOGESWARA RAO) (మండపేట): అధ్యక్షా, మండపేట నియోజకవర్గంలో క్రీడలకు సంబంధించి ఎటువంటి అవకాశాలు లేవు. క్రీడలను ప్రోత్సహించాలని, యువతను ఉత్సాహపరచాలని ప్రభుత్వం చెబుతున్నప్పుడు కనీసం గ్రౌండు సౌకర్యాలు కూడా లేకపోవడాన్ని గమనించి డిసెంబర్ 2016లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు రెండు కోట్ల రూపాయలను మంజూరు చేస్తే తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది.

మండపేట నియోజకవర్గం మండపేట పట్టణంలో హైస్కూల్‌కు 6.98ఎకరాల స్థలం మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా పట్టణంలో నడిబొడ్డున స్థలం ఉంది. రాయవరం మండల కేంద్రంలోని హైస్కూల్‌కు 6.72ఎకరాల స్థలం ఉంది. కపిలేశ్వరపురం మండల కేంద్రంలో 5.24ఎకరాల స్థలం ఉంది. ఆయా స్థలాల్లో మొత్తం నాలుగు స్టేడియాలను ఏర్పాటుచేయాలని మీద్వారా ప్రభుత్వానికి కోరుతున్నాను.

శ్రీ జ్యోతుల నెహ్రూ (SRI JYOTHULA NEHRU) (జగ్గంపేట): ధన్యవాదాలు అధ్యక్షా. 1995లో నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి అయిన తరవాత మా జగ్గంపేట నియోజకవర్గంలో మెట్ట ప్రాంతానికి నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఇచ్చారు. అందులో రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు డిఫంక్ట్ అయ్యాయి. వాటి గురించి సభలో చర్చించేందుకు calling attention to matters of urgent public importance కింద అడిగాను. కాలభావం వల్ల సభ ఇవ్వలేకపోయింది. ఇది ఇరిగేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ కాబట్టి ఇరిగేషన్‌శాఖ మంత్రిగారు సభలో ఉంటే బాగుండేది. వారు సభలో లేనప్పటికీ మీద్వారా నా విన్నపాన్ని తెలియజేసుకుంటున్నాను. పుష్కర ఎత్తిపోతల పథకం చంద్రబాబునాయుడుగారి మానస పుత్రిక. ఈ పథకంలో సెకండ్ ఫేజ్‌లో 31,000ఎకరాలకు నీరు అందించడానికి తాళ్లూరు ఎత్తిపోతల పథకం ఉంది. అది గత ఐదు సంవత్సరాల నుంచి పనిచేయకపోవడం వల్ల రైతులు మూడు పంటలు నష్ట పోయారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల పంటలు బాగా పండాయి. దాని పునరుద్ధరణకు ₹52కోట్ల అంచనాతో ప్రభుత్వానికి పంపారు. వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

2014లో చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి అయిన తరవాత మొల్లేరు మల్లవరం అనే ఎత్తిపోతల పథకాన్ని ఏలేరు నుంచి ఇచ్చి ₹132కోట్లు మంజూరు చేసి పనులు మొదలు పెట్టారు. దురదృష్టవశాత్తు గత ప్రభుత్వంలో అది పడకేసింది. ఈనాటికి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ముందుకు సాగడం లేదు. దానిని కూడా వెంటనే ప్రారంభించాలని కోరుతున్నాను. మన ముఖ్యమంత్రిగారు మంజూరు చేసిన భూపతిపాలెం, సూరంపాలెం రిజర్వాయర్లు నా నియోజకవర్గంలో ఉన్నాయి. సూరంపాలెంలో నీటి లభ్యత తక్కువగా ఉంటుంది. భూపతిపాలెం రిజర్వాయర్ నుంచి నీరు సముద్రానికి వృథాగా పోతుంది. వదుల్ని అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రిగారి ఆలోచన. నీరు సముద్రంలో వృథాగా పోకుండా, సూరంపాలెంను పరిరక్షించడానికి ఉపయోగపడే విధంగా ₹15కోట్లు ఖర్చు పెట్టినట్లైతే ఆ రెండు రిజర్వాయర్లు అనుసంధానం అవుతాయి. ఆ రెండు రిజర్వాయర్లను అనుసంధానం చేసినట్లైతే నికర జలాలతో రెండు పంటలు పండడానికి అవకాశం ఉంటుంది.

ఐదు నియోజకవర్గాలలోని యాభై మూడు వేల ఎకరాలకు నీరు అందించడానికి ఏలేరు రిజర్వాయర్ ఉంది. పంట కాల్వ, వరద కాల్వ ఒకటే కావడం వల్ల వరద వచ్చినపుడు మట్టి చాలా లోతుకు కొట్టుకుపోయి 225 పంట కాల్వలలో నీరు రాని పరిస్థితిల్లో ఉన్నాయి. యాభై మూడు వేల ఎకరాలకు పంటకు సరిపడే నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ, బెడ్ లెవెల్స్ కిందకు పోవడం వల్ల రెండు వేల క్యూసెక్కుల నీరు వదిలితే గానీ చివరి భూముల వరకు నీరు వెళ్లని పరిస్థితులు ఉన్నాయి. సాలీనా పది టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోతున్న పరిస్థితులు ఉన్నాయి. ఆ పది టీఎంసీల నీటిని మనం వాడుకున్నట్లైతే బాగుంటుంది. అది విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు, విశాఖపట్నం సిటీకి మంచి నీటి సౌకర్యాన్ని ఇచ్చే రిజర్వాయర్ కనుక పది టీఎంసీలను మిగుల్చుకున్నట్లైతే రెండింటికీ నీరు ఇవ్వడమే కాకుండా యాభై మూడు వేల ఎకరాలు పండించుకోవచ్చు. విశాఖపట్టణానికి, మా ప్రాంతం మధ్య ఉన్న మెట్ట ప్రాంతాలకు కూడా నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. పది టీఎంసీలను మిగుల్చుకునేందుకు బెడ్ లెవెల్‌ను పెంచాల్సిన అవసరం ఉంది. పైన తెలిపిన కార్యక్రమాలను వెంటనే చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇరిగేషన్‌శాఖ మంత్రి, ముఖ్యమంత్రి గార్లను ప్రత్యేకంగా కలిసి చెబుతానని తెలియజేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): జీరో అవర్‌కు సమయం తక్కువగా ఉంది. వేరే సబ్జెక్ట్‌కు వెళ్లవలసిన అవసరం సడగ్‌గా రావచ్చు కనుక సభ్యులు మాట్లాడేటప్పుడు చాలా క్లుప్తంగా కావలసిన పాయింట్ మాట్లాడితే ఎక్కువమంది మాట్లాడే అవకాశం వస్తుంది.

శ్రీ ఎన్.అమరనాథరెడ్డి (SRI AKEPATI AMARNATH REDDY) (రాజంపేట): అధ్యక్షా, చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతాల్లో తాగునీటికి సంబంధించి సమస్య చాలా తీవ్రమవుతుంది. నా నియోజకవర్గాన్ని కరవు ప్రాంతంగా డిక్లేర్ చేశారు. గడిచిన 2014-19 మధ్యకాలంలో ప్రభుత్వం కైగల్ రిజర్వాయర్‌ను మంజూరు చేసింది. భూసేకరణ చేయడం, రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించడం,

టెండర్స్ కూడా పూర్తి అయి పనులు ప్రారంభించేటప్పటికి కొత్త ప్రభుత్వం వచ్చిన తరవాత ఆపి వేశారు. దాని ద్వారా రెండు మండలాలకు తాగునీటికి సంబంధించిన సమస్య పూర్తి స్థాయిలో నివారించే అవకాశం ఉంటుంది. కైగల్ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోవడం వల్ల నీరు వృథాగా తమిళనాడుకు వెళ్లిపోతున్నది. పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి గంగన్న శిరస్సు ప్రాజెక్టుకు గతంలో స్టేజ్-I క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా తీసుకున్నారు. దాదాపు ఒక కోటి ఘనపుటడుగుల నీరు అక్కడ నిల్వ చేసుకోడానికి, పలమనేరు మున్సిపాలిటీకి, పలమనేరు రూరల్ మండలాలకు తాగునీరు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆ రెండు ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో ఇరిగేషన్‌శాఖ వద్ద ఉన్నాయి. త్వరితగతిన పూర్తి చేసి మంజూరు ఇవ్వగలిగితే కరవు ప్రాంతానికి, తాగడానికి కూడా నీరు లేని పరిస్థితులలో శాశ్వత పరిష్కారం కూడా లభిస్తుంది. నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి పరిటాల సునీతమ్మ (SMT.PARITALA SUNITHAMMA): అధ్యక్షా, వాల్మీకులను మా ప్రాంతంలో బోయలుగా పిలుస్తాం. వారిని ఎస్టీ జాబితాలో చేర్చే అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. మా రాయలసీమలో బోయ కులస్తుల జనాభా ఎక్కువగా ఉంది. వారికి మొదటి నుంచి ప్రాధాన్యత కల్పించింది తెలుగుదేశం పార్టీయే. ఆ సామాజికవర్గానికి చెందినవారు రాయలసీమలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఉన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చమని కొత్తగా అడుగుతున్నది కాదు, గత అరవై ఏళ్లుగా పోరాడుతున్నారు. వారు గతంలో ఎస్టీ జాబితాలో ఉండేవారు, కానీ కొన్ని పరిస్థితుల కారణంగా బీసీలుగా గుర్తించారు. కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్న విషయాన్ని తమరి దృష్టికి తీసుకొస్తున్నాను.

ఉ.11.50

వాల్మీకుల ఆవేదనను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు గతంలో సత్యపాల్ కమిటీ వేశారు. ఆ కమిటీ ఈ అంశాన్ని పూర్తిగా పరిశీలించిన తరవాత ఇదే శాసనసభలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. కానీ ఆ తరవాత వచ్చిన జగన్మోహన్‌రెడ్డిగారి ప్రభుత్వం వాల్మీకులకు ద్రోహం చేసేలా వాల్మీకి బోయల్ని ఎస్టీల్లో చేర్చే విషయంపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడం పూర్తి కాలయాపన చేసేందుకే అని అర్థమయింది. పోనీ ఈ రిపోర్టు వచ్చి వాల్మీకులకు న్యాయం చేశారా అంటే అదీ చేయలేదు. కేంద్రంపై వత్తిడి తెచ్చి వాల్మీకి బోయల చిరకాల కోరిక సమస్యను మరింత పెంచింది. పైగా బోయల్ని ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా చూసే విధంగా వ్యవహరించింది. బోయల పరిస్థితి తెలుసుకోవడానికి కొత్తగా కమిషన్ అవసర లేదన్నది మా అభిప్రాయం. ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఉన్నారు కాబట్టి గతంలో కేంద్రానికి పంపిన శాసనసభ తీర్మానాన్ని పరిశీలించి వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి

చేస్తున్నాను. మాకు బోయలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఇప్పుడున్న ఎస్టీలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా బోయలను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): అందరూ అవకాశం అడిగితే కష్టమండీ, ఇంకా చాలా మంది మాట్లాడాల్సిన వారి పేర్లు ఉన్నాయి. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిగారూ, మాట్లాడండి.

శ్రీ కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి (SRI KOTLA JAYA SURYA PRAKASH REDDY) (డోన్): అధ్యక్షా, ధన్యవాదాలు. డోన్‌లో ప్రతి సంవత్సరం తాగునీటి ఇబ్బంది ఉంటుంది. గతంలో కే.ఈ.కృష్ణమూర్తిగారు డెప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు అక్కడ చెరువులు నింపుకుంటే శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందనే ఉద్దేశంతో ₹150కోట్లతో తెలుగుదేశం ప్రభుత్వం మొదలుపెట్టిన హంద్రీ–నీవా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఈమధ్యనే పూర్తయింది. తీరా చెరువులు నింపుతుంటే అకస్మాత్తుగా కాలువను మూసేశారు. కాలువలు నీరిచ్చి ప్రాంతంలోని ప్రజలను ఆదుకోవాలని మంత్రిగారిని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కామినేని శ్రీనివాస్ (SRI KAMINENI SRINIVAS) (కైకలూరు): అధ్యక్షా, నమస్కారం. కొల్లేరు సమస్య చాలా కాలం నుంచి ఉంది. అది నాలుగైదు నియోజకవర్గాలకు సంబంధించిన సమస్య. అక్కడ రెండు లక్షల మంది ప్రజలు ఉన్నారు. 15వేల ఎకరాల జిరాయితీలు ఉన్నాయి. మన గౌరవ ముఖ్యమంత్రిగారి, ఉపముఖ్యమంత్రిగారి చొరవతో సుప్రీంకోర్టు ఒక వారం గడువు ఇచ్చింది. వారం లోపు Central Empowered Committeకి రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని తెలపాలనే విషయాన్ని మీద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ గద్దె రామ్మోహన్ (SRI GADDE RAMAMOHAN) (విజయవాడ ఈస్ట్): అధ్యక్షా, నమస్కారం. విజయవాడ నగరంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కానీ, ఎంపీ నిధులతో కానీ చిన్న చిన్న కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తారు. ఆ కమ్యూనిటీ హాల్స్‌ను ఎంపీ నిధులతో కానీ, దళితులు ఉన్న చోట ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కానీ, శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి కానీ స్థానికుల కోరిక మేరకు వాటిని నిర్మిస్తారు. మున్సిపల్ శాఖ మంత్రిగారు కూడా సభలోనే ఉన్నారు. ఆ నిర్మాణాలు పూర్తయిన తరవాత మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఆన్‌లైన్ వేలం నిర్వహించడం వల్ల ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వచ్చి కమ్యూనిటీ హాళ్లని టెంట్ హౌస్‌ల మాదిరిగా తయారు చేస్తున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద దళితులు నివసించే ప్రాంతంలో చిన్న కమ్యూనిటీ హాల్ కట్టామంటే అది వారి అవసరాలకు, వారు చిన్న చిన్న కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి ఉపయోగపడాలి తప్ప కాంట్రాక్టర్లు వచ్చి వారి ఇష్టం వచ్చిన రేట్లు వసూలు చేయడం వల్ల అసలు ప్రయోజనం నెరవేరడం లేదు.

స్థానికుల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తున్నారు కాబట్టి స్థానికంగా దానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో దాన్ని ఉంచాలి తప్ప యాక్ట్ ప్రకారం టెండర్లు పిలిచి,

అందుకు ఆన్‌లైన్‌లో ఎవరైనా అప్లై చేసుకోవచ్చు అంటే ఎవరెవరో వచ్చి దాన్ని ఒక టెంట్‌హౌస్‌లా తయారుచేస్తూ, వారి వ్యాపారం కోసం వాడుకుంటున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల కోరిక ప్రకారం ఏర్పాటు చేస్తున్న ఈ చిన్న చిన్న కమ్యూనిటీ హాల్స్‌ను వ్యాపారస్థుల కోసం కట్టించినట్లుంది తప్ప స్థానికులకు ఉపయోగపడడం లేదు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తే ఎస్సీలను కమిటీలో వేసి వాళ్లకు దాన్ని హ్యాండోవర్ చేసి, అక్కడ ఎస్సీలు కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి నామమాత్రపు రుసుములు తీసుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా బీసీ కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తే స్థానిక బీసీలకు వినియోగించాలి. టెండర్ల విధానం, ఆక్షన్ విధానం తీసేసి స్థానికంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా వాటిని నడిపించాలని నా ప్రత్యేక విజ్ఞప్తి. అలా కాని పక్షంలో దాని అసలు ప్రయోజనం నెరవేరకపోగా, ఒక్కో కాంట్రాక్టర్ వచ్చి దాన్ని షామియానా హౌస్‌లాగా ఏర్పరుచుకుని, గడువు ముగిసిన తరవాత కోర్టు నుంచి స్టే తెచ్చుకుని 10, 15 ఏళ్లు గడిపేస్తున్నారు. అందువల్ల మంత్రిగారు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ సుందరపు విజయ్‌కుమార్ (SRI SUNDARAPU VIJAY KUMAR) (యలమంచిలి): అధ్యక్షా, నమస్కారం. మా యలమంచిలి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30పడకలతో ఉంది. గత ఐదు సంవత్సరాల్లో దాన్ని ఎందుకు మార్చారో తెలియదు కానీ ఆసుపత్రి కడుతున్నామని ఒక ప్లాన్ తీసుకొచ్చి, అందులో కేవలం 25శాతం ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి, మిగిలిన 75శాతం దిక్కూదివాణం లేకుండా వదిలేశారు. వాస్తవానికి పాత ఆసుపత్రి ఉన్నా బాగుండేది. కొత్త నిర్మాణమని చెప్పి ఉన్న ఆసుపత్రిని సందులో ఎక్కడో పెట్టడం వల్ల రోగులకు చాలా ఇబ్బందికరంగా ఉందని మీద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను. ప్రతి నియోజకవర్గ జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయవలసి పరిస్థితుల్లో కనీసం 30పడకల ఆసుపత్రి కూడా లేకుండా, అసలు ఆసుపత్రి ఉందో లేదో తెలియని దౌర్భాగ్య పరిస్థితిలో మా యలమంచిలి నియోజకవర్గం ఉంది. వంద పడకల ఆసుపత్రిని వెంటనే అందుబాటులోకి తేవాలని మీద్వారా కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): ఇప్పటివరకూ ఎప్పుడూ మాట్లాడని యరపతినేని శ్రీనివాసరావుగారు మాట్లాడతారు.

శ్రీ యరపతినేని శ్రీనివాసరావు (SRI YARAPATHINENI SRINIVASARAO) (గురజాల): అధ్యక్షా, ధన్యవాదాలు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని గురజాల నియోజకవర్గంలోని అన్ని మేజర్, మైనర్ కెనాల్స్‌కు వారాబందీ పెట్టి నీటి విడుదల పూర్తిగా నిలిపివేశారు. దీనివల్ల మిర్చి పంట బాగా దెబ్బతినే పరిస్థితి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలలో కాలువ మరమ్మతులు చేయించకపోవడంతో రైతులు చాలా ఇబ్బందిపడ్డారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల్లోనే అన్ని మేజర్ కాలువలకు మరమ్మతులు చేయించాం. నీటి నిలుపుదల వల్ల లేదా నీటి విడుదలను తగ్గించడం వల్ల టెయిల్ ఎండ్‌లో ఉన్న మిర్చి పంట దెబ్బతినే పరిస్థితి వచ్చింది. దయచేసి

ఏప్రిల్ ఆఖరి వరకు నీటి సరఫరాను కొనసాగించాలని రైతాంగం కోరుతున్నారు. మిర్చితోబాటు ఇతర వాణిజ్య పంటలు కూడా ఉన్నందున ఏప్రిల్ వరకు నీటి సరఫరాను కొనసాగించడం వల్ల రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వేసవికాలం వచ్చింది కాబట్టి చెరువులు, కుంటల్లో నీటిని నింపాలని కోరుతున్నాను. RWS Department ద్వారా అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో వేసవికాలంలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మీద్వారా అధికారులను కోరుతున్నాను.

శ్రీమతి పల్లె సింధూర రెడ్డి (SMT.PALLE SINDHURA REDDY) (పుట్టపర్తి): అధ్యక్షా, ధన్యవాదాలు. The Ministry of Personnel Public Grievances and Pensions ఇచ్చిన Government Memorandum dt:03.03.2023 ప్రకారం "Any Central Government employee appointed against a post of vacancy advertised before the notifications of NPS, dt:22.12.2023 is entitled to be covered under the Old Pension Scheme instead of the National Pension Scheme." ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న 2003 బ్యాచ్ పోలీసు కానిస్టేబుల్స్, టీచర్స్, గ్రూప్2 నోటిఫికేషన్ ద్వారా నియమించబడిన 11వేల మంది ఉద్యోగుల గురించి మాట్లాడుతున్నాను. పోలీసు కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ 18-12-2003న వచ్చింది. కానీ తుది ఫలితాలు ఆలస్యమై 20-08-2004న ప్రకటించబడ్డాయి. ప్రభుత్వం మారడంతో వారి నియామకం ఆలస్యమై 17-08-2005న జరిగింది. మన రాష్ట్రంలో NPS 01-09-2004న అమలులోకి వచ్చింది. Pre-NPSలో రిక్రూట్ అయిన ఈ 11వేల మంది employees are actually eligible for OPS.

మ.12.00

అధ్యక్షా, తేది.7.12.2003 నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయి మన రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్ అధికారులున్నారు. తేది.22.12.2003 కంటే ముందు నోటిఫికేషన్ వచ్చింది కాబట్టి డిసెంబర్, 2004న జాయిన్ అయినా వారిని ఎన్‌పీఎస్ నుండి ఓపీఎస్‌కి మార్చారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవా, జార్ఖండ్, గుజరాత్‌లు కూడా ఎన్‌పీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలుచేశారు. మన రాష్ట్రంలో కూడా ఆ 11వేల మందికి ఓపీఎస్ ఇచ్చి న్యాయం చేయాలని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వం నుండి 2023లో ఆఫీస్ మెమోరాండమ్ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అప్పట్లో ఏమీ పట్టించుకోలేదు. వారు ఓపీఎస్‌కు అర్హులు కాబట్టి వారికి న్యాయం చేయాలని కోరుతున్నాను.

శ్రీ జి.వి.ఆంజనేయులు (SRI G.V.ANZANNEYLLU): అధ్యక్షా, పల్నాడు జిల్లాలోని వినుకొండ ప్రాంతంలో ప్రత్యేకంగా బొల్లాపల్లి మండలంలో 16 గ్రామాలలో మంచినీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ అలాంటి పరిస్థితులు ఉన్నాయో గుర్తించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను. పంచాయతీ నిధుల ద్వారా ఆ సమస్యను పరిష్కరించవచ్చు కానీ అక్కడ సర్పంచులు ముందుకు రావడం లేదు. కాబట్టి మంత్రిగారు మంచినీటి సమస్యను తీర్చడానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరుతున్నాను.

పల్నాడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌గారు జల్‌జీవన్ మిషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్ది దేశంలో నంబర్ 1గా చేయాలనే ఆకాంక్షతో ముందుకు వెళ్తున్నారు. పల్నాడు జిల్లా మొత్తాన్ని మొదటి ఫేజ్‌లో పెట్టి నాగార్జునసాగర్ నుండి జిల్లా మొత్తానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా నీరందించాలని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ పంచకర్ల రమేశ్ బాబు (SRI PANCHAKARLA RAMESH BABU) (పెందుర్తి): అధ్యక్షా, ధన్యవాదాలు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు రోజురోజుకీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోబాటు కాలుష్యం కూడా అభివృద్ధి చెందుతుంది. మానవ తప్పిదాలతో పెరిగే కాలుష్యం ఇంకా ఎక్కువుంది. పోర్టులు, పవర్ ప్లాంట్లు, ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యం వస్తుంది. ఫార్మా కంపెనీలలో కొన్ని కంపెనీలు వ్యర్థాల్ని శుద్ధి చేసి పైపులైను ద్వారా సముద్రంలోకి వదలవలసి ఉంటుంది. ఖర్చుతో కూడిన పని కాబట్టి వ్యర్థజలాల్ని శుద్ధి చేయకుండా డబ్బులు మిగుల్చుకోవడానికి అర్ధరాత్రులు దూర ప్రాంతాల్లో రోడ్ల ప్రక్కన వదలడం వలన అక్కడ గ్రౌండ్ మొత్తం పొల్యూట్ అవుతోంది. పంటలు పండడంలేదు. అక్కడకు ఎవరైనా వెళ్లినా చర్మవ్యాధులు వస్తున్నాయి. మొక్కలు కూడా పెరగడంలేదు. దయచేసి దానిని అరికట్టవలసిన అవసరముంది. స్వార్థంతో డబ్బులు సంపాదించే ధ్యేయంతో కొన్ని కంపెనీలు చేస్తున్న ఆ తప్పిదాలను అరికట్టాలి. పోర్టులు, ఎన్టీపీసీల వలన వాయుకాలుష్యం పెరుగుతుంది. జలకాలుష్యం కూడా అదే విధంగా పెరిగితే ఆ ప్రాంతాలను కాపాడడం కష్టమవుతుంది కాబట్టి కాలుష్యం నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా సంబంధిత మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కిమిడి కళావెంకటరావు (SRI KIMIDI KALAVENKATARAO) (చీపురుపల్లి): అధ్యక్షా, ధన్యవాదాలు. చీపురుపల్లి నియోజకవర్గంలో గత 100 సంవత్సరాల నుండి ఫెర్రోఅల్లాయ్స్ పరిశ్రమ ఉండేది. ఆ పరిశ్రమ ఉన్నందువల్ల అదనంగా 20 పరిశ్రమలు అక్కడకు వచ్చాయి. అవన్నీ power oriented factories. ఒక టన్ను ఉత్పత్తి ₹1.20లక్షలకు అమ్మితే, అది తయారుచేయడానికి ₹40వేల నుంచి ₹50వేల రూపాయల కరెంటు వాడాల్సి వచ్చేది. అది గమనించి గతంలో పరిశ్రమలు మూతపడే పరిస్థితి వస్తే అప్పట్లో చంద్రబాబునాయుడుగారు రాయితీలిచ్చి ఆ పరిశ్రమలను ఆదుకున్నారు. తద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంటు, మిగతా ప్లాంటులకు రా మెటీరియల్ చైనా నుండి ఇంపోర్టు చేసుకోకుండా సప్లై చేసే పరిస్థితి ఉండేది. జగన్మోహన్‌రెడ్డి చేసిన నిర్వాకం వలన గత ప్రభుత్వంలో ఆ పరిశ్రమలకు పవర్ రాయితీలు ఇవ్వకుండా పూర్తిగా రద్దుచేయడంతో ఖర్చులు భరించలేక, ఉత్పత్తి చేసినా గిట్టుబాటు కాక 100 సంతవ్సరాల నుండి ఉండే గరుడ పరిశ్రమ, ఫెర్రో అల్లాయ్స్‌తోబాటు అక్కడున్న 20 పరిశ్రమలు మూతపడ్డాయి. ఆ పరిశ్రమలు పనిచేసినప్పుడు దాదాపు 20వేల మంది ఉపాధి పొందేవారు. మన ప్రభుత్వం పాత రాయితీలు ఇచ్చి మరలా ఆ ఫ్యాక్టరీలు నడిపించి తద్వారా 20వేల మందికి ఉపాధి కల్పించాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ గొండు శంకరరావు (SRI GONDU SANKARARAO): అధ్యక్షా, శ్రీకాకుళం పట్నంలోని కంపోస్టు కాలనీలో 1975 నుండి అంటే దాదాపు 50 సంవత్సరాల నుండి 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. దానికి 1995లో ఎలక్ట్రిఫికేషన్ ఇచ్చాం. 1998లో సీసీ రోడ్లు ఇచ్చాం. మునిసిపల్ హౌస్ ట్యాక్స్, ఎలక్ట్రిసిటీ బిల్లులు కడుతున్నారు. దానికి సంబంధించి జీవో నం.30, 29.01.2025న ఇచ్చారు. కంపోస్టు కాలనీని కూడా క్రమబద్ధీకరించాలని కోరుతున్నాం. మునిసిపల్ గోర్జ్ రహదారి అని దానికి క్లాసిఫికేషన్ ఉంది. సర్వేనం.345, 346, 348, 355, 356, 358/1లో కూడా చాలా కాలనీలున్నాయి. వాటన్నింటినీ కమబద్ధీకరించాలని కోరుతున్నాను. దాదాపు 200 కుటుంబాలు కంపోస్టు కాలనీలో ఉన్నాయి. శ్రీకాకుళం మొత్తంలో ఐదారు చోట్ల ఆ విధంగా ఉన్నాయి. ఆ కాలనీలను కమబద్ధీకరిస్తే దాదాపు 1500 కుటుంబాలకు ఉపయోగపడుతుందని తమరి ద్వారా గౌరవ రెవెన్యూ మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): చాలా సూటిగా క్లుప్తంగా అడిగారు. మీకు ప్రత్యేక ధన్యవాదాలు.

శ్రీ కోనేటి ఆదిమూలం (SRI KONETI ADIMULAM) (సత్యవేడు): అధ్యక్షా, ధన్యవాదాలు. సత్యవేడు నియోజకవర్గంలో ఏడు మండలాల గురించి రిజర్వ్ ఫారెస్ట్ అధికారులకు గతంలో చెప్పాను. కె.వి.బి.పురం మండలంలో వగత్తూరు, కళత్తూరు, వేములకోటలో కరెంటు స్తంభాలు వేసుకుని, మీటర్ బిగించుకుని పైర్లు వేసుకుంటున్నారు. రెవెన్యూ పట్టాలు ఇచ్చారు. అయినా ఆ భూమి మాది అని అటవీ శాఖ అభ్యంతరం చెప్పి కేసులు పెడుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యమైన సమస్య ఇది. సాగుచేస్తున్న భూమిని వదిలేసి, ఆక్రమణలకు గురైన వాటిపై కేసులు పెట్టమని Divisional Forest Officer, Conservator of Forests, Collectorని కోరాము. అలాగే శ్రీసిటీకి వెళ్లే దారిలో కూడా రోడ్లు లేకుండా ఇబ్బందిపెడితే, కలెక్టర్‌గారికి చెప్పి ₹6లక్షలు తీసుకుని శ్రీసిటీకి వెళ్లడానికి ఇబ్బంది లేకుండా చేశాం. అక్కడే అపోలో, హీరో కంపెనీ కూడా ఉన్నాయి. పట్టాలు ఇచ్చిన రెవెన్యూ భూములను రైతులు అభివృద్ధి చేసుకుని బ్రతుకుతున్నారు అలాంటి రైతుల్ని ఇబ్బంది పెట్టకూడదని ఉపముఖ్యమంత్రిగారితోబాటు రెవెన్యూ మంత్రిగారు సమావేశమై చర్య తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు వస్తున్నాయి. విదేశాలలో కూడా ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నారు. మన రాష్ట్ర అసెంబ్లీలో36 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలున్నారు. ఏప్రిల్14న జరిగే ఉత్సవాల్లో విద్య, సామాజికాభివృద్ధిపై వార్షికోత్సవాలు జరిపించాలని తమరి ద్వారా కోరుతున్నాను. ఏప్రిల్14న భారత రాజ్యాంగాన్ని రచించిన మన గౌరవనీయులు రైతు బిడ్డ అంబేడ్కర్‌గారి జయంతి ఉత్సవాలను మన ప్రభుత్వం తరఫున నిర్వహించాలని తమరిద్వారా కోరుతున్నాను.

మ.12.10

శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (SMT.VEMIREDDY PRASHANTIREDDY) (కోవూరు): అధ్యక్షా, ధన్యవాదాలు. డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజకవర్గంలో 124 ఎకరాలలో షుగర్ ఫ్యాక్టరీ ఉంది. గత ప్రభుత్వంలో షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసే వారందరికీ జీతాలు ఇచ్చి క్లోజ్ చేశారు. కానీ గత ప్రభుత్వంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా పని చేశానని చెప్పుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ డబ్బులు లబ్ధిదారులకు ఇచ్చేందుకు కూడా కమిషన్ కోసం ఆశపడి ఉద్యోగుల డబ్బులు ₹20కోట్లు ఆపేయడం జరిగింది. అందులో 3వేల మంది ఉన్నారు. కొంతమంది చనిపోయారు కూడా. మిగతా వారికి ఎలాంటి ఉపాధి లేక వారికి రావాల్సిన బకాయిలు రాక ఇబ్బంది పడుతున్నారు. ఆ పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరుతున్నాను. అలాగే మనకు ఎంతో ఉపయోగకరమైన షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూమి 124ఎకరాలు ఊరికి మధ్యలో Nellore Urban Development Authority (NUDA) పరిధిలోకి వస్తుంది. ఆ భూమిని ఉపయోగించుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని, అదేవిధంగా ఆ ప్రాంతంలోని రైతులకు న్యాయం చేసి తగు పరిష్కారం చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా మా ప్రాంతంలో 27సంవత్సరాల క్రితం కిసాన్ సెజ్‌కు రైతులు ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కానీ అక్కడ మౌలిక సదుపాయాలు లేక, పరిశ్రమలు రాక ఎటువంటి ఉపాధి లేక రైతులందరూ ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు సమస్యలు పరిష్కరించి యువతకు ఉపాధి కల్పించే అవకాశాలు మెండుగా ఉన్నాయి కాబట్టి వాటిని పరిష్కరించాలని మీద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాను.

శ్రీ బండారు సత్యానందరావు (SRI BANDARU SATYANANDARAO) (కొత్తపేట): అధ్యక్షా, ధన్యవాదాలు. పంచాయతీరాజ్ శాఖలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా పనులు చేయడానికి ₹5లక్షల వరకు నామినేషన్ పద్ధతిలో ఎస్టిమేషన్ ధరలకు పనులు చేపట్టేవిధంగా 2006లో ఒక జీవో ఇచ్చారు. కానీ కాలానుగుణంగా ఎస్ఎస్ఆర్ రేట్లు పెరిగాయి. ప్రైస్ ఇండెక్స్ కూడా మారింది. ఆ జీవో వచ్చి దాదాపు 20 సంవత్సరాలైంది. ఇప్పుడు నాలుగు రెట్లు ధరలు పెరిగాయి. తద్వారా 5లక్షల నామినేషన్ ద్వారా చేపట్టే పనులు ₹20లక్షలకు పెంచడం ద్వారా చాలా పనులు వెంటనే చేపట్టడానికి అవకాశం ఉంటుంది. దీని ద్వారా సమయం ఆదా అవుతుంది. ప్రభుత్వానికి కూడా నిధులు ఆదా అవుతాయి. స్వయం సహాయక సంఘాలకు ఉపకారం చేసినట్లవుతుంది. మహిళా సాధికారతకు కూడా దోహదపడుతుంది. కొంతమంది దాతలు ముందుకు వచ్చి పనులు చేపట్టేటప్పుడు స్థానిక ప్రతినిధులు అత్యవసరంగా చేసే పనులు వెంటనే చేపట్టడానికి ఇది వీలు కల్పిస్తుంది. అంతే కాకుండా కాంట్రాక్టులలో 13శాతం కాంట్రాక్టరు ప్రాఫిట్ పెడుతూ ఉంటారు. అది కూడా ప్రభుత్వానికి ఆదా అవుతుంది. ఎక్సెస్ రేటు వేయడం వల్ల కూడా ప్రభుత్వం మీద భారం తగ్గుతుంది. లెస్‌కు వేయడం వల్ల నాణ్యతా ప్రమాణాలు

దెబ్బతింటున్నాయి. ఇవన్నీ చూస్తుంటే గతంలో ₹5లక్షలకు ఇచ్చిన జీవోను ₹20లక్షలకు పెంచడం ద్వారా పనులు సత్వరమే చేపట్టి సమయం ఆదా అయ్యేలా వెంటనే పనులు చేపట్టేందుకు వీలుంటుందని మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. గౌరవ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు ఆ విషయాన్ని పరిశీలించి తగువిధంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ గురజాల జగన్మోహన్ (SRI GURAJALA JAGANMOHAN) (చిత్తూరు): అధ్యక్షా, ధన్యవాదాలు. చిత్తూరు జిల్లాలో 100ఎకరాలకు పైగా స్థలంలో షుగర్ ఫ్యాక్టరీ అన్యాక్రాంతమైంది. గత ప్రభుత్వంలో అమూల్ డెయిరీకి ఇచ్చినట్లు ఈ షుగర్ ఫ్యాక్టరీకి కూడా మన ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు పీపీపీ మోడల్‌లో ఒక అవకాశం ఇస్తే కమర్షియల్ కాంప్లెక్స్‌లు లేదా ప్లాటింగ్ వైజ్‌గా అభివృద్ధి చేసి వేర్‌హౌసింగ్‌కు అవకాశం కల్పించవచ్చు. కాబట్టి అందుకు తగువిధంగా చర్యలు తీసుకోవాలని మా చిత్తూరు ప్రజల తరఫున, షుగర్ ఫ్యాక్టరీ షేర్‌హోల్డర్స్ తరఫున మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) (SRI PULAPARTHI RAMANJANEYULU (ANJIBABU)) (భీమవరం): అధ్యక్షా, పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతం భీమవరం పట్టణం. ఈ పట్టణానికి ట్రాఫిక్ ప్రధాన సమస్యగా ఉంది. భీమవరం పట్టణ నడిబొడ్డు నుండి యనమదుర్రు మేజర్ డ్రెయిన్ పాస్ అవుతుంది. దానిమీద మూడు బ్రిడ్జిలు నిర్మించారు కానీ ఎప్రోచ్ రోడ్లు లేవు. భవిష్యత్తులో కూడా ఈ పట్టణానికి మాస్టర్ రింగ్‌రోడ్డు వస్తే తప్ప ట్రాఫిక్ సమస్య క్లియర్ అవ్వదు. ఎప్రోచ్ రోడ్లు వేయాలని, మాస్టర్ రింగ్‌రోడ్డు తీసుకురావాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్‌రాజు (SRI PENMETSA VISHNUKUMAR RAJU): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు నారాయణగారు సభలో ఉన్నారు కాబట్టి వారికి సంబంధించిన ప్రశ్న వేస్తున్నాను. 2017లో జీవో నం.128 ప్రకారం బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్) పెట్టారు. తరవాత జీవో నం.14, తేదీ.04.01.2019 ద్వారా 14.08.2019 వరకు extend చేశారు. దీని మూలంగా చిన్న చిన్న డీవియేషన్స్ వస్తే పేమెంట్ చేసుకుని రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ఉంటుంది. తరవాత 2019 నుండి అసలు అప్లికేషన్స్ ఏమీ తీసుకోవడం లేదు. దీనిమూలంగా చిన్న సమస్యలు ఉన్నా రెక్టిఫై చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా అపార్ట్‌మెంట్ ఓనర్లు, బిల్డర్లు ఇబ్బంది పడుతున్నారు. దయచేసి దీనిమీద ఒక కమిటీ వేసి అధ్యయనం చేసి మళ్లీ బీపీఎస్ తీసుకువచ్చి అందరికీ మేలు చేయాలని కోరుతున్నాను. అందువలన రాష్ట్రానికి కూడా ఆదాయం వస్తుంది. ప్రజలకు కొంత శాంతి వస్తుంది. చాలామంది ఎన్‌ఓసీలు రాక ఇబ్బంది పడుతున్నారు. దయచేసి ఆంధ్రప్రదేశ్ మొత్తానికి సంబంధించినది కాబట్టి తప్పనిసరిగా మరలా బీపీఎస్‌ను పునరుద్ధరించాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): చాలా ఆదర్శప్రాయంగా నిమిషంలో ముగించినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు. మండలి బుద్ధ ప్రసాద్‌గారు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ (SRI MANDALI BUDDHAPRASAD) (అవనిగడ్డ): అధ్యక్షా, ధన్యవాదాలు. ఈరోజు ఈ అంశం గురించి శాసనసభలో ప్రస్తావించాల్సి రావడం నాకు బాధాకరంగా ఉంది. ఎందుకంటే 27.11.2020న అవనిగడ్డలో ప్రముఖ వైద్యుడు డా.కోటా శ్రీహరిరావుగారిని దారుణంగా హత్య చేశారు. ఆయన అప్పటి శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌గారికి వ్యాపార భాగస్వామి. వారి ఇల్లు అటు ఎమ్మెల్యే గారి ఇంటికి డీఎస్పీగారి ఇంటికి సమీపంలో ఉంటుంది. కారణాలేమిటో తెలియదు కానీ వైసీపీ ప్రభుత్వంలో ఆ కేసును దర్యాప్తు చేసిన పరిస్థితి లేదు. అంతేకాకుండా వివేకానందరెడ్డిగారి హత్య కేసు ఏవిధంగా జరిగిందో అదేవిధంగా అక్కడ జరిగింది. ఆ హత్యను చూసిన తరవాత అవనిగడ్డ ప్రజలందరూ భయభ్రాంతులకు లోనయ్యారు. ఎవరైనా రాత్రిపూట తలుపు తడితే తీయడానికి కూడా భయపడే పరిస్థితులు వచ్చాయి. ఆ పరిస్థితులు మీ అందరికీ కూడా తెలుసు. అధ్యక్షా, మీరు కూడా పోరాడారు. సునీతగారు వివేకానందరెడ్డిగారి హత్య కేసులో పోరాడారు. అందరూ పోరాడే పరిస్థితులలో ఉన్నారు. అందుకే ఎన్నికలయ్యే వరకు వారి కుటుంబ సభ్యులు బయటకు వచ్చి మాకు అన్యాయం జరిగిందని చెప్పే పరిస్థితులు లేవు. ఎన్నికల అనంతరం వారి కుమారుడు డా.ప్రవీణ్ నన్ను కలిసి చెప్పడం జరిగింది. ఈలోగా ఎన్నికల ప్రకటన వచ్చిన తరవాత పవన్ కల్యాణ్‌గారు అవనిగడ్డ ఎన్నికల ప్రచార సభకు వస్తే అక్కడ ఈ హత్యకేసు మీద విచారణ చేయించాలని అందరూ ప్లకార్డులు పట్టుకుని కోరారు. దాంతో ఆ రోజున పవన్‌కల్యాణ్‌గారి ఉపన్యాసం కూడా దానిమీదనే జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత విచారణ చేయిస్తామని చెప్పారు.

ఆ తరవాత నేను 16వ శాసనసభ మొట్టమొదటి సమావేశం జరుగుతున్నప్పుడు ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళితే వారు వెంటనే సీఐడీ విచారణ చేయమని ఆదేశించారు. తరవాత నేను డీజీపీగారిని కలిస్తే సీఐడీ విచారణ చేయిస్తామని చెప్పి 30.07.2024న సీఐడీకి పంపడం జరిగింది. కానీ ఈ రోజు వరకు కూడా సీఐడీ దాని మీద దర్యాప్తు ప్రారంభించిన దాఖలాలు లేవు. మహాన్యూస్ వంశీ గారు దీనిమీద అవనిగడ్డ వచ్చి పెద్దఎత్తున మాట్లాడారు, పత్రికలలో వార్తలు వచ్చాయి. కారణం ఏమిటో తెలియదు కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కూడా విచారణ జరిపించకపోవడం చాలా విచారకరమైన విషయమని మనవి చేస్తున్నాను. ఆరోజున ముఖ్యమంత్రిగారు సీఐడీ విచారణ వేస్తున్నారని చెప్పగానే అక్కడి ప్రజలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల ఫోటోలకు పాలాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. కాబట్టి వెంటనే దర్యాప్తు చేసి దోషులను పట్టుకోవాలని, తద్వారా అవనిగడ్డ ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని మీద్వారా మనవి చేస్తూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మ.12.20

శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (SRI NALLAMILLI RAMAKRISHNAREDDY) (అనపర్తి): అధ్యక్షా, మా అనపర్తి నియోజకవర్గంలో బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో ఇటీవలి కాలంలో దాదాపు రెండు మూడు వందల మంది క్యాన్సర్ బారిన పడటం ఆందోళన కలిగించే విషయం. ఏ ప్రాంతంలోనూ లేనివిధంగా ఒకే గ్రామంలో అంతమంది క్యాన్సర్ బారిన పడటంతోబాటు ఇటీవల 30 మంది చనిపోయారు. దీనికి కారణాలేమిటో ఎవరికీ అంతుపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డిగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అప్పటి శాసనసభ్యుల అవినీతితో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అనే కెమికల్ ఇండస్ట్రీని ఆ గ్రామంలో నిర్మించారు. Sulphuric Acid, Caustic Soda లాంటి 56 రకాల కెమికల్స్ ఆ పరిశ్రమ నుండి ఉత్పత్తికావడం వలన అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆ గ్రామస్థులు భావిస్తున్నారు.

ముఖ్యంగా ఆ పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులు, ముడిసరకుల సరఫరా నిమిత్తం వందలాది లారీలు ఆ గ్రామం గుండా ప్రయాణించడం వలన తీవ్రమైన వాయుకాలుష్యం, శబ్దకాలుష్యంతోబాటు ఆ ప్లాంట్ నుంచి వెలువడే వ్యర్థాల వల్ల జలకాలుష్యం కూడా ఏర్పడుతోందని ఆ గ్రామస్థులు భావిస్తున్నారు. పర్యావరణశాఖను నేను అనేకసార్లు కోరినప్పటికీ వారు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు. రెండు మూడు వందల మంది క్యాన్సర్ బారినపడటం, సుమారు 30 మంది చనిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టిసారించి ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలి. అలా క్యాన్సర్ బారిన పడటానికి గల కారణాలు ఏమిటో కనుగొనాలి. పర్యావరణశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ ఈ సమస్యపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): ఇప్పుడు ఆనుసూచిత కులాల ఉపవర్గీకరణ నివేదికపై చర్చ ప్రారంభిస్తాము. అనుసూచిత కులాల ఉపవర్గీకరణ నివేదికపై చర్చ త్వరగా ముగిస్తే జీరో అవర్‌ను కంటిన్యూ చేసుకుంటాం. గౌరవ ముఖ్యమంత్రిగారు, గౌరవ ఉపముఖ్యమంత్రిగారు ఆ సబ్జెక్టు మీద మాట్లాడతారు. జీరో అవర్‌లో దాదాపు 23 మంది మాట్లాడారు. ఇంకా ఏడు మంది మాట్లాడాలి. ఏ మాత్రం అవకాశం ఉన్నా లఘుచర్చ తర్వాత జీరో అవర్‌ని కొనసాగిద్దాం. అవకాశం రానివారు అన్యథా భావించవద్దని కోరుకుంటున్నాను.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ నివేదికపై చర్చ
SHORT DISCUSSION ON SUB-CLASSIFICATION OF SCHEDULED CASTES

శ్రీ నక్కా ఆనందబాబు (SRI NAKKA ANANDABABU) (వేమూరు): అధ్యక్షా, సమాజంలో జంతువులను పూజిస్తారు, చెట్లను పూజిస్తారు, రాళ్ళను పూజిస్తారు, యంత్రాలను కూడా పూజిస్తారు. కానీ మనిషిని మనిషిగా చూడలేని పరిస్థితులు స్వాతంత్ర్యానికి ముందు ఈ దేశంలో ఉండేవి. అస్పృశ్యత, అంటరానితనం, సామాజిక అంతరాలు, అనేక రుగ్మతలతో కొన్ని వర్గాలు ఇబ్బందిపడిన పరిస్థితులు

ఆరోజుల్లో ఉన్నాయి. వాళ్ళందరినీ జనజీవన స్రవంతిలో సమానంగా తీసుకురావాలనే ఆశయంతో ఆలోచనతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పెద్దలు డా.బి.ఆర్.అంబేడ్కర్‌గారు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్లు కల్పించి ఉన్నత వర్గాలకు సమానంగా తీసుకురావాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లు తీసుకొచ్చారు.

అందులో భాగంగా 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని ప్రత్యేకమైన హక్కులను, రిజర్వేషన్లను పొందుతున్నప్పటికీ సమాజంలో అంతరాలు మారలేదు. 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఉన్నప్పుడు, అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి 54 సంవత్సరాలు అయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటికీ గ్రామాల్లో రెండు గ్లాసుల విధానం, రోడ్డు మీద స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు, అంటరానితనం ఇంకా అక్కడక్కడ తాండవిస్తున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో ఉన్న స్థితిగతులను అధ్యయనం చేయడానికి జస్టిస్ పున్నయ్యగారిని ఏకసభ్య కమిషన్‌గా చంద్రబాబు నాయుడు గారు నియమించారు. సంవత్సరం పాటు రాష్ట్రమంతా పర్యటించి, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఇబ్బందులను స్టడీ చేసి 42 సిఫారసులను ఆరోజు చంద్రబాబు నాయుడు గారికి ఇస్తే, ఆ సిఫారసులను 25 జీవోలుగా విడుదల చేసి సమాజంలో అణగారినవర్గాలు అనుభవిస్తున్న కష్టాల నుంచి బయటకు తీసుకురావడానికి స్వాతంత్ర్యం వచ్చిన 54 ఏళ్ళ తర్వాత మొట్టమొదట పునాది వేసి వాళ్ళకు అండగా నిలబడిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారని చెప్పడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను.

ఎందుకంటే ఆ రోజున జారీ చేసిన 25 జీవోల్లో ఒకటిగా వచ్చిందే స్టేట్ ఎస్సీ, ఎస్టీ కమిషన్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితుల మీద జరుగుతున్న దమనకాండలు, అకృత్యాలు, హత్యలు, అత్యాచారాలను నిరోధించడానికి, వారికి బాసటగా నిలబడటానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను మొట్టమొదటిసారి ఏర్పాటు చేశారు. నేషనల్ లెవెల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉంది. కానీ, రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మొట్టమొదట ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నియమించారని చెప్పడానికి సంతోషిస్తున్నాం. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు గారిని ఆదర్శంగా తీసుకొని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కమిషన్లను ఏర్పాటు చేసుకున్నాయి.

అయితే ఈరోజు సభ ముందుకు వచ్చిన షెడ్యూల్డ్ కులాల్లో ఉపకులాల వర్గీకరణ అంశం మొట్టమొదటి నుంచి ఉన్నది. 1996లో మాదిగ సోదరుల ఉద్యమం రావడంతో రామచంద్రరావు కమిషన్‌ను చంద్రబాబు నాయుడుగారు ఏర్పాటుచేసి వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఆ తదుపరి 2000 సంవత్సరం నుండి 2004 వరకు ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ అమలు అయ్యింది. 2004లో న్యాయపరమైన అంశాలు అడ్డు రావడం వలన వర్గీకరణ ఆగిపోయిన విషయం అందరికీ తెలుసు. ఆరోజు తెలుగుదేశం పార్టీకి గానీ, ఇవాళ కూటమి ప్రభుత్వానికి అభ్యంతరం లేదు. వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ మొట్టమొదటి నుంచి అనుకూలంగా ఉంది. తెలుగుదేశంపార్టీ

2004 ఎన్నికల మేనిఫెస్టోలో వర్గీకరణ అంశాన్ని చేర్చి ఆ ప్రకారం ఎన్నికలకు వెళ్ళి ప్రజల తీర్పును పొందాం.

రాష్ట్రంలో గత ఐదేళ్ళు అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మాల, మాదిగ, ఇతర ఉప కలాల ఓట్లు వేయించుకొని ఏవిధంగా మోసగించాడో, ఏవిధంగా అణగద్రొక్కాడో చూసిన ప్రజానీకం అన్నింటినీ ఆలోచన చేసి చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వానికి బ్రహ్మాండమైన మెజారిటీని ఇచ్చి అప్పటివరకు అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అసలు ప్రజాజీవితానికి, లెజిస్లేచర్ వ్యవస్థలోనే పనికిరారని ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఇంటికి పంపించిన పరిస్థితిని చూశాం. దాంట్లో భాగంగానే ఇవాళ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన దానికి అనుగుణంగా రాజీవ్ రంజన్ మిశ్రా గారి ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్ వేయడం, ఆ కమిషన్ నివేదికను వంద రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించడం, దాని మీద మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి నివేదికను సమర్పించిన వెంటనే కేబినెట్ ఆమోదం తీసుకొని ఇవాళ సభలో ప్రవేశపెట్టడం ముదావహం.

ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు రాష్ట్రంలో ఉన్న ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం చేసి జిల్లాల వారీగా దామాషాగా తీసుకొని రిజర్వేషన్లను అమలుచేయాలని గతంలో మేము అడగటం జరిగింది. అదేవిధంగా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాం. ఈరోజు వచ్చిన కమిషన్ రిపోర్టు స్టేట్ యాజ్ ఏ యూనిట్‌గా వర్గీకరణ చేయాలని సిఫార్స్ చేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి, ప్రభుత్వానికి మేము విన్నవిస్తున్నాం, జనాభా లెక్కలు వచ్చిన వెంటనే జిల్లాల వారీగా రిజర్వేషన్ల విధానాన్ని అమలు పరచడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

మ.12.30

ఏదేమైనా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు గారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ రాష్ట్రంలోనే కాదు, భారతదేశంలోనే ఇంత కమిట్‌మెంట్‌గా పనిచేసినవారు ఎవరూ లేరు. గతంలో పార్లమెంట్ స్పీకర్‌గా జీఎంసీ బాలయోగిగారిని ప్రతిపాదించింది చంద్రబాబునాయుడు గారే. శాసనసభ స్పీకర్‌గా శ్రీమతి ప్రతిభా భారతిని, చీఫ్ సెక్రటరీగా మాధవరావుగారిని నియమించారు. రాష్ట్రపతిగా కె.ఆర్. నారాయణన్ గారిని ప్రతిపాదించడంలో ప్రధాన భూమిక పోషించింది కూడా చంద్రబాబునాయుడు గారే. దళితులను అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేసింది కూడా తెలుగుదేశం పార్టీనే. ఈనాడు దళితులకు రాష్ట్రంలో 15శాతం రిజర్వేషన్ అమలవుతోంది. మొట్టమొదటిసారి 1987లో బీసీలకు 27 శాతం, ఎస్సీలకు 14 శాతాన్ని 15 శాతం చేస్తూ, ఐదు శాతం రిజర్వేషన్ ఉన్న ఎస్టీలకు ఏడు శాతం చేస్తూ ఆనాడు ఎన్టీ రామారావు గారి ప్రభుత్వం జీవో ఇష్యూ చేస్తే, దానిపై జస్టిస్ జీవన్‌రెడ్డి జడ్జిమెంట్ ప్రకారం

బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ను కొట్టేసి, ఎస్సీలకు ఆమోదించడమైంది. ఆ పెంచిన 15శాతం రిజర్వేషనే ఇప్పటికీ అమలవుతోందంటే అది తెలుగుదేశం పార్టీ చలవే అని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, సబ్‌ప్లాన్ చట్టం కాంగ్రెస్ ప్రభుత్వంలో అయింది కానీ, దానిని చిత్తశుద్ధితో అమలుచేసిన నాయకుడు చంద్రబాబునాయుడు గారే. గ్రామాలలో, వాడల్లో పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయి. అవి మాలపల్లె కావచ్చు, మాదిగ పల్లె కావచ్చు, రెల్లి వారు ఉండే గ్రామాలు కావచ్చు. డెల్టా ప్రాంతాల్లో అయితే మోకాళ్లలోతు బురద ఉంటుంది. ఎవరైనా సరే ప్యాంట్లు మోకాళ్లపైకి మడుచుకుని, చెప్పులు చేతిలో పట్టుకొని వెళ్లాల్సిందే. నేడు ఆ పరిస్థితులన్నీ మారిపోయి వేల కోట్లు ఖర్చుచేసి వేల కిలోమీటర్లు సి.సి. రోడ్లు, మౌలికవసతులు కల్పించింది చంద్రబాబునాయడు గారి ప్రభుత్వం. గత ప్రభుత్వం ఒక్క కిలోమీటరు రోడ్డు కూడా వెయ్యలేదు. గతంలో చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా, లోకేశ్ గారు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కన్వర్జెన్సీ నిధులు, సబ్‌ప్లాన్ నిధులతో వేల కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి పల్లెల్లో, దళిత వాడల్లో సంపద సృష్టికి బీజం వేయడాన్ని ప్రజలు గమనించారు, గత ఐదేళ్ల పరిపాలననూ చూశారు. ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటే నమ్మి ముఖ్యంగా దళిత వాడల్లో 80శాతం ఓట్లు వేసి గెలిపించారు. నమ్మి ఓట్లేసి గెలిపించినవారిని నట్టేట ముంచి, మీద కాలువేసి అథఃపాతాళానికి తొక్కిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి. ఆయనేం చేశారో అందరూ చూశారు. దాదాపు 27 పథకాలు Land Purchase Scheme, Best Available Schools, ఉన్నత విద్యావకాశాలు, ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాలన్నింటినీ రద్దు చేసి, వాటిని సాధారణ స్కీమ్స్‌లో కలిపి, దళితవర్గాలను మోసం చేశారు. ప్రజలు అది తెలుసుకొని 2024 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి గారిని ఇంటికి పంపించారు.

అధ్యక్షా, వర్గీకరణ అంశానికి తెలుగుదేశం పార్టీ ముందు నుండి కట్టుబడి ఉన్నది. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేసే వ్యక్తి చంద్రబాబునాయుడు గారే అన్నది నిర్వివాదాంశం. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సిస్టంను తీసుకువచ్చిందే తెలుగుదేశం పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలో వరల్డ్ బ్యాంక్ నిధుల సహకారంతో దాదాపు 300 రెసిడెన్షియల్ స్కూల్స్‌ని నిర్మించి లక్షలాది విద్యార్థులు నాణ్యత గల విద్యను, ఇంగ్లీషు మీడియం చదువుకొనేందుకు, ఉన్నత విద్యావకాశాలను అందించేందుకు దోహదపడింది తెలుగుదేశం పార్టీనే అనేది నిత్యసత్యం. రెండు రూపాయలకు కిలో బియ్యం, వృద్ధాప్య పింఛను, సంక్షేమ హాస్టల్స్, పక్కా ఇళ్లు వంటి పథకాలు తీసుకువచ్చింది. పక్కా ఇళ్ల నిర్మాణంలో యాభై శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కూడా చంద్రబాబునాయుడుగారికే దక్కుతుంది. 2014-19లోగానీ, ఇప్పుడు గానీ సాధారణంగా అన్ని వర్గాలతోబాటు కాకుండా గృహనిర్మాణంలో ఎస్సీలకు అదనంగా యాభైవేలు ఇచ్చిన ఘనత గతంలో తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు కూటమికే దక్కుతుంది.

అధ్యక్షా, విదేశాలలో చదువుకోవడమనేది దళితులకు ఒక కల. అటువంటి కలను నిజం చేసి చూపించారు చంద్రబాబునాయుడు గారు. సంవత్సరానికి వందలాది మందిని అంబేడ్కర్ ఓవర్సీస్

విద్యానిధి పథకం ద్వారా విదేశాలకు పంపి చదువు చెప్పించిన గొప్ప వ్యక్తి. జగన్మోహన్‌రెడ్డి గారికి నూటికి 80మంది ఓట్లు వేశారు. కనీసం 10 మందినైనా విదేశాలకు పంపించారా? అసలు ఆ పథకం ఏమైంది? ఆ పథకానికి తూట్లు పొడిచి, జగన్ విదేశీ విద్యానిధి పథకం పేరు పెట్టుకున్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్‌గారి పేరు తీసేసి ఆయన పేరు పెట్టుకొని సిగ్గు లేకుండా ప్రవర్తించారు. పల్లెల్లో కూడా అంబేడ్కర్ గారి విగ్రహాలకు పోటీగా రాజశేఖరరెడ్డిగారి విగ్రహాలు పెట్టారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లో 800 ఎకరాల దళితుల భూములను రాజారెడ్డిగారి హయాం నుండి 30, 40 సంవత్సరాలుగా ఆక్రమించుకొని ఇటీవల వదిలిపెట్టారు. రాజారెడ్డి, రాజశేఖర రెడ్డి, జగన్మోహన్ రెడ్డి మూడు తరాలపాటు దళిత భూములను ఆక్రమించుకొన్న చరిత్ర వారిది. చంద్రబాబునాయుడు గారు ప్రతిరోజు దళితుల సంక్షేమం కోసం రకరకాల ఆలోచనలు చేసి, Best Available Schools, Jagjeevan Jyothi, Land Purchase scheme వంటివన్నీ దళితుల కోసం చేసిన గొప్ప వ్యక్తి అని చెప్పేందుకు నేను సంతోషిస్తున్నాను. 1991 జనాభా లెక్కల్లో వర్గీకరణ వివరాలు సక్రమంగా లేవని 1981 నాటి లెక్కలు తీసుకుని 1996లో ఎస్సీ వర్గీకరణ చేసిన తరవాత దానిని కోర్టులో కొట్టేయడమైంది. ఈనాడు ఎస్సీ ఉపవర్గీకరణకు సంబంధించి 2021 జనాభా లెక్కల్లో అవకాశమున్నంతవరకూ తీసుకోవాలి లేదా, 2026లో జరగబోయే జనాభా లెక్కల ఆధారంగా అయినా సరే ఇప్పుడు ఈ రిజర్వేషన్ శాతాన్ని జిల్లాల వారీగా అమలుపరచేందుకు సాధ్యమైనంతవరకు కృషి చేయాలని తమద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

అధ్యక్షా, గతంలో ఎస్సీలకున్న 14 శాతం రిజర్వేషన్‌ను పెంచి 15 శాతం చేసింది కూడా తెలుగుదేశం ప్రభుత్వమే. ఇప్పుడు పెరిగిన దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచేందుకు గల అవకాశాలను పరిశీలించవలసిందిగా ముఖ్యమంత్రిగారిని తమద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రభుత్వోద్యోగాలు తగ్గిపోతున్న నేపథ్యంలో నారా లోకేశ్‌గారు ఐ.టి. రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి జరగబోతోంది. 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లకు గల అవకాశాలను పరిశీలించాలని కోరుతున్నాను. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్స్ ఇచ్చిన ఘనత చంద్రబాబునాయుడు గారిదే. ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు తెరతీసిన చంద్రబాబునాయుడు గారు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లకు అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరుతున్నాను. ఏకసభ్య కమిషన్ నివేదికకు ఆమోదం తెలుపుతూ జిల్లాల వారీగా వర్గీకరణకు చర్యలు తీసుకోవాలని మరీ మరీ విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

మ. 12.40

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): మాట్లాడబోయే సభ్యులకు చిన్న విజ్ఞప్తి. సబ్జెక్ట్ చాలా ఇంపార్టెంటు. కానీ ముఖ్యమంత్రిగారు, ఉప ముఖ్యమంత్రిగారు కూడా సుదీర్ఘంగా

మాట్లాడవలసిన అవసరం కూడా ఉంది కాబట్టి దయచేసి వీలైనంత క్లుప్తంగా ముఖ్యమైన అంశాలను ప్రస్తావించాలని తెలియజేస్తున్నాను. బూర్ల రామాంజనేయులుగారు.

శ్రీ బూర్ల రామాంజనేయులు (SRI BURLA RAMANJANEYULU) (ప్రత్తిపాడు): అధ్యక్షా, ధన్యవాదాలు. ఈరోజు లఘుచర్యలో ఎస్సీ సబ్‌కేటగిరైజేషన్ మీద మాట్లాడే అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, రాజ్యాంగబద్ధంగా 1950 చట్టం ప్రకారం దేశం మొత్తం మీద ఎస్సీ జాబితాలో 1,169 కులాలు ఉంటే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 59 కులాలున్నాయి. ఉన్న 59 కులాలన్నీ షెడ్యూల్డు కులాలే. కానీ రాజ్యాంగబద్ధంగా లభించవలసిన ఆర్థిక ఫలాలు, సామాజిక ఫలాలు, రాజకీయ ఫలాలు, విద్యా ఫలాలు అందరికీ సమానంగా లభించడం లేదన్నది వాస్తవం. ఇది ఆనాడు రాజ్యాంగాన్ని రచించిన డా.బి.ఆర్.అంబేడ్కర్‌గారే సామాజిక న్యాయం అన్నారు. అంటే సోషల్ జస్టిస్. అదే విధంగా సమన్యాయం (Equitable justice) అని కూడా వారు అన్నారు. ఈ రెండింటినీ సమ్మేళనం చేస్తూ, షెడ్యూల్డు కులాల్లో ఉన్న కులాల మధ్య అంతర్యాన్ని తగ్గించి అందరికీ సమాన అవకాశాలు కల్పించే విషయంలో ఎవరికీ నష్టం జరుగకూడదనేది అంబేడ్కర్‌గారి ఆశయం. ఆ ఆశయాన్ని ఆచరణలో పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడుగారు. ఎందుకంటే ఈ విషయం సభాముఖంగా నేను చెప్పడానికి ఏరకంగా కూడా సంశయించడం లేదు. ఎస్సీ కులాల్లో కేటగిరైజేషన్ అన్నది భారతదేశంలోని హరియాణా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1999నాటి నివేదికను ఆధారంగా చేసుకుని 2000లో ఎస్సీ కులాలను ఏ,బీ,సీ,డీలుగా విభజన చేశారు. ఎస్సీలో ఉన్న inadequacy భావనను తొలగించిన మహానుభావుడు, దళిత బాంధవుడు, దళితులకు దేవుడిగా నిల్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడుగారని చెప్పడానికి ఎలాంటి అతిశయోక్తి లేదు.

అధ్యక్షా, ఎస్సీ సబ్‌కేటగిరైజేషన్ అనేది ఏదో రాజకీయ కోణంలో ఆలోచించినది కాదు, లేదా ఏదో ఓట్ల కోసం ఆలోచించిన అంశం కాదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తి, అంబేడ్కర్‌గారి ఆశయాలు, వివిధ కమిషన్లు ఇచ్చిన నివేదికలు, రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులు ఇందులో ఇమిడి ఉన్నాయి. 1950లో షెడ్యూల్డు కులాల జాబితాలో 1,169 కులాలుగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత 1965వరకు ఫలాలు ఎలా అందాయనే విశ్లేషణ చేస్తే, ఆరోజు సీనియర్ ఐఏఎస్ అధికారిచే ఒక కమిషన్ ఏర్పాటు చేయగా ఆనాడే వారు చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో కొన్ని కులాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయి, మరి కొన్ని కులాలు లబ్ధిపొందడంలేదనే ఆలోచన ఆరోజే సీనియర్ ఐఏఎస్ అధికారి అధ్యక్షతన ఏర్పాటైన కమిషన్ ప్రభుత్వానికి చెప్పింది.

ఆ తరవాత మన రాష్ట్రానికి వస్తే, 1994లో ఎంఆర్‌పీఎస్ ఉద్యమం పుట్టుకొచ్చింది. అయితే ఆ ఉద్యమం నేపథ్యంలో ఉన్న ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆ కమిషన్ 1999లోనే స్పష్టంగా

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 59 కులాల్లో కొన్ని కులాలకు లబ్ధి పొందగా, మరికొన్ని కులాలకు అసలు లబ్ధిపొందలేదనే విషయం స్పష్టంగా చెప్పిన తరవాత ఆ కమిషన్ నివేదికననుసరించి ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా విభజించాలనే ప్రక్రియకు చంద్రబాబు నాయుడుగారు శ్రీకారం చుట్టారు. దాన్ని 2000నుంచి అమలుపరిస్తే, 2004వరకు ముఖ్యంగా నాలుగు సంవత్సరాలలోనే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 59 కులాల్లో ఏయే కులాలైతే, మాకు సరైన ప్రాతినిథ్యం లేదు, మాకు సరైన ఫలాలు అందడంలేదు అనే మూగరోదన చెందాయో అటువంటి కులాలకు 25,450 ఉద్యోగాలు వచ్చినట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సమన్యాయమంటే, సోషల్ జస్టిస్ అంటే ఇది. కాబట్టి అంబేద్కర్‌గారు ఏదైతే ఆశించారో ఆ ఆశయం మేరకే ఎస్సీ కేటగిరైజేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు ఆనాడే నాంది పలికారు తప్ప మరొక కోణంలో ముఖ్యంగా రాజకీయ కోణంలో, ఇంకొకరిని తక్కువ చేసే విషయంలో, మరొకరిని భుజాల మీద ఎక్కించుకోవాలనే ఆలోచన వారికి ఏమీ లేదు. అందరికీ న్యాయం జరగాలనే ఒకే ఒక ఆలోచన వారికి ఉంది.

అయితే 2004లో సుప్రీం కోర్టు E V Chinnaiah vs. State of Andhra Pradesh కేసులో అన్ని షెడ్యూల్డు కులాలను ఒక సమాన సమూహంగా పరిగణించాలని, ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ జాబితాను ఉపవర్గీకరించే అధికారం లేదని ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. ఆర్టికల్ 341లో కూడా చెప్పింది అదే. ఏ కులాన్ని చేర్చడానికి, ఏ కులాన్ని తీసివేయడానికి వీలు లేదు, అది ఏదైనా రాష్ట్రపతి గారి ఆమోదంతో మాత్రమే జరగవలసి ఉంది, అందు నిమిత్తం పార్లమెంట్‌లో బిల్లు పాస్ కావాలనేది ఆర్టికల్ 341లో పొందుపర్చబడింది కాబట్టి ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే, దాన్ని misrepresentation, sub-categorization చేసే అధికారం రాష్ట్రాలకు లేదని దాన్ని మరొక రకంగా తీసుకువచ్చి దాదాపు 30సంవత్సరాలు వైరుధ్యంతో కూడిన ఉద్యమాలకు తెరతీశారు. ఆ కారణంగా ఉద్యమాలు జరిగాయి.

చివరికి 2019, 2020, 2022 మధ్యన జస్టిస్ అరుణ్ మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 341 ప్రకారం జాబితాలో ఉన్న కులాలను తగ్గించడం సాధ్యపడనప్పటికీ ఆయా కులాల్లో ఉన్న తారతమ్యాలను సమానం చేసే అధికారం రాష్ట్రాలకు ఉంది, అవసరమని భావిస్తే చేసుకోవచ్చని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఆ విధంగా E V Chinnaiah vs. State of Andhra Pradesh కేసులో ఇచ్చిన తీర్పు, Davinder Singh vs. State of Punjab జస్టిస్ అరుణ్ మిశ్రా ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఒక్కటే అని అన్నింటినీ క్రోడీకరించి ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించారు. 2025, ఆగస్టు 1న దాదాపుగా దేశంలో ఉన్న 1,169 కులాలకు సంబంధించి అంబేద్కర్‌గారు ఆశించినట్లుగానే అందరికీ సమానంగా ఫలాలు లభించాలని కోరుకున్నారో అందుకు అనుగుణంగానే ధర్మాసనం తీర్పు వచ్చింది. రాజ్యాంగస్ఫూర్తితో కూడిన జడ్జిమెంట్‌గా భావించాలి. దేశంలో అత్యుత్తమమైన న్యాయస్థానం ఇచ్చిన జడ్జిమెంట్. ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఆరుగురు సభ్యులు ఉపవర్గీకరణకు అంగీకారం తెలిపారు. ఆ అంగీకారం ప్రకారమే

రాజ్యాంగబద్ధుడైన ప్రియతమ ముఖ్యమంత్రిగారు, దళితబాంధవుడు, దళితుల్లో ఎవరికీ అన్యాయం చేయకూడదని తలంచిన మహానుభావుడు కాబట్టే ఆయన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. ఏకసభ్య కమిషన్ నాలుగు మాసాల పాటు రాష్ట్రంలోని 26 జిల్లాలు తిరగ్గా వారి దృష్టికి వచ్చిన 3,820 విజ్ఞప్తులను పరిశీలన చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో 59 కులాల్లో ఏయే కులానికి ఎవరెవరికి, ఎన్నెన్ని ఫలితాలు ప్రభుత్వం ద్వారా లభిస్తున్నాయనే కోణంలో, ముఖ్యంగా సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా లభించే ఫలితాలపై విశ్లేషించి స్పష్టంగా 360పేజీల నివేదిక ప్రభుత్వానికి ఇచ్చారు. ఆ నివేదికను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న 2011నాటి సెన్సస్‌కు authenticity ఉంది కాబట్టి ఆ నివేదికను ఆధారంగా చేసుకుని ఇప్పుడు సబ్‌కేటగిరైజేషన్ ఇవ్వడం జరిగింది. అయితే, ఇక్కడ మనం ఆలోచించవలసింది ఒకటే. కొంత మందికి కొన్ని రకాలైన అభిప్రాయాలున్నాయి. ఎందుకంటే జిల్లాను ఒక యూనిట్‌గా చేసుకుని సబ్‌కేటగిరైజేషన్ చేయాలని కొంత మంది కోరుతున్నారు. వాస్తవమే జిల్లాను యూనిట్‌గా చేసి కేటగిరైజేషన్ చేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆలోచన చాలా మందికి ఉంది. దీన్ని ఎవరూ కాదనలేరు. 2011లో జరిగిన సెన్సస్‌కు అథారిటీ ఉంది. ఆ తరవాత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల విభజన జరిగింది. ఆ కారణంగా 13 జిల్లాలు 26 జిల్లాలుగా ఏర్పడ్డాయి. ఇప్పుడు జిల్లాలో ఉండే జనాభా ప్రాతిపదికన చేయడానికి అథారిటీ లేదు. కాబట్టి 2021 సెన్సస్ 2026నాటికి authenticity వస్తుంది. అప్పుడు కావాలనుకుంటే ఆలోచన చేయవచ్చు కానీ అప్పటివరకు ప్రభుత్వం ద్వారా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఆయా ఉపకులాలకు అందాలి కాబట్టి ఈరోజు ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని సబ్‌కేటగిరైజేషన్ చేయడం అనే అంశంపైన సభలో చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి ఆలోచన విధానాన్ని అభినందించవలిసిన అవసరం ఉంది. ఏది ఏమైనా దళితులకు సమాజంలో మంచి జరగాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుగారితో మాత్రమే సాధ్యమవుతుందనే విషయాన్ని మా దళిత సోదరులందరూ అంగీకరిస్తున్నారు. దాన్ని ఎవరూ కాదనలేరు. తెలుగుదేశం ప్రభుత్వానికి ఎస్సీల అభ్యున్నతికి అవినాభావ సంబంధం ఉంది.

మ.12.50

స్వర్గీయ నందమూరి తారక రామారావుగారు పార్టీ పెట్టక ముందు దళితులు నిరుపేదలుగా ఉండేవారు. ఆనాడు కొర్రలు, జొన్నలు, నూకలు తిని దళితులు బ్రతికేవారు. అటువంటి నిరుపేదలుగా ఉన్న దళితులకు కూడా అన్నం పెట్టాలని కిలోబియ్యం రెండు రూపాయలకే ఇచ్చే పథకాన్ని మహానుభావుడు నందమూరి తారక రామారావు గారు ప్రవేశపెట్టారు. ఆనాటివరకు దళితులకు నాలుగు గుంజలు, పది తాటాకులిచ్చి ఇదే మీ గుడిసె అన్నారు. అటువంటి పరిస్థితిలో ఉన్న దళితులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే. ఆ తర్వాత గౌరవ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ముందడుగు పథకం ద్వారా దళిత మహిళలకు న్యాయం చేశారు.

అధ్యక్షా, దళితుల కోసం సబ్‌ప్లాన్ ద్వారా ₹40వేల కోట్లు ఖర్చుచేసిన దేశంలోనే ఏకైక నాయకుడు నారా చంద్రబాబునాయుడు గారు తప్ప మరొకరు కాదని యావత్ దళిత జాతి అంగీకరించే వాస్తవం. ఆయన ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 27 పథకాలకు నిధులిచ్చి విదేశీ విద్య, భూమి కొనుగోలు పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి పథకాలను అమలుచేసి దళితులను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తయారుచేశారు. నేడు అమెరికాలో స్థిరపడిన 500కు పైగా దళిత బిడ్డలు ఇక్కడున్న తమ తల్లిదండ్రులకు నెలకు ఐదు లక్షలు, ఆరు లక్షలు పంపిస్తున్నారంటే అది చంద్రబాబునాయుడు గారు పెట్టిన బిక్ష తప్ప మరొకటి కాదనేది వాస్తవం. రాజ్యాంగంలో అన్ని హక్కులు ఉన్నాయి. కానీ, ఏ నాయకుడైతే రాజ్యాంగపరమైన హక్కులను దళితులకు ఇవ్వాలని ఆలోచిస్తాడో ఆ నాయకుడే దళిత బాంధవుడు. ఆ కోణంలో దేశంలోనే మొట్టమొదటి వరుసలో నిలబడే వ్యక్తి నారా చంద్రబాబునాయుడుగారు.

అధ్యక్షా, దళితుల్లోనే వివక్ష ఉందని, అంటరానితనముందని, రెండు గ్లాసుల సిస్టం ఉందని ఆరోజు జస్టిస్ పున్నయ్యగారి కమిషన్‌ను నియమించారు. దాదాపు 42 అంశాలపై ఆయన సిఫార్సులు చేస్తే 18 అంశాలపై జీవోలిచ్చారు. ఈరోజు బాధితులైన దళితులకు నష్టపరిహారమిచ్చే జీవో ఆరోజు చంద్రబాబునాయుడు గారే ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎస్సీలపై ఎస్సీ కేసులు పెట్టే దుర్మార్గపాలన వైసీపీ ప్రభుత్వంలోనే చూశాం. ప్రభుత్వానికి భూములిచ్చిన పాపానికి దళితుల చేతులకు సంకెళ్లు వేసిన నీచమైన సంఘటనలు వైసీపీ ప్రభుత్వంలో చూశాం. మన జాతి ఉన్నతికి, మన జాతి అభివృద్ధికి ఏదైనా ఆలోచించడంలో గానీ, అమలుచేసే విషయంలో గానీ చంద్రబాబునాయుడు గారిని మించిన నాయకుడు లేడన్నది మా దళిత సోదరులంతా అర్థంచేసుకుని ఆయన తీసుకునే నిర్ణయాలకు మనమంతా సమూహంగా అంగీకారం తెలపాలి. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మన దళిత సోదరులకు న్యాయంకోసం మనలోనే వెనకబడిన వారికి సాయం చేయడం కోసం మనమంతా కలిసి ఒకే మాటపై ముందుకు వెళ్లి చంద్రబాబునాయుడు గారి ఆలోచనలను బలపర్చాలి. ఈ చక్కటి అవకాశం నాకు ఇచ్చినందుకు తమరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

శ్రీ కొండ్రు మురళీ మోహన్ (SRI KONDRU MURALI MOHAN) (రాజాం): అధ్యక్షా, ధన్యవాదాలు. ముఖ్యంగా ఎస్సీ యువకులు, విద్యార్థులు, ఉద్యోగులకిచ్చే రిజర్వేషన్ల విషయంలో అదొక పెద్ద గిఫ్ట్ మాదిరిగా, ఏదో దోచుకునే విధంగా చాలామంది భావిస్తున్నారు. భారతదేశంలో కులవ్యవస్థ కొన్ని వేల సంవత్సరాల నుంచి ఉండడం మనందరికీ తెలుసు. ఈ సమాజంలో వేదకాలం నుంచి చాతుర్వర్ణ వ్యవస్థ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా విభజించబడ్డారు. అత్యంత అస్పృశ్యులుగా ఆనాటినుంచి ఈనాటి వరకు అణచివేయబడ్డ వారిని బ్రిటీషు ప్రభుత్వంలో 1935లో షెడ్యూల్డు

కులాలుగా విభజించారు. గత నాలుగువేల సంవత్సరాల నుంచి ఈ కులాలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. వీరు ఎంతో అణిచివేయబడ్డారు. వీరు చెప్పులు కుట్టడం, శవాలను కాల్చడం, పారిశుద్ధ్య కార్మికులుగా, వ్యవసాయ కూలీలుగా పనిచేయడం మనందరికీ తెలుసు.

అధ్యక్షా, ప్రాచీన యుగం నుంచి మధ్యయుగంలో మొఘులులు, విజయనగర సామ్రాజ్యంలో ఎస్సీలను శ్రమజీవనానికి అంటే రకరకాల పనుల కోసమే ఉపయోగించేవారు. వారిపై కఠినమైన సామాజిక నియంత్రణ ఉండేది. వందల సంవత్సరాలుగా ఎస్సీలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. బ్రిటీషు పాలన వచ్చిన తర్వాత కొంత మార్పు రావడం, శాస్త్రీయంగా వీరిపై అధ్యయనం చేయడం ప్రారంభమైంది. ఆ ప్రభుత్వాలు వీరిని షెడ్యూల్డు కులాలుగా గుర్తించాయి. దీనికి ప్రధానం కారణం డా.బీఆర్ అంబేడ్కర్. ఆయన ఉన్నతవిద్యను అభ్యసించి ప్రపంచమంతా పర్యటించి అమెరికా, లండన్ వంటి దేశాల్లో మానవులు ఏవిధంగా జీవిస్తున్నారు, ఏవిధంగా సమసమాజముందని అధ్యయనం చేశారు. ఆనాడు ఎస్సీలు నాలుగైదు విధాలుగా అణచివేయబడ్డారు. ముఖ్యంగా ఆనాడు సామాజిక అణచివేత ఉండేది. ఎస్సీలకు దేవాలయాల్లో ప్రవేశం లేకపోవడం, చెరువుల్లో మంచినీటిని ఎస్సీలు ముట్టుకుంటేనే ఆ నీరు మైల పడుతుందనే భావంతో ప్రజలంతా ఉండేవారు. అంతేగాక, ఆనాడు దళితుల నివాసాలు ఊరికి దూరంగా ఉంచడం వంటి అణచివేత కూడా ఉండేది. ఇలాంటి అణచివేతలు చాలా ఉండేవి.

అధ్యక్షా, ఆనాడు ఎస్సీలపై ఆర్థిక అణచివేత కూడా ఉండేది. వారు ఆనాడు భూములను, ఎటువంటి ఇతర ఆస్తులను సంపాదించకూడదనే అణచివేత కూడా ఉండేది. ఆనాడు ఎస్సీలు విద్యను అభ్యసించాలంటే చెవుల్లో సీసం పోసే పరిస్థితి ఉండేది. ఇటువంటివన్నీ మనకు స్వాతంత్ర్యం రాకముందు 200 సంవత్సరాల వరకు కఠినంగా ఉండే ఆచారాలు. డా.బీఆర్ అంబేడ్కర్ గారు వచ్చిన తర్వాత మార్పు మొదలైంది. ఆనాటి అంటరానితనం గురించి చాలామంది యువతకు తెలియాలి. ఎందుకంటే ఇంకా 100సంవత్సరాలు కూడా పూర్తవలేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): సభలో ఒక ముఖ్యమైన సబ్జెక్టుపై చర్చ జరుగుతున్న సమయంలో గౌరవసభ్యులు శ్రద్ధగా వినాలని నేను విజ్ఞప్తిచేస్తున్నాను.

శ్రీ కొండ్రు మురళీ మోహన్ (SRI KONDRU MURALI MOHAN): అధ్యక్షా, పబ్లిక్ ట్యాంక్ నుంచి తాగునీటిని దళితులు తీసుకునే విషయంలో మొట్టమొదటిసారి డా. బీఆర్ అంబేడ్కర్ గారు తేది.20.03.1927నాడు ఉద్యమం చేశారు. ఆయన దళితుల కోసం చేసిన పోరాటం ఆనాడే ప్రారంభమైంది.

మ.1.00

1930లో ఆలయ ప్రవేశం కోసం ఉద్యమం, 1932 పుణే ప్యాక్ట్‌పై సంతకం చేయడం కాలక్రమేణా జరిగాయి. తరవాత దేశానికి స్వాతంత్ర్యం రావడం, ఆచారాల కోసం పెద్దలు వారి జీవితాలను త్యాగం చేశారు. సమసమాజం కోసం రాజారామ్మోహన్‌రాయ్, గాంధీ, నెహ్రూగార్లు పాటుపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత అంబేడ్కర్‌గారు రాజ్యాంగాన్ని రాశారు. రాజ్యాంగం రాయడానికి ముందు ఆయన పాల్గొన్న ఉద్యమాల ఫలితమే రిజర్వేషన్స్ వచ్చాయి. అంటరానితనాన్ని నిషేధించడం, ప్రాథమిక హక్కులు కూడా రాజ్యాంగం ద్వారా కల్పించారు.

నాకు తెలిసినంతవరకు 1980 నుంచి 1985వరకు డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చేవి. 1991లో నేను ఇంజనీరింగ్ చేశాను, ఆనాడు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్‌లో నా బ్యాచ్‌మేట్స్‌లకు, ఎలక్ట్రికల్స్‌లో పాస్ అయిన ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు వచ్చాయి. 1990వరకు డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుకున్న వారికి టీచర్ ట్రైనింగ్ చేసే అవకాశం ఉండేది కాదు. కాలక్రమేణా ఎప్పుడైతే ప్రైవేటైజేషన్ వచ్చిన తరవాత ప్రభుత్వ ఉద్యోగాలు రావడం లేదు. కొన్ని ఉద్యమాలు జరిగి డేటా తీసుకున్న తరవాతే వర్గీకరణ జరిగింది. మాకు అన్యాయం జరిగిందని కొందరు సభ్యులు చెబుతున్నారు. ముందు నుంచి వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉండటం, ఎస్సీలకు సంబంధించిన విషయాల్లో చంద్రబాబునాయుడుగారు పర్టిక్యులర్‌గా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారు. లక్షలాది మంది గ్రూప్ వన్ ఆఫీసర్లు, ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారంటే తెలుగుదేశం పార్టీ ఆనాడు నందమూరి రామారావుగారికి ఉన్న దూరదృష్టి. ఎస్సీల పట్ల చంద్రబాబునాయుడుగారికి ఉన్న కమిట్‌మెంట్. చంద్రబాబునాయుడుగారు పున్నయ్య కమిషన్ వేశారు. ఆయన హయాంలో రాష్ట్రపతిగా కేఆర్ నారాయణ్‌గారిని లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగిగారిని దేశంలోనే అత్యున్నత స్థానాల్లోకి తీసుకెళ్లారు. శ్రీమతి ప్రతిభాభారతి శాసనసభ సభాపతిగా నియమించారు. ఇవన్నీ చంద్రబాబునాయుడుగారు ఎస్సీల పట్ల కమిట్‌మెంట్‌తో చేశారు.

ఎస్సీల కోసం 28 పథకాలను తీసుకొచ్చారు, అందులో ముఖ్యంగా భూమి కొనుగోలు పథకం, విదేశీ విద్య పథకం. వాటిని గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డిగారు పూర్తిగా తొక్కేశారు. 2014-19లో లోకేశ్‌గారు 25వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను దళిత కాలనీల్లో వేయించారు. తెలుగుదేశం పార్టీ మంచి అభిప్రాయంతో ఎస్సీలను మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకొచ్చి, సమానత్వ భావన అందరిలో కల్పించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం, చంద్రబాబునాయుడుగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మనందరం చూశాం. ఎస్సీల కేటగిరైజేషన్ కోసం Rajiv Ranjan Mishra, IAS(Retired)ను "One Man Commission" వేశారు, అందులో ఒక శాతం రిజర్వేషన్ రెల్లిలకు, వారికి సంబంధించిన ఉపకులాలకు ఇచ్చారు.

జిల్లాలను యూనిట్‌గా చేయడం వల్ల అందరికీ సమన్యాయం జరుగుతుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, చిత్తూరు ప్రాంతాల్లో అరవై శాతం నుంచి డెబ్బై శాతం మాలలు ఉన్నారు. రాయలసీమలో అరవై శాతం నుంచి డెబ్బై శాతం మాదిగలు ఉన్నారు. వారికి న్యాయం జరగాలంటే జిల్లాల వారీగా గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాలన్నీ జిల్లాల వారీగా విభజించి చేస్తేనే అందరూ సంతోషిస్తారు. తదనుగుణంగా వారి కుటుంబాలు ముందుకు వెళ్తాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో మాదిగలు పదకొండు శాతం, రెల్లి, రెల్లి ఉపకులాలు ఇరవై మూడు శాతం ఉన్నారు. వంద టీచర్ పోస్టులు వస్తే కమిషన్ ప్రకారం ఏడు పోస్టులు రెల్లిలకు వస్తాయి. న్యాయ ప్రకారం వంద పోస్టులకు ఇరవై మూడు రావాలి. ఇలాంటివన్నీ శాస్త్రీయంగా చేయాలంటే జనాభాకు సంబంధించి డేటా లేదు. 2021లో ఉన్న జనాభాను బేస్ చేసుకుని తీసుకోవాల్సి ఉంటుంది, 2026లో జనాభా లెక్కలు వస్తాయి కనుక అప్పటి నుంచైనా జిల్లాల వారీగా తీసుకోవాలని తెలియజేసుకుంటున్నాను. చంద్రబాబునాయుడుగారిపై ఉన్న అభిమానంతో తెలుగుదేశం పార్టీ కూటమికి 164 సీట్లు వచ్చాయి. వారి ప్రేమానురాగాలు పొందాలంటే అందరికీ సమన్యాయం జరగాలి, సమన్యాయం చేస్తానని ముఖ్యమంత్రిగారు ఒప్పుకున్నారు. 2026 నుంచి జిల్లాలను యూనిట్‌గా తీసుకుంటామని సోషల్ వెల్ఫేర్ మంత్రిగారు చెప్పారు, అలా చేయాలని కోరుకుంటూ దీనిని ఆమోదిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మద్దిపాటి వెంకటరాజు (SRI MADDIPATI VENKATARAJU) (గోపాలపురం): అధ్యక్షా, సభలో జరుగుతున్న చర్చ ఎస్సీ రిజర్వేషన్లు, ఎస్సీల వర్గీకరణ అంశంపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గౌరవసభ్యులు చెప్పినట్లు రిజర్వేషన్లు కేవలం ఉద్యోగకల్పన కోసమో, అవకాశాల కోసమో కాకుండా పేదరిక నిర్మూలనతోబాటు వివక్షను రూపుమాపడం, సమానత్వాన్ని తీసుకురావాలనే అంశాలతో రిజర్వేషన్లు ముడిపడి ఉన్నాయి.

తరతరాలుగా సమసమాజం, సమానత్వం కోసం, అట్టడుగున ఉన్న వర్గాలు చేస్తున్న పోరాట ఫలితాలు మనం చూస్తూ ఉన్నాం. ఈ అంశాన్ని అనేక రాజకీయ పార్టీలు రకరకాల కోణంలో చూసినప్పటికీ తెలుగుదేశం పార్టీ మాత్రం ఆనాటి నుంచి నేటివరకు ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని వివక్ష రూపుమాపడంలో ప్రధాన భూమిక పోషిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. దానికి ఉదాహరణ నేనే. ఒక సామాన్య దళిత కుటుంబంలో నేను పుట్టాను. తెలుగుదేశం పార్టీ 1984లో తీసుకున్న సంస్కరణల ఫలితంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను నెలకొల్పారు. ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిగా తదనంతరం నారా చంద్రబాబునాయుడుగారు తీసుకువచ్చిన సాంకేతిక సమాచార విప్లవంలోని సంస్కరణలలో భాగంగా నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అవకాశం వచ్చింది. సంపన్న వర్గాలతోబాటు సమానంగా విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేసే అవకాశాలు వచ్చాయి. తరవాత శాసనసభ సభ్యుడిగా సభకు రావడానికి కారణం ఆనాడు తెలుగుదేశం పార్టీ తీసుకున్న సంస్కరణలు, సమాజంలో సమానత్వాన్ని తీసుకురావడానికి చేసిన కృషి ఫలితం. నాలాంటి సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన

వ్యక్తి కూడా సంపన్నవర్గాలతోబాటు, మిగతా వర్గాలతోబాటు సమానమైన గౌరవాన్ని పొందగలిగే అవకాశాన్ని కల్పించారు. అందుకు చంద్రబాబునాయుడు గారిని, తెలుగుదేశం పార్టీని అభినందించాల్సిన విషయం.

అట్టడుగున ఉన్న వారికి, చిట్టచివరి వ్యక్తికి రాజ్యాంగ స్ఫూర్తి, హక్కులు, అవకాశాలు అందాలని డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి ఆశయం. సమాజంలో వచ్చిన అనేక మార్పుల కారణంగా ఉపకులాల్లో అసమానతలు నెమ్మదిగా పెరగడం ఒక కారణమైతే ఆనాడు, ఈనాడు జరుగుతున్న ఉద్యమాలను దృష్టిలో పెట్టుకుని సామాజికవాది, మానవతావాది నారా చంద్రబాబునాయుడుగారు కొన్ని కమిషన్లు వేసి క్షేత్రస్థాయిలో ఉపకులాల మధ్య ఎలాంటి అసమానతలు ఉన్నాయో వారి ఆర్థిక, సామాజిక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని వివిధ సంఘాల అభిప్రాయాలు, ప్రజల అభిప్రాయాలు విశ్లేషించి సంపూర్తిగా అధ్యయనం చేసి, అవగాహనకు వచ్చి ఈరోజు ఏ, బీ, సీ, డీ వర్గీకరణకు ఆమోదం తెలపడం అభినందనీయని తెలియజేస్తున్నాను.

2019 నుంచి 2024 వరకు జరిగిన పాలన వల్ల దళితుల ఇతర సామాజికవర్గాల మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. వాటికి గల కారణాలు గౌరవసభ్యులు వివరించారు. ఎస్సీల వర్గీకరణ అమలు గౌరవసభ్యులు చెప్పినట్లుగా జిల్లాను యూనిట్‌గా తీసుకోగలిగితే ఉపకులాలకు కూడా పూర్తి న్యాయం జరుగుతుంది. కనుక దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను. దళిత సామాజికవర్గాల వారికి ఇతర సామాజికవర్గాలకు గత పాలనా శాపం వల్ల పెరిగిన వ్యత్యాసాన్ని తగ్గించడానికి ఒక ప్రణాళికతో చంద్రబాబునాయుడుగారు మానవతా దృక్పథంతో దళితజాతిని ముందుకు తీసుకెళ్లడంలో వారు ముందుండాలని కోరుకుంటున్నాను. రాజ్యాంగ ఫలాలు చిట్టచివరి వరకు అందాలి కనుక రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని, ప్రజలు కూడా విశాల దృక్పథంతో ఆలోచిస్తారని మరొకసారి కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మ.1.10

శ్రీ బోనెల విజయచంద్ర (SRI BONELA VIJAYACHANDRA) (పార్వతీపురం): అధ్యక్షా, ధన్యవాదాలు. దేశంలో ప్రతి ఒక్కరూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతి సాధించాలంటే ఒక సంకల్పం ఉండాలని భారత రత్న డా.బి.ఆర్.అంబేడ్కర్‌గారు చెప్పారు. ఆయన ఆలోచనే, ఆయన ఆశయమే ఈ ఉపవర్గీకరణ. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు రిజర్వేషన్ ఆయన ఆలోచన నుంచి వచ్చిందే. ప్రతి కేటగిరీలోని అన్ని ఉపకులాలు సమానంగా ఎదగాలనే ఆలోచనకు ప్రతిరూపమే ఈ వర్గీకరణ. ఒక తల్లిబిడ్డలుగా ఉన్న దళిత సోదరసోదరీమణులు సమాన అవకాశాలతో, సమాన చూపుతో, సమాన ప్రేమతో మిగతా వర్గాలకు దీటుగా ఎదగాలన్న సంకల్పంతో భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ వర్గీకరణ. ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఎన్నాళ్లో వేచిన ఉదయమన్నట్లు ఇది ఎన్నో ఏళ్లుగా వేచి

చూస్తున్న ఉదయం, ఒక నవోదయం, మహోదయం. వర్గీకరణ కచ్చితంగా జరిగితీరాలని అంబేడ్కర్‌గారు చెప్పారు. వారు కన్న కలలు నిజమై ఈరోజు ప్రతి దళితుడు సమాన హక్కు పొందాలి, ఎవరు ఎంత శాతం ఉంటే వారికి అంత వాటా రావాలని కోరుకున్న విధంగా ఈరోజు జరగడం చాలా సంతోషకరం. ఇదే ఆ మహనీయునికి నిజమైన నివాళి. ఆయనకు నిజమైన వారసుడిగా, ఆయన ఆలోచనకు రూపునిచ్చిన నిజమైన దళిత పక్షపాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి మీద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఇది పేదల ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడినవారి పక్షపాత ప్రభుత్వం. ఈ ప్రభుత్వం ప్రజలందరిదీ అని మరోసారి నిరూపించిన రాష్ట్ర ప్రభుత్వానికి దళిత సోదరుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ వర్గీకరణ ఒక ఉద్యమంతో మొదలైందని అందరికీ తెలిసిందే. ఆ ఉద్యమంలో చాలా మంది బలిదానాలు చేశారు. వాళ్ల కోసం వాళ్లు బలిదానాలు చేసుకోలేదు, భావితరాల కోసం చేయాల్సి వచ్చింది. ఆ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలు విడిచారు. ఈ 30సంవత్సరాల పోరాటానికి కూడా ఇంతకుముందు ఊపిరిపోసింది తెలుగుదేశం ప్రభుత్వమే. తిరిగి మళ్లీ అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, ఎన్డీయే కూటమి దళితులకు సమన్యాయం చేస్తూ, మాట ఇచ్చినట్లే గౌరవ ముఖ్యమంత్రిగారు దళితులకు సామాజికన్యాయం అందించారు. అందుకు చాలామంది చాలా విధాలుగా పోరాడారు. అందులో ఎంఆర్‌పీఎస్, థింక్ ట్యాంక్ ఫోరం, దళిత ఫెడరేషన్, మాదిగ ఐక్యవేదిక, మొదలగు సంఘాలకు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. వాళ్లందరికీ అభినందనలు, శుభాకాంక్షలను మీద్వారా తెలియజేస్తున్నాను. దాదాపు 59 ఉపకులాల్లో ఎవరూ విశ్వవిద్యాలయం మెట్లు ఎక్కలేదు. ఆ కులాల్లో ఒక డాక్టర్ లేడు, ఒక ఇంజనీర్ లేడు, గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగాలంటే వారికి తెలియదు. ఈ సమన్యాయం ద్వారా వాళ్లకు కూడా న్యాయం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అలాగే రెల్లి, పైడి కులస్తులకు కూడా ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారు. జనాభా ప్రాతిపదికన వారికి ఎంత రిజర్వేషన్ రావాలో అంత ఇస్తే బాగుంటుంది. గౌరవ సభ్యులు చెప్పినట్లు చరిత్రలో దళితులకు చాలా అన్యాయం జరిగింది.

భారతదేశంగా పిలవబడుతున్న ఈ జంబూద్వీపాన్ని పాలించింది కూడా దళితుడే. పెళ్లిళ్లు జరిగేటప్పుడు అందరూ చూస్తున్న అరుంధతీ నక్షత్రం కూడా ఒక దళిత అమ్మాయే. అలాగే భగవాన్ శ్రీకృష్ణుడి మూడో భార్య జాంబవతి కూడా దళిత బిడ్డే. జాంబవంతుడు కూడా దళిత బిడ్డే. ఇతిహాసాల్లో, పౌరాణికాల్లో ప్రతి చోట మేము ఉన్నాం. కాకపోతే సమాజంలో వచ్చిన మార్పుల వల్ల మమ్మల్ని దళితులుగా మార్చారు. గతాన్ని మర్చిపోయి ఇక్కడున్న ప్రతి ఒక్క దళిత సభ్యుడు సామాజిక బాధ్యత తీసుకుని మన వంతు బాధ్యతగా మనతోబాటు మన దళిత కులాల్ని, దళిత బంధువుల్ని, దళిత తమ్ముళ్లని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రపంచం పోటీ ప్రపంచంగా మారింది. ఈ పోటీ ప్రపంచంలో మన వాళ్లలో కూడా స్పిరిట్ నింపాల్సిన అవసరముంది.

ఒక మంచి కొటేషన్‌ను తెలుగులో చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఇద్దరు వ్యక్తులు తుపాకులతో ఎదురైనప్పుడు వారు రూల్స్ మాట్లాడుకుంటారు. ఇద్దరు వ్యక్తులు కత్తులతో ఎదురైనప్పుడు వారు చట్టం గురించి మాట్లాడుకుంటారు. ఇద్దరు వ్యక్తులు ఉట్టి చేతులతో ఎదురైనప్పుడు కారణాలు మాట్లాడుకుంటారు. ఒక వ్యక్తి తుపాకితో, మరొకవ్యక్తి కత్తితో ఎదురైనప్పుడు ఏమి మాట్లాడుకుంటారనేది వారి చేతిలోని ఆయుధంపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి తుపాకితో, మరో వ్యక్తి ఉత్తి చేతులతో ఎదురైనప్పుడు ఒక జీవితం ఉండదు. ఈ ఉదాహరణ సమానత్వం గురించి వివరించడానికి చెప్పాను. సమానంగా ఉండేటప్పుడు నిబంధనలు, చట్టాలు వర్తిస్తాయి. అది లేకపోతే ఒక పెద్ద అగాథం ఏర్పడుతుంది. ఆ అగాథాన్ని పూడ్చలేమని మీద్వారా తెలియజేస్తున్నాను. ఈరోజు ఒక గొప్ప రోజు, చరిత్రలో లిఖించదగిన రోజు. ఒక పోరాటానికి ముగింపు పలుకుతూ ప్రతి ఒక్క దళితుడూ సగర్వంగా సమాన హక్కును పొందే అవకాశాన్ని ఇచ్చిన ఈ ఎన్డీయే కూటమికి, ముఖ్యంగా ముఖ్యమంత్రిగారికి మీద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ, నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (MR.DEPUTY SPEAKER): అందరూ కోరుకుంటున్నట్లుగా ఇప్పుడు 45నిమిషాల లంచ్ బ్రేక్. ఆ తరవాత సభ తిరిగి సమావేశమవుతుంది. మధ్యాహ్నం మరో ఇద్దరు సభ్యులు మాట్లాడిన తరవాత గౌరవనీయ ఉపముఖ్యమంత్రిగారు, గౌరవనీయ ముఖ్యమంత్రిగారు మాట్లాడతారు. మంత్రిగారు ఎలాగూ మాట్లాడతారు. It goes without saying. అందుచేత కొంచెం సుష్టుగానే భోజనం చేసి రండి.

(సభ మ.1.17గంటలకు భోజన విరామం కోసం వాయిదా పడింది)

మ.2.00

(భోజన విరామానంతరం సభ మధ్యాహ్నం 2.00గంటలకు పునఃప్రారంభమైంది.)
(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానం వహించారు)

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER): అనుసూచిత కులాల ఉపవర్గీకరణ నివేదికపై లఘుచర్చ కొనసాగింపు. కాలవ శ్రీనివాసులు గారు.

శ్రీ కాలవ శ్రీనివాసులు (SRI KALAVA SRINIVASULU): అధ్యక్షా, ధన్యవాదాలు. ఎస్సీ వర్గీకరణ దశాబ్దాల కల. అట్టడుగు వర్గాల వారికి సముచిత న్యాయం చేసే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం వేస్తున్న అతి పెద్ద అడుగుగా నేను భావిస్తున్నాను. దేశవ్యాప్తంగా అనేక షెడ్యూల్డ్ కులాలలో ఉపకులాల మధ్య ఆర్థిక అసమానతలు తొలగడానికి విద్య, ఉద్యోగావకాశాలలో తగిన న్యాయం జరగడానికి ఈ వర్గీకరణ అవసరమని చాలా కమిషన్లు తేల్చి చెప్పాయి. ఆ నేపథ్యంలో భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎస్సీ ఉపకులాలను ఏ, బీ, సీ, డీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిన నాయకుడు, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు. ఆయన తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ

కార్యక్రమాన్ని అమలుచేసి దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచారు. తరవాత న్యాయసంబంధ సమస్యల కారణంగా అది అమలుకు నోచుకోకపోయినా ఈరోజు దేశవ్యాప్తంగా అదొక చర్చనీయాంశంగా మారింది. వివిధ సంధర్భాల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని హైదరాబాదు నగరంలో ఉన్నప్పుడు స్వయంగా దేశ ప్రధాని నరేంద్రమోదీగారే ఏ, బీ, సీ, డీ వర్గీకరణ ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రకటనలు చేసిన సందర్భాన్ని మీ అందరికీ గుర్తుజేస్తున్నాను. ఆ నేపథ్యంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును అమలుచేసే క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ నివేదిక ఈరోజు గౌరవ మంత్రి మనకు సమర్పించారు. ఆ నివేదికలో అనేక అంశాల అధారంగా వర్గీకరణ అవసరాన్ని తెలియజేశారు. వర్గీకరణ ద్వారా ఉపకులాల్లో ప్రధానమైన మాదిగలకు కూడా సముచిత న్యాయం జరుగుతుందనే విషయాన్ని స్పష్టంచేయడం మనకు తెలిసిందే.

1982లో మహనీయుడు ఎన్టీ రామారావుగారు తెలుగుదేశం పార్టీ పెట్టకముందు సామాజిక న్యాయం కాగితాలకు, ప్రచారాలకు, ప్రకటనలకు, ప్రసంగాలకే పరిమితమయ్యేది. సామాజిక న్యాయానికి అసలు సిసలైన అర్థాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చెప్పిన మొదటి నాయకుడు, మహనీయుడు ఎన్టీ రామారావుగారైతే అదే బాటలో బలహీనవర్గాలను ముఖ్యంగా దళితులు, బీసీలు, మైనారిటీలు, గిరిజనులను అక్కున చేర్చుకుని, వాళ్లకు అనేక అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వంలోనే కాకుండా మంత్రివర్గంలో, పాలనావ్యవహారాల్లో వారి ఆలోచనలకు, అభిప్రాయాలకు విలువ ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటున్న నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు. అందువల్లనే ఆయన ఆశీస్సులతో 1999–2004 మధ్య నాకు పార్లమెంటు సభ్యుడిగా పనిచేసే అవకాశం వచ్చింది. అప్పట్లో తొలి దళిత లోక్‌సభ స్పీకర్‌గా తెలుగుదేశం పార్టీ తరఫున దళిత సామాజికవర్గానికి చెందిన బాలయోగిగారిని నియమించారు. ఎంతో మంది ఉద్ధండులైన దేశ జాతీయ నాయకులందరూ ఆయనను అధ్యక్షా అని పిలుస్తుంటే, ఈ రాష్ట్రానికి సంబంధించిన పార్లమెంటు సభ్యులుగా మేము ఎంతో ఆనందపడి అడుగడుగునా చంద్రబాబునాయుడుగారికి కృతజ్ఞతలు చెప్పుకునేవాళ్లం. ఎందుకంటే, అంత మహోన్నత స్థానాన్ని దళితబిడ్డ బాలయోగి గారికి ఇవ్వడం ఆషామాషీ వ్యవహారం కాదు. అలాగే ప్రతిభా భారతిగారిని శాసనసభ స్పీకర్‌గా నియమిస్తే, అప్పట్లో రాజశేఖర్‌రెడ్డిగారితో సహా ఎంతో మంది అధ్యక్షా అని పిలిచేవారు. అలాగే దళిత మేధావులను, దళితులకు సంబంధించిన వ్యక్తుల్ని అత్యున్నత స్థానాల్లో కూర్చోబెట్టి, వారి అధ్యక్షతన సభలు సమావేశాలు నిర్వహించుకునే అవకాశం చంద్రబాబునాయుడుగారే కల్పించారు. దళితులు, బడుగులపై ఆయనకున్న ప్రత్యేక చిత్తశుద్ధికి ఇవన్నీ తార్కాణాలు. ఈరోజు సభలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణకు సంబంధించి పూర్తి మద్దతు ప్రకటించడంతోబాటు భవిష్యత్తులో జిల్లాల వారీగా ఈ వర్గీకరణ జరిగితే మరింత పటిష్టంగా అమలుచేయడానికి అవకాశం ఏర్పడుతుందని తమరి ద్వారా అభ్యర్థిస్తున్నాను.

అదేవిధంగా 60 సంవత్సరాలుగా వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలనే ఒక అంశం పరిశీలనలో ఉంది దానిని కూడా ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాను. 1861లో బ్రిటీష్‌కాలంలో దొరలు, చేయని నేరానికి మన పెద్దలందరినీ ఉదయం నుండి సాయంత్రం వరకు జైళ్లలో పెట్టేవారట. సీపీ యాక్ట్, క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ తీసుకొచ్చి దశాబ్దాల కాలం నుండి అనేక ఈతిబాధలు అనుభవిస్తున్న వారిని దుష్ట చట్టాల బారి నుండి కాపాడేందుకు చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో, దశాబ్దాల సమస్యలకు ఒక పరిష్కారం కనుగొన్నారు. కానీ అది నెరవేరక ఇంకా చాలా ఆందోళన చెందుతున్న జాతి మన రాష్ట్రంలో వాల్మీకి బోయలు. నేను ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ, వాల్మీకి బోయల సమస్యను కూడా సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పితాని సత్యనారాయణ (SRI PITHANI SATYANARAYANA) (ఆచంట): అధ్యక్షా, ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్య ఎస్సీ వర్గీకరణకు ఈరోజు కూటమి ప్రభుత్వం పరిష్కారమార్గాన్ని చూపించడం అభినందనీయం. దానిని సమర్థిస్తున్నాను. దాంట్లో అనేక అభిప్రాయాలు ఉన్నాయి. ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్ మినిస్టర్‌గా ఉన్న సమయంలో నాకు ఉన్న సమాచారం ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంటు అంశం గురించి చర్చ వచ్చినప్పుడు కూడా ఈ సమస్య వచ్చింది. ఎస్సీలలో మాదిగ, మాలలలోను 59 కులాలు ఉన్నమాట వాస్తవం. ఎప్పటికప్పుడు మాల, మాదిగ తప్ప ఎప్పుడూ ఆ కులాల్లో కూడా అనేక సబ్‌క్యాస్ట్‌లు ఉన్నాయనే వాటి గురించి ఆలోచించలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చిన తరవాత మాకు అన్యాయం జరుగుతుంది సరిచేయాలని కృష్ణ మాదిగగారు నా దగ్గరకు వచ్చారు. అప్పట్లో ఫీజు రీయింబర్స్‌మెంటు, కుల గణాంకాలకు సంబంధించి కేబినెట్ సబ్‌కమిటీలో మూడు సంవత్సరాలు నేను పనిచేశాను.

మ.02.10

అధ్యక్షా, ఫీజు రీయింబర్సుమెంట్‌లో మూడు సంవత్సరాల డేటా తీసుకున్నప్పుడు మాదిగ, మాలలకు సంబంధించిన వ్యత్యాసం 0.2శాతం ఉంది. ఈనాడు ఒక ప్రాంతంలో మాదిగలు తక్కువ, మాలలు ఎక్కువ అనే మాట వాస్తవం. దీనిని సరిచేయడానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణాలో మాదిగలు ఎక్కువని, ఆంధ్రాలో మాలలు ఎక్కువ అనే మాట ఉన్నప్పటికీ విడిపోయిన రాష్ట్రంలో రాయలసీమలో మాదిగలు ఎక్కువ అని, కోస్తా ప్రాంతంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో మాలలు ఎక్కువ అనే మాట వాస్తవం. కానీ కొన్ని జిల్లాలలో వ్యత్యాసం ఉన్నందున న్యాయం జరగడం లేదు, అన్యాయం జరుగుతోందని బహిరంగంగా మాట్లాడుతున్నారు.

ఆ వర్గాలకు సంబంధించిన వ్యక్తుల, సంఘాల, ప్రజాప్రతినిధుల ఆలోచన ఒక్కటే. ప్రజా ప్రభుత్వం జిల్లాల వారీగా రిజర్వేషన్ క్లాసిఫికేషన్ పెడితే అందరిలో కూటమి ప్రభుత్వానికి ఒక మంచి

గుర్తింపు వస్తుంది. సమస్య పరిష్కారానికి ఆలోచన చేసి తగిన న్యాయం చేయాలి. ఎందుకంటే ఒక జిల్లాలో మాదిగలు ఎక్కువ, ఒక జిల్లాలో మాలలు ఎక్కువ అనే వ్యత్యాసాన్ని సరిచేయడానికి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కొణతాల రామకృష్ణ (SRI KONATHALA RAMAKRISHNA): అధ్యక్షా, ధన్యవాదాలు. ఒక విప్లవాత్మకమైన మార్పుకు ఎస్సీ వర్గీకరణ నాంది పలుకుతుంది. చాలాకాలం నుండి ప్రజలు ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ ప్రజలందరికీ సమన్యాయం జరిగే విధంగా ఆనాడు చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకురావాలని అనుకున్నది నేటివరకు రాకుండా ఆలస్యమైనప్పటికీ వర్గీకరణ చేయాడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావడం సంతోషించవలసిన విషయం. అందరికీ సమన్యాయం చేయాలని ఏర్పాటుచేసిన ఎస్సీ వర్గీకరణకు జనసేన పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాను.

ఉత్తరాంధ్రలో రెల్లి కులస్తులు ఐదారు జిల్లాలలో ఎక్కువగా ఉంటారు. వారికి న్యాయం జరిగే విధంగా చూడాలి. 2011 తరవాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021లో జరగాల్సిన జనగణన కొవిడ్ వలన చేయలేదు. కొత్తగా వచ్చిన సెన్సస్ ప్రకారం జిల్లాల ప్రాతిపదికన తీసుకుని ప్రపోర్షనేట్‌గా ఈ కార్యక్రమం చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందనే ఆలోచన ఉంది. అది ముఖ్యమైన మౌలిక మార్పు. అలాగే, ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్లు కల్పించే విధంగా రాజ్యాంగపరంగా ఏదైనా చేయగలుగుతామా అనేది ఆలోచించి ఒక కమిటీ వేసి అటువంటి చర్య తీసుకోవడానికి ప్రయత్నం చేయాలని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పాశిం సునీల్‌కుమార్ (SRI PASIM SUNILKUMAR) (గూడూరు): అధ్యక్షా, ఒక మంచి సబ్జెక్టుపై మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు మీకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దళిత బాంధవుడు, దేవుడు డా.బి.ఆర్.అంబేడ్కర్‌గారి దయ వలన మేము అసెంబ్లీకి వచ్చాం. గతంలోనే తెలుగుదేశం పార్టీ 1998లో జస్టిస్ రామచంద్రరావు కమిషన్ సిఫార్సు మేరకు ఎస్సీలలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ బిల్లును 01.04.2000న ప్రవేశపెట్టి అసెంబ్లీలో ఆమోదించి జీవో నం.68 జారీ చేసింది. కానీ, దానిమీద సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు దాని మీద చట్టం చేసే అధికారం పార్లమెంట్ తప్ప ఎవరికీ ఉండదని చెప్పిన అంశం గుర్తు చేస్తున్నాను.

2024లో ఎన్నికల ప్రచార నిమిత్తం తెలంగాణాలో మోదీగారు కచ్చితంగా ఎన్డీయే ప్రభుత్వం గెలిస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పారు. దానిని ఆధారంగా చేసుకుని మన నాయకుడు నారా చంద్రబాబునాయుడుగారు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌గారు ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తరవాత వర్గీకరణ చేసి అందరికీ సమన్యాయం చేస్తామని చెప్పారు. దానికి అనుకూలంగా ఈనాడు మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి బిల్లును ఆమోదించారు. దళితులుగా మేము గర్వంగా చెబుతున్నాము,

చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని ధైర్యంగా చెబుతున్నాము. అలాగే దళితులను దేవాలయాల కమిటీలలో మెంబర్లుగా, చైర్మన్‌లుగా చేసింది తెలుగుదేశం పార్టీ అని ధైర్యంగా చెబుతున్నాను. అలాగే అంబేడ్కర్‌గారి తరవాత దళితులకు ఎవరైనా సహాయం చేశారా అంటే కచ్చితంగా చంద్రబాబునాయుడుగారి పేరు చెప్పక తప్పదు. ఎందుకంటే భూమి కొనుగోలు పథకాన్ని ఏర్పాటు చేసింది నారా చంద్రబాబునాయుడుగారు. అలాగే అంబేడ్కర్ విదేశీ విద్య అని చంద్రబాబుగారు ప్రవేశపెడితే జగన్మోహన్‌రెడ్డి ఆ పేరును తొలగించి జగన్మోహన్‌రెడ్డి విదేశీ విద్య అని పేరు పెట్టి ఒక్క విద్యార్థిని కూడా విదేశాలలో చదివించిన పాపాన పోలేదు. అలాగే సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీలకు చేయాలనుకునేవారికి ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది మన ముఖ్యమంత్రిగారని మీకు తెలియజేస్తున్నాను.

అలాగే దళితులను కారు ఓనర్లను, ట్రాక్టరు ఓనర్లును చేసింది చంద్రబాబునాయుడుగారు. అలాగే దళిత తేజం అనే కార్యక్రమాలు పెట్టి కులాలకు, మతాలకు అతీతంగా ఏ కులం ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా సరే కచ్చితంగా జనాలలోకి వెళ్లి దళితవాడలలో పడుకుని అక్కడ మౌలికసదుపాయాలు ఏం కావాలో ఏర్పాటుచేయమని చెప్పింది మన నాయకుడు నారా చంద్రబాబునాయుడుగారు. ఈరోజు చంద్రబాబునాయుడుగారు లేకపోతే దళితులు చాలా వెనుక బడిపోయేవారని ధైర్యంగా చెబుతున్నాను. మాదిగలు, మాలలు ఒక తల్లి బిడ్డలం. మాకు ఎలాంటి వివక్ష లేదు. గతంలో కూడా అందరం కూర్చొని మాట్లాడుకునేవాళ్లం. అయితే మాలో కొద్దిగా వెనుకబడిన వారికి సహాయం చేయాల్సిన అవసరముంది. ఎవరెన్ని ఉద్యమాలు చేసినా, సాహసాలు చేసినా ఇవ్వాలనే మనసు మా నాయకుడు చంద్రబాబునాయుడుగారికి ఉంది కాబట్టి ఈరోజు వర్గీకరణ సాధ్యమైంది. వర్గీకరణ విషయంలో చరిత్రలో గుర్తుంచుకోవాల్సింది నారా చంద్రబాబునాయుడుగారిని తప్ప మరెవరినీ కాదని తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఈరోజు దళితులమైన మేము అసెంబ్లీలో కూర్చొని ధైర్యంగా మాట్లాడుతున్నామంటే అది చంద్రబాబునాయుడుగారి భిక్ష.

ఆనాడు నందమూరి తారక రామారావుగారు చదువుకున్న దళితులకు శాసనసభ్యులుగా అవకాశం ఇచ్చారు. ఈరోజు మా నాయకుడు చంద్రబాబునాయుడుగారు చదువుకున్న దళితులను ఎంపిక చేసి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా అవకాశం ఇచ్చారు. తెలుగుదేశం పార్టీలో కూడా అందరితోపాటు దళితులకు ప్రధానమైన పదవులు ఇచ్చింది చంద్రబాబునాయుడుగారని తెలియజేస్తున్నాను. మనకు ఏం చేయాలి అనేది ఆయనకు తెలుసు. అంతేకానీ మనమేదో ఊహించుకుని ఏవేవో మాట్లాడితే ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. ఆరోజు మనందరికీ తెలిసే బాలయోగిగారిని స్పీకర్‌ను చేశారు. ప్రతిభా భారతిగారిని స్పీకర్‌ని చేశారు. అలాగే కె.ఆర్.నారాయణన్‌గారిని రాష్ట్రపతిని చేసిన ఘనత నారా చంద్రబాబునాయుడుగారిదే అని తెలియజేస్తున్నాను.

వాళ్ళందరూ లేనిపోని అపోహలతో ఉన్నారు. మొన్న ప్రతిభా భారతి గారి కుమార్తెను ఎమ్మెల్సీని చేసింది చంద్రబాబు నాయుడు గారని దళితులకు గుర్తు చేస్తున్నాను. మనలో ఉన్న వైషమ్యాలను తొలగించుకొని మనకి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఏమేమి ప్రయోజనాలను పొందామో ఆ ప్రయోజనాల గురించి మన తర్వాత జనరేషన్స్‌కు చెప్పాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. అంతేకాకుండా మనకు మనమే వేరే మాటలు మాట్లాడితే ఇబ్బంది వస్తుందని తెలియజేస్తున్నాను. ఇవాళ దళితులం ధైర్యంగా వచ్చి శాసనసభలో మాట్లాడుతున్నామంటే అది తెలుగుదేశంపార్టీ ఘనత అని తెలియజేస్తున్నాను. కాబట్టి ఖచ్చితంగా 2026లో జనాభా ప్రాతిపదిక మీద, జిల్లాల ప్రాతిపదిక మీద వర్గీకరణ చేయాలని కోరుకుంటూ ఈ ప్రతిపాదనకు పూర్తిగా మద్దతును తెలియజేస్తున్నాం.

శ్రీమతి తంగిరాల సౌమ్య (SMT.TANGIRALA SOWMYA): అధ్యక్షా, ఈ భూమి మీద పుట్టిన మనిషికి చేయని తప్పుకు శిక్ష ఏదైనా ఉందంటే అది పేదరికం. అటువంటి పేదరికం తరతరాలుగా వారసత్వ సంపదగా, అసమానత, అస్పృశ్యత వారసత్వ సంపదగా వస్తున్న మా దళిత జాతి, ఈ రోజు ఈ చట్ట సభలో ప్రవేశించినా, వివిధ రంగాల్లో స్థిరపడినా, దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్నా, దానికి ప్రధాన కారణం రిజర్వేషన్ అనే ప్రక్రియను అమల్లోకి తెచ్చిన మా దళితుల ఆరాధ్య దైవం డా.బి.ఆర్.అంబేడ్కర్ గారు. వారికి ఈ సభ ద్వారా మా దళిత జాతి మొత్తం పాదాభివందనం చేస్తుంది. రిజర్వేషన్ ద్వారా వచ్చే ఫలాలు దళితజాతిలో అందరూ సమానంగా అనుభవించాలని, ఉప-కులాలన్నింటికీ సమన్యాయం జరగాలని, కొద్ది సేపట్లో సబ్ కేటగిరైజేషన్ బిల్లుకు ఆమోదం తెలపబోతున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, గౌరవ డెప్యూటీ ముఖ్యమంత్రిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. బీసీ రిజర్వేషన్ మాదిరిగానే ఎస్సీ రిజర్వేషన్ విషయంలో కూడా వర్గీకరణ జరగాలని దళితుల్లో ఉన్న అన్ని ఉప-కులాలకు న్యాయం జరగాలని ఎంతో మంది పోరాటం చేశారు.

గత 30 సంవత్సరాలుగా నిరంతరం పోరాటం చేసున్న పోరాటయోధుడు మందకృష్ణ మాదిగ గారికి ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గతంలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపి, ఆ వర్గీకరణ ద్వారా 22వేల మంది ఉద్యోగాలు పొంది, గతంలో జరిగిన వర్గీకరణ ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్లు పొంది ఇవాళ ఉన్నత స్థానంలో ఉన్నారు. దానికి ప్రధాన కారణం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని ప్రత్యేకంగా ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా గారి ఏకసభ్య కమిషన్ ద్వారా 2011 సెన్సస్ ప్రకారం రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని దళిత జనాభా నిష్పత్తి ప్రకారం, రిజర్వేషన్ కేటగరైజేషన్ చేస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతున్న నారా చంద్రబాబు నాయుడు గారికి మరొక్కసారి దళితులందరి తరపున ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇటువంటి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంటున్న ఈ సభలో

నన్ను కూడా భాగస్వామిని చేసిన గౌరవ చంద్రబాబు నాయుడు గారికి, లోకేశ్ గారికి, పవన్ కళ్యాణ్ గారికి ధన్యవాదాలను తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కొణిదల పవన్‌కళ్యాణ్ (SRI KONIDALA PAWANKALYAN): అధ్యక్షా, షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై మాట్లాడే అవకాశం ఇచ్చిన గౌరవ సభాపతి గారికి, గౌరవ ముఖ్యమంత్రి గారికి నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. కులాల కొట్లాటలో వెనుకబడిన కులాలు, అత్యంత వెనుకబడ్డ కులాలు, దేవాలయాల్లో అడుగు పెట్టనివ్వని పరిస్థితుల నుంచి వాళ్ళందరి జీవితాలు బాగుండాలనే ఉద్దేశంతో జాతిపిత మహాత్మాగాంధీ గారికి, జనసేన పార్టీకి స్ఫూర్తిప్రదాత అయిన శ్రీ నారాయణ గురు గారికి, రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌గారికి హృదయపూర్వక నమస్కారాలను తెలియజేసుకుంటూ నేను జనసేన పార్టీ అభిప్రాయాన్ని తెలియజేస్తాను.

గత రెండు దశాబ్దాలుగా 2004 నుంచి చాలా మంది దళిత మేధావులతో, దళిత కార్యకర్తలతో అటు మాల, మాదిగ ఉపకులాల మేధావులతో చర్చల్లో పాల్గొన్నాను. వారు నన్ను మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. అలాగే బహుజన సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడనైనాను, ప్రత్యేకించి వర్గీకరణ గురించి అనేకసార్లు మాట్లాడాను. నాకు తెలిసిన అనేక మంది మేధావుల్లో ఒకరు, చాలా కీలకమైన వ్యక్తి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీ నిమ్మలదిన్నె సుధాకర్‌గారు. అలాగే మాల మాదిగల ఐక్యత కోసం, కలిసి ఉండాలి కానీ వర్గీకరణ జరగాలని కోరుకునే కళాకారుడు కవి మాస్టార్జీగారు. అంటే ఎలాంటి వ్యక్తులను నేను కలుసుకున్నానంటే ఆయన మాదిగ కులస్తులై ఉండి కూడా ఆంధ్రాకు చెందిన మాల కులం అమ్మాయిని పెళ్ళి చేసుకొని, మాల మాదిగలు ఐక్యంగా ఉండాలి, కానీ వర్గీకరణ జరగాలని ఇలాంటి ఎన్నో అర్గ్యుమెంట్స్, ఎన్నో రకాల అభిప్రాయాలను తెలుసుకొని ఆలోచించి నిర్ణయం తీసుకున్నాం. ప్రత్యేకించి రిజర్వేషన్లపై ఆ టైమ్‌లో చాలా డిస్కషన్స్ జరిగేవి. వర్గీకరణ, క్రీమీలేయర్ గురించి, గుర్తింపులేని బేడ, బుడగ జంగాలు, రెల్లి కులస్తుల గురించి అనేకసార్లు విస్తృతంగా చర్చలు చేశాం.

ఉదాహరణకు దళితుల్లో ఎలాంటి మేధావులను కలుసుకున్నానంటే, నిమ్మలదిన్నె సుధాకర్ గారు స్వతహాగా మాల కులస్తులైనా కూడా దళితుల కంటే వెనుకబడిన యానాది కులం గురించి పరిశోధన చేసి, వారి కొరకు నిలబడి ఆ వాదాన్ని చాలా ముందుకు తీసుకుపోయిన వ్యక్తి. అలా ఎంతోమంది ఉన్నతంగా ఆలోచించే దళిత మేధావులతో కలిసి నడిచినవాడ్ని. ఈరోజు వర్గీకరణ అంశం ఈ స్థాయికి వచ్చిందంటే దానికి కారణం ఒకటి మంద కృష్ణ మాదిగ గారైతే, దానిని ముందుకు తీసుకుపోయిన వ్యక్తి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

మేము హైదరాబాద్ రోడ్ల మీద పర్యటిస్తున్నప్పుడు మాదిగ కులానికి వన్నె తెచ్చిన ఆత్మగౌరవం నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి వన్నె తెచ్చిన మంద కృష్ణమాదిగ గారికి మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలను

తెలియజేస్తున్నాను. ఎందుకంటే చిన్నబుచ్చుకునేతనం నుంచి, సర్‌నేమ్స్‌ను అన్ని కులాలు పెట్టుకుంటాయి. కానీ మాదిగ కులం పెట్టుకోవాలంటే ఇబ్బందిపడే పరిస్థితుల్లో నేను మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యంతో ఆత్మగౌరవంతో ఆ నినాదాన్ని ముందుకు తీసుకువెళ్ళిన మంద కృష్ణమాదిగ గారిని శాసనసభ సాక్షిగా మనస్ఫూర్తిగా వారిని అభినందిస్తున్నాను. అలాంటి ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించి, సమైక్య రాష్ట్రంలో వర్గీకరణపై తీర్మానం చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారికి దక్కుతుంది.

ఈరోజు దేశ స్థాయిలో దీన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతున్నామంటే ప్రధానమంత్రిగారి దృష్టిలో ఈ అంశం పడిందంటే దానికి నాంది ఆంధ్రప్రదేశ్ నుంచే పడింది. నేను దళిత మేధావులతో మాట్లాడుతున్నప్పుడు వర్గీకరణ వల్ల మాల కులస్తులకు అన్యాయం జరుగుతుందని రెండు వర్గాల వారు కూర్చొని మాట్లాడుకునేవారు. ఆ సమయంలో నాకు వినిపించిన ఆర్గ్యుమెంట్స్ ఏమంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాలలు, తెలంగాణాలో మాదిగలు ఎక్కువగా ఉన్నారు. ఒక్కొక్కచోట ఒక్కొక్క కులం సబ్‌క్యాస్ట్ ఎక్కువ బెనిఫిట్ తీసుకుంటుంది. ఆ ఫలాలను మిగతా వాళ్ళకు కూడా చెందాలన్నదే ఈ వర్గీకరణ ఉద్దేశం. ఉదాహరణకు రాజస్థాన్‌లో మేఘ్‌వాల్స్, ఝాటోస్ రిజర్వేషన్లను ఎక్కువ తీసుకుంటారు. భైరవ కులస్తులు, కోలీస్ తక్కువ శాతం తీసుకుంటారు. పంజాబ్‌లో మాదిగ కులస్తులతో సమానంగా భావించే చమార్ కులం వారు ఎక్కువ బెనిఫిట్‌ను తీసుకుంటారు. కానీ ఎక్కువగా ప్రయోజనాన్ని పొందేంది వాల్మీకులు, మజాబీ సిక్కులు, ఇలా విభిన్నంగా ఒక్కొక్క చోట ఉన్న వారి ఆధిపత్యాన్ని బట్టి ఎక్కువ శాతం తీసుకోవడం జరుగుతోంది. వీటన్నింటినీ గుర్తించిన శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లును జనసేన పార్టీ తరఫున మనస్ఫూర్తిగా మేమందరం సమర్థిస్తున్నాం.

మ.2.30

అధ్యక్షా, 100 నుండి 10,000 లోపు జనాభా ఉన్న మాల, మాదిగ వంటి 59 ఉప కులాలు ఉన్నాయి, వాటి వర్గీకరణ ఎలా చేస్తారని ప్రత్యేకంగా నేను రాజీవ్ రంజన్ మిశ్రాగారిని అడిగాను. అప్పుడు వారు 10,000 లోపు 46 కులాలలో కొన్ని కులాలలో 30, 40 మంది జనాభా మాత్రమే ఉన్నారని వారు తెలియచేశారు. Scientifically empirical dataని నాలుగు నెలల వ్యవధిలో బాధ్యత తీసుకొని మంత్రివర్గంతో ఒక కమిటీని ఏర్పాటుచేసి, శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రాగారి ఆధ్వర్యంలో వన్ మ్యాన్ కమిషన్ నవంబరులో మొదలై మార్చి వరకు నాలుగు నెలల వ్యవధిలో డేటాని సైంటిఫిక్‌గా ఎనలైజ్ చేసి విద్యా, సామాజిక, రాజకీయ, ఆర్థిక, అంతర్గత వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకొని మూడు విధాలుగా విభజించిన తీరు అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని నేను భావిస్తున్నాను.

మంద కృష్ణ గారు వర్గీకరణ ఉద్యమానికి ఆద్యులు. వర్గీకరణ సాధన పోరాట సమితి యోధుడు. నారా చంద్రబాబు నాయుడు గారు సైబరాబాద్ సృష్టికర్తే కాదు, వర్గీకరణ రూపకర్త కూడా. శ్రీ నరేంద్ర మోదీ నయా భారత్ నిర్మాతే కాదు, వర్గీకరణ ఫల ప్రదాత కూడా. మనస్ఫూర్తిగా వర్గీకరణ బిల్లును ముందుకు తీసుకెళ్లి ఈ సభలో ప్రవేశపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారికి మంత్రివర్గ సభ్యులందరికీ, గౌరవ సభాపతిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, ఒక చిన్న అంశం ఇంక్లూడ్ చేయగలిగితే చాలా సంతోషం. రాష్ట్రంలో ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం లక్షా ముప్పైవేల పైచిలుకు రెల్లి కులస్థులు ఉన్నారు. ప్రత్యేకించి వారు కొన్ని జిల్లాల్లోనే ఉన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకున్నా, మరోలా అయినా సరే వారికి తగు న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాను. బేడ, బుడగ జంగాల వారికి ఏ కులమో వారికే తెలియడం లేదు. ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. బేడ, బుడగ జంగాల వారు ఏ కేటగిరీకి చెందినవారో తెలియచేయాలని కోరుతున్నాను. రెల్లి కులస్థులకు వర్గీకరణ బిల్లులో న్యాయం జరిగేలా చూడాలని, వారిని కూడా గుర్తించాలని కోరుతున్నాను. వీరిని గుర్తించే విషయంలో మంత్రివర్గ బృందం, సహచర సభ్యులు బలమైన ఆలోచనా విధానంతో ముందుకు తీసుకువెళ్లాలని కోరుతున్నాను.

శ్రీ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి (DR.DOLASREE BALA VEERANJANEYA SWAMY): అధ్యక్షా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపడతామని ఎన్నికల ముందు ప్రజలకు తెలియచేసిన ప్రకారమే ముందుకు వెళ్లింది. ముఖ్యమంత్రిగారిని నేను 16,17 సంవత్సరాలుగా దగ్గరగా చూశాను. చంద్రబాబునాయుడు గారు సమాజంలో ప్రతి ఒక్కరూ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. గతంలో మొదటిసారి వర్గీకరణ చేసింది మన ప్రియతమ నాయకులు చంద్రబాబునాయుడు గారే. తరవాత న్యాయపరమైన సమస్యలు, అనేక అవరోధాలు వచ్చాయి.

అధ్యక్షా, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం పాటుపడింది తెలుగుదేశం పార్టీ పెట్టినప్పటినుండి అన్న నందమూరి తారక రామారావు గారు, తరవాత చంద్రబాబునాయుడు గారే. అది మా పార్టీ ఎజెండాలోనే ఉన్నది. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం, పక్కా ఇళ్ల నిర్మాణం కూడా ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కొరకు తీసుకువచ్చినవే. గురుకుల పాఠశాల వ్యవస్థ కూడ అన్న ఎన్టీఆర్ గారు తెచ్చినదే. రాష్ట్రంలో 190 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 50 సంవత్సరాల తరవాత కూడా రెండు గ్లాసుల విధానం, అస్పృశ్యత విధానాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను చంద్రబాబునాయుడుగారు ఏర్పాటు చేయగా, ఆ కమిషన్ అన్నింటినీ పరిశీలించి 42 సిఫారసులను చేసింది. ఆ సిఫారసులను అమలుచేసేందుకు చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం అప్పట్లో 23 జీవోలు, 2 మెమోలతో ఆచరణకు అవకాశం కల్పించింది. అప్పటి చర్యల ఫలితంగా

ఈనాడు జిల్లాల్లో విజిలెన్స్ మానిటరింగ్ సెల్స్, సిటిజన్స్ డే, కూల్చివేసిన ఎస్సీ ఎస్టీల ఇళ్లకు అదనపు బెనిఫిట్ ఇచ్చే విధంగా పలు సంస్కరణలు వచ్చాయి.

అధ్యక్షా, 2014-19లో బాబు జగజ్జీవన్‌రాం గారి జయంతి, అంబేడ్కర్ గారి జయంతులను అధికారికంగా నిర్వహించాలనే ఉత్తర్వులను మన ప్రియతమ నాయకులు శ్రీ చంద్రబాబునాయుడు గారు ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అంబేడ్కర్ గారి 125వ జయంతి సందర్భంగా రాష్ట్ర రాజధానిలో 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని శాఖమూరులో భూమిని కేటయించి పనులు మొదలుపెడితే, గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి గారు ఎక్కడ చంద్రబాబునాయుడు గారికి మంచిపేరు వస్తుందో అని ఆ ప్రాజెక్టును అర్థాంతరంగా ఆపివేసి అక్కడ నుండి తరలించారు. అంటే బడుగు, బలహీనవర్గాల మేలుకు ఆలోచన, ఆచరణకు ఆద్యులు చంద్రబాబునాయుడు గారు అని నేను సగర్వంగా మనవిచేస్తున్నాను. పదోన్నతులలో కూడ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల అవకాశాన్ని చంద్రబాబునాయుడు గారు కల్పించారు.

అధ్యక్షా, ఎస్సీల ఇంటి నిర్మాణానికి అదనంగా ₹50,000లు, ఎస్టీలకు అదనంగా ₹75,000 ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహకారాన్ని తెలుగుదేశం పార్టీ గతంలో అందించింది. అయితే, గత జగన్మోహన్‌రెడ్డి గారి ప్రభుత్వం ఆ వర్గాలను చిన్నచూపు చూసింది. 2014-19 మధ్య సబ్‌ప్లాన్ నిధులు 90 శాతం ఖర్చు పెట్టి, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, త్రాగునీటికి ప్రాధాన్యతనిచ్చాం. గత ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను పక్కదోవ పట్టించింది. ఎక్కడా అభివృద్ధి కానరాలేదు. ఈనాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న ప్రతి రోడ్డు గతంలో మన ప్రభుత్వం వేసిందనే విషయం సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఇంతకు ముందు సభ్యులు చెప్పినట్లు, శ్రీ జీఎంసీ బాలయోగి గారిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతి గారిని శాసనసభ స్పీకర్‌గా, కాకి మాధవరావు గారికి చీఫ్ సెక్రటరీగా అవకాశం కల్పించినది కూడా మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆధ్వర్యంలో జరిగినవే. ఎన్టీ రామారావు గారు నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా ఉన్నప్పుడు డా. బీఆర్ అంబేడ్కర్‌గారికి భారతరత్న వచ్చే విధంగా కృషి చేయడంలో తెలుగుదేశం పార్టీ పాత్ర ఉందనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి' పథకం ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చి 250 విదేశీ విశ్వవిద్యాలయాలకు విద్యార్థులను పంపిస్తే, గత ప్రభుత్వంలో అంబేడ్కర్‌గారి పేరు తీసేసి గత ముఖ్యమంత్రి ఆయన పేరు పెట్టుకొని కొద్ది మంది విద్యార్థులకే ఆ పథకాన్ని రెస్ట్రిక్ట్ చేశారు. తిరిగి మన ప్రభుత్వం వచ్చిన తరవాత ఆ పథకం పేరును డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంగా మార్చుకున్నామని నేను సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, మన ప్రభుత్వం వచ్చిన తరవాత సంక్షేమ వసతిగృహాల రిపేర్ల నిమిత్తం ₹140కోట్లు మంజూరు చేసి విద్యార్థులకు సౌకర్యవంతంగా తయారుచేస్తున్నాం. వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులున్న అనాథలు, సెమీ ఆర్ఫాన్స్ కోసం జిల్లాకు ఒకటి, రెండు హాస్టల్స్ ఏర్పాటుచేసి భోజనం

వసతి కల్పించి, స్వేచ్ఛగా పిల్లలను ఆటపాటలకే పరిమితం చేసేలా మన ప్రభుత్వం 'అనురాగం' అనే పథకాన్ని తీసుకువచ్చిందని తెలియచేస్తున్నాను. ఇన్సూరెన్స్‌లో కవర్ కాని పిల్లలకు, ఎమర్జెన్సీలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే విధంగా 'సాంత్వన' అనే పథకాన్ని త్వరలో ప్రవేశపెట్టబోతున్నాం. ₹100కోట్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సహకారాలతో కొత్త హాస్టల్స్‌కి ఈ నెలలోనే గౌరవ ముఖ్యమంత్రిగారు శంకుస్థాపన చేయబోతున్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం పట్ల మన ప్రభుత్వానికి గల చిత్తశుద్ధి ఏవిధంగా ఉందో తెలియచేస్తున్నాను.

మ.2.40

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా కార్లను అందించాం. డ్రైవింగ్ వచ్చిన ఎస్సీ యువత ఒకరి దగ్గర డ్రైవర్లుగా పనిచేయకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ట్యాక్సీలకు యజమానులుగా ఉండాలనే భావనతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ఎస్సీ యువతకు ఇన్నోవా కార్లు అందించాం. అంతేకాకుండా భూమి కొనుగోలు పథకం క్రింద అర్హులైన ఎస్సీలకు భూములిచ్చిన కారణంగా చాలా మంది భూయజమానులయ్యారు. అదేవిధంగా లిడ్‌క్యాప్‌ను గత ప్రభుత్వాలు విస్మరించాయి. కానీ చంద్రబాబు నాయుడుగారు ఆనాడు లిడ్‌క్యాప్‌కు చేయూతనిచ్చి లెదర్ ఇండస్ట్రీని ప్రోత్సహించారు. గత ఐదు సంవత్సరాల్లో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం అయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కార్పొరేషన్‌కు ఊతం ఇచ్చాం. బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్‌కు ₹341కోట్లు నిధులు కేటాయించడమే కాకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దాదాపు 20,000మందికి ₹341కోట్లతో సబ్సిడీ కింద లబ్ధి చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే నెలలో అందుకు సంబంధించిన నిర్ణయాలు కార్యరూపం దాలుస్తాయి. లిడ్‌క్యాప్ ద్వారా లెదర్ షూ మేకింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటు విషయంలో టెండర్లు పిలిచే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించాం. అదే విధంగా డప్పు, చర్మకారులకు 2014-2019మధ్య కాలంలో పెన్షన్లు ఇచ్చామనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

ముఖ్యమంత్రిగారు విజన్-2047లో భాగంగా పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) మోడల్‌లో పేదలందరూ ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలని, అదే విధంగా సాధికారత సాధించాలనే లక్ష్యంతో పీ4 విధానంలో ముందుకు వెళ్తున్నాం. దీనిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవాళ్లే లబ్ధిపొందే అవకాశాలు ఉన్నాయి.

అధ్యక్షా, ఆనాడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన తరవాత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎస్సీ వర్గీకరణ కోసం రాజీవ్ రంజన్ మిశ్రాగారితో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఏకసభ్య కమిషన్ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వానికి ఐదు సిఫారసులతో నివేదిక సమర్పించింది. నివేదికను గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌కు పంపి, పరిశీలించిన పిదప నివేదికను ఆమోదించి ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తరవాత ప్రభుత్వం కూడా కేబినెట్ ముందుకు ఉంచాం. నివేదికతోబాటు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తీసుకున్న నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదం తెలిపిన

తరవాత ఈరోజు సభ ముందు ప్రవేశపెడుతున్నాం. సిఫారసుల్లో ప్రధానంగా ఐదు ఉన్నాయి. అందులో మొదటిది ఎస్సీ ఉపకులాలను వర్గీకరణ చేయాలనేది ప్రతిపాదించారు. రెండవ సిఫారసు ప్రకారం 59 కులాలను మూడు గ్రూపులుగా విభజిస్తూ మొదటి గ్రూప్‌లో రెల్లి, అనుబంధ ఉపకులాలను, రెండవ గ్రూప్‌లో మాదిగ, అనుబంధ ఉపకులాలను, మూడవ గ్రూప్‌లో మాల, అనుబంధ ఉపకులాలను విభజిస్తూ సిఫారసు చేయడం జరిగింది. మూడవ సిఫారసులో మొత్తం ఎస్సీ జనాభాలో మూడు వర్గాల జనాభాతోబాటు వారి శాతాన్ని బట్టి వాళ్లకు రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదన, వారి శాతాన్ని తెలియజేశారు. దీని ప్రకారం మొదటి గ్రూప్‌కు 1శాతం, రెండవ గ్రూప్‌లో 6.50శాతం, మూడవ గ్రూప్‌కు 7.50శాతం రిజర్వేషన్లు కల్పించే నిమిత్తం ప్రతిపాదన చేశారు. నాలుగవ సిఫారసు ప్రకారం ఎస్సీల కొరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న 200రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించారు. అందులో మొదటి వంద రోస్టర్ పాయింట్లలో మొదటి గ్రూప్‌కు 1రోస్టర్ పాయింట్, రెండవ గ్రూప్‌కు 6 రోస్టర్ పాయింట్లను, మూడవ గ్రూప్‌కు 8రోస్టర్ పాయింట్లను కేటాయించడంతోబాటు రెండవ వంద రోస్టర్ పాయింట్లలో మొదటి గ్రూప్‌కు 1 రోస్టర్ పాయింట్, రెండవ గ్రూప్‌కు 7రోస్టర్ పాయింట్లను, మూడవ గ్రూప్‌కు 7 రోస్టర్ పాయింట్ల లెక్కన రిజర్వేషన్ రోస్టర్‌ను ప్రతిపాదించారు. అదే విధంగా ఐదవ సిఫారసులో రిజర్వేషన్ల అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి మార్గదర్శకాలను కూడా రూపొందించారు. దీనితోబాటు గౌరవ సభ్యులు ఇంతవరకు మాట్లాడిన దాంట్లో ఎక్కువ మంది ఒకే మాట చెప్పారు. జిల్లాలవారీగా రిజర్వేషన్ చేస్తే ప్రయోజనం చేకూరుతుందని మాట్లాడిన వారిలో ఎక్కువ మంది ప్రతిపాదించారు. ఉపముఖ్యమంత్రిగారు కూడా రెల్లి కులస్తులకు వారు నివాసం ఉంటున్న జిల్లా పరిధితోబాటు మిగిలిన ప్రాంతాల్లోకూడా రిజర్వేషన్లు కల్పిస్తే ఎక్కువ లబ్ధిచేకూర్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు సూచించారు. అదే విషయాన్ని ఐదవ సిఫారసులో పొందుపర్చబడింది. ''జిల్లాలవారీగా విభజన చేయాలనే ప్రతిపాదనను చాలా మంది ప్రతిపాదించారు. ప్రస్తుతం జిల్లాలవారీగా రెకమెండేషన్ చేయడంలేదు. భవిష్యతులో జనాభా లెక్కింపు జరిగిన తరవాత జనాభా ప్రాతిపదికన జిల్లాలవారీగా సిఫారసులకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేయవచ్చును'' అని వారు ఐదవ సిఫారసు కింద సూచించారు. ఎక్కువ మంది సభ్యులు అభిప్రాయపడ్డారు కాబట్టి ఒకసారి సభలోచదివి వినిపిస్తాను.

''They have been requested to fix the percentage of reservation to the sub-classified groups by taking District as a Unit. There are 26 Districts in the State at present and Commission would not like to make any recommendation in this matter. Government may take a view on this at an appropriate time after conducting next census based upon rational principles, quantifiable data and *inter se* backwardness''.

ముఖ్యంగా మనం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాన్ని కూడా ఏకసభ్య కమిషన్ దృష్టిలో పెట్టాం. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా గతంలో ఉన్న 13 జిల్లాలు 26 జిల్లాలకు పెరిగాయి కాబట్టి ఎస్సీ వర్గీకరణ విషయంలో క్లారిటీ లేని కారణంగా జనాభా లెక్కింపు తదుపరి వర్గీకరణ చేయమని ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

అన్ని విషయాలను వివరంగా తమరిద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తూ, తీర్మానాన్ని ఆమోదించవలసిందిగా మీద్వారా గౌరవ సభ్యులను కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ (MR.SPEAKER)ః ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (SRI NARA CHANDRABABU NAIDU)ః అధ్యక్షా, ఈరోజు ఎస్సీ కేటగిరైజేషన్ అంశం మీద చాలా మంది సభ్యులు మాట్లాడారు. అయితే ఈ సందర్భంగా మొట్టమొదటిసారిగా నేను బి.ఆర్.అంబేడ్కర్‌గారిని, జగ్జీవన్‌రామ్‌గారిని, మహాత్మా జ్యోతీరావ్ పులే గారిని, నందమూరి తారకరామారావుగారిని ఒకసారి స్మరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించబోతున్నామని చెప్పబోతున్నాను. ఇప్పుడే జనసేన అధినేత, మిత్రులు పవన్‌కళ్యాణ్‌గారు కూడా చాలా స్పష్టంగా ఏ కారణాల వల్ల మేము ఈ కేటగరైజేషన్ చేస్తున్నామనే విషయాలను వారు చెప్పారు. అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీగారు కూడా సోషల్ జస్టిస్‌లో భాగంగా ఎస్సీలకు కూడా కేటగరైజేషన్ చేయవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అయితే ఈ సందర్భంగా ఒకసారి అందరం ఆలోచించాలి.

అధ్యక్షా, సమాజంలో పేదరికానికి అనేక కారణాలున్నాయి. చరిత్రలో మనం చూసినప్పుడు కొంత మంది ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారు. చరిత్ర ఒకసారి విశ్లేషించినప్పుడు మూడు కారణాలు ఆయా కులాలను ఎక్కడికక్కడ ఆర్థికంగా వెనుక్కు లాగేసే పరిస్థితికి వస్తుంది. మనకు స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్నాం. 2047కు మనకు స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్నాం. ఇంకా కూడా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అసమానతలపైన పోరాడే పరిస్థితి వస్తుంది. చరిత్రలో నేను కూడా 40, 50 సంవత్సరాలు అందులో భాగస్వామిని అయ్యాను. ఇటీవలి కాలంలో అనేక ఛాలెంజెస్ తరవాత నేను చెప్పేటప్పుడు అవి కూడా చెబుతాను. ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చినప్పుడు చాలా స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఏ వర్గమైనా సరే వెనుకబడి ఉందని భావిస్తే మీరు వర్గీకరణ చేసే అవకాశాలు ఉన్నాయని, అది రాష్ట్రాలకు, కేంద్రానికి వర్తిస్తుందని చాలా స్పష్టంగా తీర్పు ఇచ్చింది. దానిపైన One Man Commissionను ఏర్పాటు చేయడం, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను నియమించడం జరిగింది. వాళ్లందరూ ఆలోచించి నిర్ణయించిన తరవాత మొన్నే కేబినెట్‌లో నిర్ణయం చేశాం. ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని చాలా స్పష్టంగా ప్రజలకు చెప్పాం. చెప్పిన మాట ప్రకారం నిలబెట్టుకుంటామని స్పష్టంగా తెలియజేస్తున్నాను. ఇప్పుడే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌గారితోబాటు మరి కొంత మంది అడిగారు.

మ.2.50

బుడగజంగాల సమస్య ఎప్పటినుంచో ఉంది. సమైక్యాంధ్రలో కొన్నిరోజులు వారు ఎస్సీల్లో ఉన్నారు. దానిపై ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపించి కేంద్రం ఆమోదిస్తే మళ్లీ మనం వారిని ఎస్సీల్లో 'ఏ'గ్రూపులో చేర్చడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తాం.

అధ్యక్షా, కొన్ని కులాలకు చెందిన వారు కొన్ని జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. మాల సామాజికవర్గం తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు వంటి జిల్లాల్లో ఎక్కువగా ఉంది. మాదిగ సామాజికవర్గం రాయలసీమ ప్రాంతం కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా ఉంది. జనాభా లెక్కల ప్రకారం రెల్లి కులస్తులు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. నేడు రాష్ట్రంలోని 26జిల్లాల్లో జనాభా లెక్కలు సరిగా లేవు. కాబట్టి నేను రికమెండ్ చేయలేకపోతున్నాను. ప్రభుత్వానికి ఆ అధికారముంది. 2026 జనాభా లెక్కల ప్రకారం వచ్చిన డేటా ఆధారంగా జిల్లాలవారీగా వర్గీకరణ చేసుకోవచ్చని చాలామంది చాలా స్పష్టంగా చెప్పారు. జిల్లాలవారీగా వర్గీకరణ చేసే అవకాశముందని ఎన్నికలకు ముందు కూడా మనం చాలా స్పష్టంగా హామీ ఇచ్చాం. ఎస్సీ వర్గీకరణ ఆలస్యం అవుతుందని నేడు మనం చర్చిస్తున్నాం. 2026 జనాభా లెక్కలు వచ్చిన వెంటనే జిల్లాలవారీగా వర్గీకరణ చేయడం కోసం మన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నేను మళ్లీ హామీ ఇస్తున్నాను.

అధ్యక్షా, సామాజికన్యాయానికి కట్టుబడి ఉన్నామని నేడు అన్ని పార్టీలకు చెందిన సభ్యులం చెబుతున్నాం. కొద్ది పార్టీలు తప్ప అన్ని పార్టీలు సామాజికన్యాయం కోసం ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పుడే పవనకళ్యాణ్ గారు కూడా చెప్పారు. మాదిగలకు అన్యాయం జరిగింది, మాదిగల పేరు చెప్పడానికి కూడా చాలామంది ఆలోచిస్తున్నారనే ఉద్దేశంతో కృష్ణమాదిగ ఆనాడు మాదిగ దండోరా అనే సంస్థను స్థాపించి పెద్దఎత్తున ఉద్యమం చేసినపుడు నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. మీరు కూడా ఆనాడు పార్టీలో ఉన్నారు. అన్ని పార్టీలతో సమావేశాలు కూడా నిర్వహించి అనేకసార్లు చర్చించిన తర్వాత వారు చేసే ఉద్యమం సబబుగా ఉందనే ఉద్దేశంతో తేది.10.09.1996నాడు జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించాం. వారు రాష్ట్రమంతా తిరిగి అధ్యయనం చేసి మాల సామాజికవర్గం, మాదిగ సామాజికవర్గం, ఆది ఆంధ్ర, రెల్లి కులస్తులను చూసిన తర్వాత ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కోసం సిఫార్సు చేశారు. తేది.28.05.1997నాడు వారు ఒక నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను బేస్ చేసుకుని మార్చి, 1998లో జాతీయ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ కమిషన్‌కు సమాచారం పంపించాం. వారు కన్సెంట్ ఇవ్వాల్సిన పని లేదు, ప్రభుత్వం కన్సల్ట్ చేయాల్సిన బాధ్యత ఉందని ఆనాడు ఆ నివేదికలో ఉన్న అంశాలను పంపించాం. జూన్, 1999లో ఆర్డినెన్స్ జారీచేశాం. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్, 2000 కూడా తేది.02.05.2000నాడు ప్రవేశపెట్టాం. ఈ దేశంలో కొన్ని సవాళ్లు వస్తూ ఉంటాయి. నవంబరు, 2000లో దీనిని హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు దీనిని అప్‌హెల్డ్ చేస్తూ ఇది కరెక్టుగా ఉందని తీర్పునిచ్చింది. నవంబరు, 2004లో దీనిపై

సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఆనాడు సుప్రీంకోర్టులో వయలేషన్ ఆఫ్ ఆర్టికల్ 341(2) ప్రకారం కేవలం పార్లమెంటుకే అధికారముందని, రెండవది lack of legislative competence, మూడవది, violation of Article 14 అనే ఉద్దేశంతో దీనిని కొట్టేశారు.

తేది.10.12.2004లో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక తీర్మానం కూడా ఆమోదించి మళ్లీ పంపించారు. This House had passed the resolution on 22nd April, 1998 for categorisation of Scheduled Castes as recommended by Justice Sri Ramachandra Raju Commission. In view of the recent Supreme Court Judgment, the House resolves to recommend to the Government of India to take up the matter in the Parliament. కానీ, అప్పట్లో అది చేయలేకపోయారు. ఈ అంశాన్ని మే, 2007లో జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్‌కు రెఫర్ చేశారు. ఈ వర్గాలకు అన్యాయం జరిగిన మాట వాస్తవం కాబట్టి వర్గీకరణ అవసరమని చెబుతూ 2000-2004 మధ్యలో ఈ వర్గీకరణ వల్ల కొంత మంచి జరిగిందని కూడా సమర్థిస్తూ జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ 2008లో నివేదిక ఇచ్చింది.

అధ్యక్షా, ఇటీవల జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వంలో ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు వచ్చిన వెంటనే అన్ని రాష్ట్రాల్లో కదలిక వచ్చింది. తేది.15.11.2024నాడు మనం కూడా ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను నియమించాం. ఆయన తేది.27.11.2024నాడు ఛార్జ్ తీసుకుని 13 జిల్లాల్లో పర్యటించారు. ఆయన శాఖాధిపతులందరితో, శాసనసభ్యులతో చర్చించిన తర్వాత తేది.10.03.20205నాడు కూలంకషంగా ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చారు. ఆయన ఇచ్చిన నివేదిక ప్రకారం ఎస్సీల్లో మొత్తం 59 కులాలున్నాయి. ఈ 59 కులాలను ఆయన అధ్యయనం చేసిన తర్వాత గ్రూపు-1 మోస్ట్ బ్యాక్‌వర్డ్, రెల్లి సబ్‌గ్రూపు 12కులాలు, గ్రూపు-2 బ్యాక్‌వర్డ్, మాదిగ సబ్ గ్రూపు 18 కులాలు, గ్రూపు-3 రిలేటివ్‌లీ లెస్ బ్యాక్‌వర్డ్ అని చెప్పి మాల సబ్‌గ్రూపులో 29 కులాలని నివేదికలో పేర్కొన్నారు. వారిచ్చిన నివేదికలో జనాభా, వెనుకబాటుతనం మొదలైనవన్నీ చూసిన తర్వాత గ్రూప్-1లో 2.25శాతం జనాభాకు 1శాతం, గ్రూపు-2లో 41.56శాతం జనాభాకు 6.5శాతం, గ్రూప్-3లో 53.98శాతం జనాభాకు 7.5శాతం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సు చేసింది. ఇవన్నీ 2011 జనాభా గణాంకాలను బేస్ చేసుకుని ఇచ్చారు. ఇవన్నీ బ్యాలెన్స్ కావాలంటే మొదటి 100కు మాల సామాజికవర్గానికి 7.5శాతం ఉంది కాబట్టి 8శాతం, మాదిగ సామాజికవర్గానికి 6.5శాతం ఉంది కాబట్టి దానిని 6శాతం చేశారు. రెండవ వంద వచ్చినపుడు మాల సామాజికవర్గానికి 7శాతం, మాదిగ సామాజికవర్గానికి కూడా 7శాతం, రెల్లి వర్గానికి ఒక శాతం సిఫార్సుచేశారు.

మ.3.00

అందరికీ క్లారిటీ ఉండాలి. రోస్టర్ పాయింట్ల ప్రకారం వెళ్లాలంటే 6.5 ఇచ్చినపుడు సమస్య వస్తుంది, కనుక వంద పాయింట్లకు 6.5 ఇవ్వలేము. మాల సామాజికవర్గానికి 7.5 ఇవ్వాలనుకున్నప్పుడు అందులో సగం ఇవ్వలేము. రెండింటినీ ఆలోచించి రోస్టర్ పాయింట్లను 200కు

తీసుకుని రోస్టర్‌ను ఎస్టాబ్లిష్ చేశారు. మొదటి వంద పాయింట్లకు ముందు చేశారు, తదుపరి వంద పాయింట్లల్లో బ్యాలెన్స్ చేశారు. ముందు వంద పాయింట్లలో బ్యాలెన్స్ కాదు కనుక రెండవ వందలో అందరికీ బ్యాలెన్స్‌గా పెట్టారు. బ్యాక్‌లాగ్ ఉంటే సంవత్సరం వరకు బ్యాక్‌లాగ్‌గా పెట్టారు, బ్యాక్‌లాగ్ ప్రకారం ఇవ్వడానికి రెకమెండేషన్ ఇచ్చారు.

రిజర్వేషన్స్ ఏవిధంగా వస్తాయో చెబుతాను. మొదటి వంద పోస్టులకు ఎనిమిది పోస్టులు ఎస్సీ మాల సామాజికవర్గానికి, మాదిగ సామాజికవర్గానికి ఆరు, రెల్లి సామాజికవర్గానికి ఒక పోస్టు గ్రూప్-I కింద వస్తుంది. మూడు కలిపితే పదిహేను శాతం అవుతుంది. తదుపరి వంద పోస్టులకు పోయినపుడు బ్యాలెన్స్ చేయడానికి మాల సామాజికవర్గానికి ఏడు, మాదిగ సామాజికవర్గానికి ఏడు, రెల్లి సామాజికవర్గానికి ఒక పోస్టు వస్తుంది. ఏడు ప్లస్ ఏడు ప్లస్ ఒకటి మొత్తం పదిహేను అవుతుంది. ఈ రెండింటిని గమనించినపుడు మొత్తం 200 పాయింట్లలో మాల సామాజికవర్గానికి 15, మాదిగ సామాజికవర్గానికి 13, రెల్లి సామాజికవర్గానికి రెండు వస్తాయి. శాతం వారీగా చూసినపుడు సమానం అవుతుంది. ఓవరాల్‌గా బ్యాలెన్స్ అవుతుంది. (రిపోర్టును సభకు చూపిస్తూ)ఇది కమిషన్ ఇచ్చిన రిపోర్ట్. 200 పాయింట్లలో మొదటి వంద పాయింట్లు వచ్చినపుడు మాల సామాజికవర్గానికి ఎక్కువగా వస్తాయి, రెండో వంద పాయింట్లలో బ్యాలెన్స్ అవుతుంది. ఓవరాల్‌గా గమనిస్తే 6.5శాతం, 7.5శాతం, ఒక శాతంగా బ్యాలెన్స్ అవుతుంది.

రిపోర్టును ఆమోదించాలని అందరినీ అభ్యర్థిస్తున్నాను. ఒక విషయం అందరికీ చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. దీనిపై చాలా ఎక్సర్‌సైజులు చేశాం. కమిషన్ ఇచ్చిన వివరాలు గమనిస్తే ఏ వర్గం ఆర్థికంగా ఎలా ఉంది? ఉద్యోగాల పరంగా ఎలా ఉన్నారు? డేటా పెట్టుకుని గ్రూప్ వన్‌లో అనలైజ్ చేసి చూస్తే మాలలు, మాదిగలు, ఆది ఆంధ్ర, రెల్లి కులాలు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలిపారు. గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, జుడీషియల్, టీటీడీని అధ్యయనం చేశారు. మరో పక్క స్థానిక సంస్థలు, జిల్లాపరిషత్తులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు ఎలా ఉన్నాయో అన్నీ కూడా అధ్యయనం చేసి సైంటిఫిక్‌గా అధ్యయనం చేసి అందరి అభ్యర్థనలను తీసుకుని ఫైనల్‌గా దీనిని ఫైనలైజ్ చేశారు. వచ్చే నెల ఏప్రిల్‌లో అంబేద్కర్, జ్యోతిరావు పులే, బాబూ జగ్జీవన్‌రాం ముగ్గురు మహనీయులు జన్మదినాలు జరుపుకుంటాం.

(మీ జన్మదినం కూడా వచ్చే నెలలోనే అని కొందరు సభ్యులు అన్నారు)

మనం నిమిత్తమాత్రులం. గతంలో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేటగరైజేషన్ చేపట్టాం. ముప్పై సంవత్సరాల క్రితం ప్రారంభించి అనేక ఒడిదుడుకులను, ఇబ్బందులను, సవాళ్లను ఎదుర్కొని, సుప్రీంకోర్టులో కొట్టేస్తే మరలా సెవెన్ మెంబర్ బెంచ్‌కు పోయాం. ఒకసారి సుప్రీంకోర్టులో కొట్టేసిన తరవాత మరలా బిగ్గర్ బెంచ్ జెన్యూన్ ఉంటే తప్ప అనుమతించే పరిస్థితులు రావు. అలాంటి బెంచ్

న్యాయసమ్మతమైందని చెబితే మరలా ఈనాడు సభలో నేనే కేటగిరైజేషన్ తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడింది.

ఇది లాంగ్ జర్నీయే కాకుండా సామాజికన్యాయం కోసం నేను ఆనాడు ఏది ఆలోచించానో అది సబబని దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా నిర్ణయించే పరిస్థితి వచ్చింది. ఇది జీవితంలో కొంతమందికి వచ్చే అరుదైన అవకాశం వస్తుంది, ప్రజలు నాకు ఇచ్చిన అవకాశం, నా పూర్వజన్మ సుకృతం కనుక ఈనాడు చేయగలిగాను. కొంతమంది నాయకుల్లో తపన ఉంటుందని ఇప్పుడే మిత్రులు పవన్‌కల్యాణ్‌గారు చెప్పారు. రామారావుగారు 1982లో పార్టీ పెట్టినపుడు మహనీయుల స్ఫూర్తిని తీసుకుని ఎప్పుడూ పేదల ప్రతినిధిగా ఉండాలని, సామాజికన్యాయం చేయాలని అనునిత్యం పరితపించిన వ్యక్తి అని తెలియజేస్తున్నాను. ఆయనతో తమరు కూడా ఉన్నారు అధ్యక్షా, ఆయన ఆలోచన విధానాన్ని ఎప్పటికప్పుడు గమనించారు.

దేశంలో మొట్టమొదటిసారి ఎస్సీలకు, ఎస్టీలకు యాభై శాతం ఇళ్లు రిజర్వేషన్ చేయాలని నిర్ణయించిన వ్యక్తి ఎన్టీ రామారావుగారు. గతంలో ఇల్లు కట్టుకోడానికి ఐదు వందల రూపాయలు ఇచ్చేవారు. ఆ డబ్బుతో గుడిసె వేస్తే ఎండ, వర్షం వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో తెలిసిందే. పేదవారు ఉండాల్సిన స్థలం శాశ్వత గృహాలని దేశంలో మొట్టమొదటిసారిగా శాశ్వతగృహ నిర్మాణాలు నిర్మించిన వ్యక్తి ఎన్టీ రామారావుగారు.

పేద పిల్లలు చదువుకోడానికి చాలా అవస్థలు పడుతున్నారు, అందులో ఎస్సీ, ఎస్టీ పిల్లలు ఇంకా ఎక్కువ అవస్థలు పడుతున్నారని మొట్టమొదటిసారి దేశంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టిన ఏకైక వ్యక్తి ఎన్టీ రామారావుగారు. ఈనాడు 190 స్కూల్స్ ఉన్నాయి. కార్పొరేట్ స్కూల్స్ టౌన్స్‌లో ఎకరా, రెండు ఎకరాల్లో ఉంటాయి. కానీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను పది, ఇరవై ఎకరాల్లో పెట్టి బ్రహ్మాండమైన భవనాలు కట్టి ఉత్తమ విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టిన వ్యక్తి ఎన్టీ రామారావుగారు.

గతంలో ఎస్సీల పట్ల వివక్ష ఉండేది. సభలో ఉండే సభ్యులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణాలో బాంచన్ నీకాళ్లు మొక్కుతా ఉండేది, ఎంత ఆశ్చర్యం వేస్తుందంటే వారికి అది తప్ప ఇంకొకటి తెలిసేది కాదు. దానిని మార్చడానికి నాకు చాలా సమయం పట్టింది. ఆనాడు ఎస్సీల కోసం పని చేసిన వ్యక్తి జస్టిస్ పున్నయ్యగారు దీక్షతో పని చేశారు. ఒక చట్టం తీసుకొచ్చాం. ఎస్సీలపై వివక్ష ఎలా ఉందంటే అగ్రవర్ణాలతో సమానంగా గ్రామాల్లో బావి దగ్గర ఎస్సీలు నీరు తీసుకోడానికి వీలు లేదు. ఊర్లో చెప్పులు వేసుకుని తిరగడానికి వీలు లేదు, చెప్పులు తీసేసి ఊరు దాటిన తరవాత చెప్పులు వేసుకునే పరిస్థితులు ఉండేవి. టీ బంకుల దగ్గర రెండు గ్లాసులు పెట్టి, అందులో ఒక గ్లాసు పక్కన పెడితే, ఇంకో గ్లాసులో టీ పోయించుకుని తాగి మరలా ఆ గ్లాసును కడిగి అక్కడ పెట్టి పోవాల్సిన పరిస్థితులు ఉండేవి. అంటరానితనం ఎంత పరాకాష్టలో ఉందో గుర్తుపెట్టుకోవాలి. ఎస్సీలకు దేవాలయాల్లో ప్రవేశం లేని పరిస్థితులు ఉండేవి.

ము.3.10

ఇలాంటివి చూసిన తరవాత నేను ఈ జీవోను తీసుకొచ్చాను. జస్టిస్ పున్నయ్య కమిషన్ 42 సిఫార్సులు ఇచ్చింది. జీవోలు, మెమోలు మొత్తం 27 జారీచేశాను. ఒక్క మాటలో చెప్పాలంటే కులవివక్షపై యుద్ధం చేసిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. మనుషుల్లో కరడుగట్టుకుపోయిన అహంభావంతో ఏమాత్రం ముందుకు వెళ్లలేని పరిస్థితి. G.O.Ms.No.105, dt:31-10-2011 "This team will interact with all sections of the people in the villages including SCs, STs and convince and persuade the upper caste people against the evil of untouchability in various forms and in whatever manner it is being practiced and also against atrocities against SCs and STs with special reference to the villages concerned. The team will lead the SCs and STs in the village temple, provide access to the public water sources and get the separate glasses for SCs system removed from the tea and coffee shops. The team should also tackle any other village level social evils or superstitions like Jogini, Basavi system, Banamati, Poturaju, Bonded labour, Manual scavenging".

మనిషిని మనిషిగా చూడలేని, అంగీకరించలేని పరిస్థితి. రాష్ట్రంలో ఎట్టిపరిస్థితుల్లో ఇలాంటివి ఉండడానికి వీలులేదని జస్టిస్ పున్నయ్యగారు ఇచ్చిన సిఫార్సులు అమలు చేయాలని నిర్ణయించుకుని 27 మెమోలను, జీవోలను జారీ చేశాం. జీ.ఓ.ఎం.ఎస్.నం.92లో జస్టిస్ పున్నయ్యగారు ఇచ్చిన రిపోర్టులోని అంశాలను యథాతథంగా అంగీకరించాం. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములన్నీ వేరేవాళ్లు కొట్టేసేవారు. ఐటీడీఏకి అధికారాలు ఇచ్చి గిరిజన భూములు వేరే వాళ్లు ఆక్రమించడానికి వీలు లేకుండా, ఆ భూములు గిరిజనులకే చెందాలని చట్టాన్ని తీసుకొచ్చి కచ్చితంగా అమలుచేశాం. జీ.ఓ.నం.694లో ఎస్సీలు, ఎస్టీల సమస్యలు పరిష్కరించడానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పరిష్కార సెల్స్ ఏర్పాటు చేశాం. జీ.ఓ.నం.105లో అధికారులందరూ ఎస్జీఓలు, తహశీల్దారు, ఎస్ఐతో కలిసి వారానికి ఒకసారి ఒక గ్రామానికి వెళ్లాలి. ఆ ఊరిలో ఎవరైనా అస్పృశ్యతకు పాల్పడితే ఎస్సీ అట్రాసిటీస్ యాక్ట్ కింద వాళ్లపై చర్యలు తీసుకుంటామని చాలా సార్లు చెప్పడమే కాకుండా గ్రామాలలో దండోరా వేయించేవారు. ఎక్కడన్నా కాఫీ షాపులో కానీ, టీ షాపులో కానీ రెండు గ్లాసులు ఉన్నాయా అని ఊళ్లో తిరిగి చూసేవారు. ఊరిలో బావుల దగ్గరకు వారు నీళ్లకు వస్తే తీసుకోనివ్వకుండా చేస్తున్నారా, దేవాలయాల్లోకి రానీయకుండా చేస్తున్నారా ఇలాంటివన్నీ పరిశీలించి కఠిన చర్యలు తీసుకునేలా చేశాం.

ఎస్సీలకు వ్యతిరేకంగా ఉన్న వివిధ అడ్డంకులను తొలగించడానికి ఇతర హిందువులు ముందుకు వచ్చి పోరాడితే, ఉద్యమాలు చేసి వారికి సహకరిస్తే జిల్లా స్థాయిలో ఐదుగురికి ₹10వేల చొప్పున అవార్డులు అప్పట్లోనే ఇచ్చేవాళ్లం. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సంస్థలకు ₹25వేల అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాం. అందరినీ కలుపుకుపోయేట్లు ప్రోత్సహించాం. కొన్ని ప్రాంతాల్లో, కొన్ని గ్రామాల్లో కొందరు అహంభావంతో ఇష్టానుసారంగా, మీరు ఎన్నైనా చెప్పండని కరడుగట్టిన విధానాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవి ఆచరించమంటే ఆ ప్రదేశాలను vulnerable placesగా, hotspotsగా ప్రకటించాం. అలా ప్రకటించిన ప్రాంతాలకు అధికార యంత్రాంగం మళ్లీ మళ్లీ వెళ్లడం, ఎవరైనా ఉల్లంఘన చేస్తే

వాళ్లపైన చర్యలు తీసుకోవడం మొదలుపెట్టాం. అదేమాదిరిగా ఎక్కడైనా ఎస్సీల మీద అత్యాచారం జరిగితే జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్, ఎస్పీ 24గంటలలోగా నేరుగా ఆ గ్రామానికి వెళ్లి వాళ్లను విచారించాలి. అలాంటి వ్యవస్థను తీసుకొచ్చాం. ప్రజల్లో అపోహలు కలిగించడానికి కాదు, వాళ్లలో మార్పు తేవడానికి పీస్ కమిటీలు వేశాం. పీస్ కమిటీలు ఏ ఊరికి ఆ ఊరు ప్రజలను కూర్చోబెట్టి ఇది మంచిది కాదు, ఇది సరైనది కాదు, మానవత్వంతో ముందుకు పోవాలని వారికి చెప్పాం.

ఒక్కోసారి ఎస్సీల వద్ద కోర్టుకు వెళ్లడానికి డబ్బులు ఉండవనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా ఎస్సీ అట్రాసిటీస్‌పై స్పెషల్ కోర్టులు ఏర్పాటుచేశాం. అదే సమయంలో మంచి లాయర్లను పెట్టి వాళ్ల కేసులన్నీ వాదించడానికి సహకరించాం. ప్రభుత్వమే ఇందుకైన ఖర్చంతా భరించింది. ప్రతి నెల రిపోర్టులు తెప్పించే వాళ్లం. మరోపక్క జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని వేసి రెవ్యూ చేశాం. మండల కమిటీలు కూడా వేశాం. మండల కమిటీలో ఎంపీడీఓ, ఎంపీపీ, ఎంఆర్ఓ, ఎస్సైలను సభ్యులుగా పెట్టి మొత్తం మానిటర్ చేశాం. మొత్తం 27 జీవోలు జారీ చేశాం. సోషల్ ఈక్వాలిటీ కోసం ఎక్కడికక్కడ క్యాంపులు పెట్టి ప్రజల్లో అవగాహన తీసుకొచ్చాం. రాష్ట్ర స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించి, వారు అన్ని జిల్లాలు పర్యటించేలా ఏర్పాటు చేశాం. ఎస్సీ అట్రాసిటీస్‌పై ఇచ్చే రిలీఫ్ ఆరోజు జస్టిస్ పున్నయ్య కమిషన్ ఆధారంగా ఇచ్చిన డబ్బులే తప్ప, తరవాత వచ్చిన ప్రభుత్వాలు అటూ ఇటూ పెంచాయి. ఎవరైనా వారి ఇల్లు పడగొడితే ఇల్లు కట్టించాలి, ఉద్యోగం ఇవ్వాలి, ఉపాధి చూపించాలి, దానికి అదనంగా ₹30వేలు వారికి ఆర్థిక సహాయం చెయ్యమని చెప్పిన ప్రభుత్వం మన తెలుగుదేశం ప్రభుత్వమని తెలియజేస్తున్నాను. రోడ్డుమీద నుంచి శ్మశానానికి వారిని వెళ్లనిచ్చేవారు కాదు. రోడ్డు మీద నుంచి శ్మశానానికి వెళ్లే దారిలో ఇతరుల పొలంలో నుంచి వెళ్లనివ్వకపోతే అవన్నీ ఎవిక్ట్ చేయించాం.

ప్రతి నెల 30వ తేదీన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని జరిపాం. ప్రతి ఒక్కరికీ హక్కులు ఉన్నాయని తెలియజెప్పే పౌరహక్కుల దినోత్సవాన్ని జరిపాం. గిరిజన భూముల్ని గిరిజనేతరులు ఎవరూ తీసుకోవడానికి లేదని చెప్పాం. ఎలాంటి ఇబ్బందులు లేని భూములన్నీ గిరిజనులకు ఇచ్చి పోడు వ్యవసాయానికి సహకరించాం. గిరిజన భూములకు హక్కులు కల్పించింది ఎన్టీరామారావుగారు. ప్రత్యేక చట్టంతో కొన్ని జీవోలు జారీ చేసి దాన్ని అమలుచేశాం. దాదాపు 27 జీవోలు జారీ చేశాం. ఇవన్నీ నేనే ఇచ్చానా అని నాకే ఆశ్చర్యమనిపిస్తుంది. చరిత్రను ఒకసారి చూస్తే తప్ప మనకు గుర్తు రాదు. ఆరోజు నేను చేసిన పనులు తల్చుకుంటే నాకు చాలా ఆనందం కలుగుతుంది. ఆరోజు నేను చేసిన పని ఈరోజు సోషల్ జస్టిస్ కోసం, అంటరానితనం నిర్మూలనకు బ్రహ్మాండంగా పని చేసినందుకు చాలా గర్వంగా, ఆనందంగా ఉంటుంది. నేను చేసింది సరైన పని. భగవంతుడు నాకు ఇచ్చిన అవకాశాన్ని సమాజం కోసం వినియోగించానని నాకు ఆనందం, తృప్తి కలుగుతుంది. ఒక్కోసారి కొన్ని అవకాశాలు వస్తాయి. కొంత మంది సద్వినియోగం చేసుకుంటారు, కొంత మంది చేసుకోలేరు.

మ.3.20

అధ్యక్షా, తూర్పుగోదావరిజిల్లాలో పుట్టిన వ్యక్తి జీఎంసీ బాలయోగిగారి ప్రతిభ చూసి మన ప్రభుత్వానికి, కేంద్రప్రభుత్వానికి సయోధ్య ఉండాలని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రులుగా అవకాశం ఇవ్వలేదు, కనీసం స్పీకర్‌గా అవకాశం ఇవ్వాలని, ఆనాటి ప్రభుత్వంలో ఉన్న వాజ్‌పేయ్‌గారిని రెక్వెస్టు చేసి లోక్‌సభ స్పీకర్‌గా మొట్టమొదటిసారిగా దళితుడ్ని నియమించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. ఆయన బ్రహ్మాండంగా రాణించారు.

గోదావరి ట్రైన్ దిగి నా దగ్గరకు వచ్చి ఫ్లైట్‌లో ఢిల్లీ వెళతానంటే వెళ్లమని చెప్పాను. ఆయన ఫ్లైట్‌లో ఉండగా వాజ్‌పేయ్‌గారు ఫోన్ చేసి గం.10.30నిమిషాలకి నామినేషన్ వేయాలని చెప్పారు. టైం అయిపోతుందంటే బాలయోగిగారికి ఇస్తున్నామని చెప్పాను. బాలయోగిగారు ఫ్లైట్‌లో ఉంటే కేంద్రంలో ఉన్న ఎర్రన్నాయుడుగారికి ఫోన్ చేసి పీఎమ్‌గారు ఫోన్ చేశారని, ట్రాఫిక్ అంతా క్లియర్‌చేసి ప్రత్యేక లైన్ కూడా ఇస్తారని, బాలయోగిగారు ఫ్లైట్ దిగిన వెంటనే నామినేషన్ వేయించమంటే కచ్చితంగా ఐదు నిమిషాల ముందు నామినేషన్ వేశారు. దళిత బిడ్డ బాలయోగిగారు బ్రహ్మాండంగా రాణించి దేశమంతా మెప్పించే స్థాయికి ఎదిగారని తెలుగుదేశం పార్టీ, తెలుగుగడ్డ గర్వపడుతుందని తెలియజేస్తున్నాను.

అంతేకాకుండా1999లో ఒక దళిత మహిళని స్పీకర్ చేస్తే ఏవిధంగా ఉంటుందో ఆలోచించి ప్రతిభా భారతిగారిని స్పీకర్‌గా నియమించాం. అప్పుడు మీరు కూడా మంత్రిగా ఉన్నారు. ఆరోజు మొదటిసారి దళిత మహిళను అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన ఘనత మన తెలుగుదేశం పార్టీకే దక్కింది. ఆ రెండే కాకుండా ఆరోజుల్లో ఎస్సీలు ఎక్కడా చీఫ్ సెక్రటరీ అవుతారని ఊహించుకోలేదు. ప్రపోజ్ చేసి కాకి మాధవరావుగారిని చీఫ్ సెక్రటరీగా నియమించాం. వారి పదవీ విరమణ తరవాత స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు కమిషనర్‌గా నియమించాం. ఎన్టీ రామారావుగారు నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా ఉన్నప్పుడు అంబేడ్కర్‌గారికి భారతరత్న వచ్చింది. ఆయన కృషి మనం ఎప్పుడూ మరచిపోలేమని మీకు తెలియజేస్తున్నాను.

ఎన్డీయే ప్రభుత్వంలో అంబేడ్కర్‌గారి ఫోటో ప్లార్లమెంటులో పెట్టారు. ఇవన్నీ జరిగినప్పుడు అందులో మనం కూడా భాగస్వాములమని ఆనందం కలుగుతుంది. నేను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నప్పుడు కె.ఆర్.నారాయణన్ గారిని ప్రపోజ్ చేసి ఎస్సీని రాష్ట్రపతి చేసిన ఘనత కూడా ఆరోజు తెలుగుదేశం పార్టీకే దక్కింది. అప్పుడు కాంగ్రెస్ కూడా సపోర్టు చేసే పరిస్థితికి వచ్చింది. అబ్దుల్ కలాం గారిని ఈ దేశం ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుంది. అలాంటి వ్యక్తిని వాజ్‌పేయ్‌గారి సహకారంతో ఎన్డీయే ప్రభుత్వంలో రాష్ట్రపతిని చేసిన ఘనత కూడా మనకే దక్కుతుంది. మన రోల్ ఉన్నందుకు గర్వపడుతున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీగారు కూడా రామ్‌నాథ్ కోవింద్‌గారిని షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని రాష్ట్రపతిగా నియమించారు. ఈరోజు దేశ రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ముగారిని నియమించారు. వీటిన్నంటిలో మనం భాగస్వాములైనందుకు నాకెంతో ఆనందంగా ఉంది. తెలుగుదేశం

పార్టీ, జనసేన పార్టీ, బీజేపీ ముగ్గురం కలసి ఎన్డీయే కూటమిగా అందరికీ సామాజిక న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నామని మరొకసారి గౌరవ సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

మనకు సెన్సస్ కావాలి. వాటి ఆధారంగా జిల్లాల వారీగా రిజర్వేషన్లు పెట్టవచ్చు. ఈరోజు మిశ్రా కమిషన్ కూడా Government may take a view on this at an appropriate time after conducting next census based upon national principles, quantifiable data, and *inter se* backwardness. సెన్సస్ రాగానే వాటి ఆధారంగా జిల్లా వారీగా పెట్టాలి. There have been requests to fix the percentage of reservations to the sub-classified groups by taking District as a Unit. There are 26 Districts in the State at present and the Commission would not like to make any announcement in this matter because there is no proper census. కాబట్టి ప్రాపర్ సెన్సెస్ వచ్చిన తరవాత న్యాయం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ఈ ప్రభుత్వంలో అందరికీ సామాజిక న్యాయం జరగాలని, అందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో మన ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలియజేస్తున్నాను. గడచిన ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఒక్క పైసా ఖర్చుపెట్టకపోతే సబ్‌ప్లాన్ పూర్తిగా రద్దయ్యే పరిస్థితి వచ్చింది. మన ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా ఎస్సీలకు ₹804కోట్లు ఖర్చుతో ₹340కోట్లు సబ్సిడీ ప్రభుత్వ గ్రాంట్‌తో ఎకనమిక్ సపోర్టు స్కీమ్స్ తీసుకొచ్చాం. 2014-19లో సబ్‌ప్లాన్ సమగ్రంగా అమలుచేశాం. మాల, మాదిగ సామాజికవర్గాలకు అప్పట్లోనే జనాభా దామాషా ప్రకారం అర్థిక వనరులు కూడా కేటాయించాం. ఈరోజు ఈ కార్యక్రమం వలన 22వేల మంది లబ్ధిపొందుతారు.

గతంలో నేషనల్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి ఒక పైసా తీసుకోకుండా, ఎస్సీ కార్పొరేషన్ క్లోజ్ చేసే పరిస్థితికి తెచ్చారు. బకాయిలు పెట్టి వెళ్లిపోతే, మనకు డబ్బులు ఇవ్వనంటే ఐదు సంవత్సరాల్లో పాత బకాయిలు చెలిస్తామని ఎంవోయూ కుదుర్చుకుని వారికి డబ్బులు కట్టి మరలా క్రమబద్ధీకరించాం. దాని వలన చాలావరకు ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగే పరిస్థితి వస్తుంది. మాల, మాదిగ సామాజికవర్గాలకు చెందిన వారిని అర్థికంగా పైకి తీసుకువచ్చే కార్యక్రమాలు చేపట్టాలని గౌరవ సభ్యులు కోరారు. ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఒకోసారి వారి కులవృత్తులకు కొన్ని పనులు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఏమి చేయాలో ఆలోచించి తప్పకుండా వారికి న్యాయం చేయడానికి శ్రీకారం చుడతామని మాల, మాదిగ, రెల్లి సామాజికవర్గాలకు, బుడగజంగాలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. బుడగజంగాలు ఎక్కడికి వెళ్లినా వాళ్ల బాధలు చెప్పుకోవడానికి వస్తారు. వారిది ఒక విచిత్రమైన సమస్య. మనం మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్నప్పుడు 1950 రాజ్యాంగం ఉత్తర్వుల ప్రకారం పూర్వపు మద్రాసు రాష్ట్రం వాళ్లను షెడ్యూల్డ్ కులాలలోకి చేర్చలేదు. కానీ పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి చేర్చారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జాబితా ఆర్డర్ నం.56లో బేడజంగం కులాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతంలోని పది జిల్లాలకు మాత్రమే చూపించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉత్తర్వుల చట్టం, 1976 ప్రకారం బేడజంగం కులానికి ఎటువంటి ప్రాంత పరిమితి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సమైక్యాంధ్రప్రదేశ్ మొత్తం వర్తింపజేసి ఎస్సీలో చేర్చారు. 2002లో 1976

రాజ్యాంగ సవరణ ఉత్తర్వుల ద్వారా రద్దుచేశారు. దాని ద్వారా తెలంగాణ ప్రాంతంలోని జిల్లాలకు చెందిన బేడజంగం కులాలు మాత్రమే ఎస్సీ హోదా పొందేందుకు అర్హులని ఉత్తర్వులిచ్చారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించిన సమయంలో బేడజంగం కులాన్ని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల జాబితా నుండి తొలగించినట్లు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014లోని ఐదవ షెడ్యూల్‌లో 28 ద్వారా ప్రకటించారు.

మ.03.30

అధ్యక్షా, పాపం వారు బీసీలలో, ఎస్సీలలో ఎక్కడా లేరు. కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారు. అందుకు ఐఏఎస్ అధికారి జే.సి.శర్మ అధ్యక్షతన వన్ మ్యాన్ కమిషన్ వేస్తే అప్పట్లోనే ఒక నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ప్రకారం కొంతవరకు ముందుకు వెళ్లాం కానీ చేయాల్సింది ఇంకా ఉంది. ఈ సభలో ఒక ప్రత్యేకమైన తీర్మానం ప్రవేశపెడుతున్నాను. బుడగ జంగం కులాన్ని ఎస్సీలలో చేర్చడానికి తీర్మానం చేసి కేంద్రానికి పంపించి కేంద్రాన్ని ఒప్పించడానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తాం. అదే సమయంలో బుడగ జంగం కులస్తులు చాలా తక్కువ మందే ఉన్నారు కాబట్టి వారిని ఎస్సీలలో "ఏ" గ్రూపులో చేర్చవచు. ఏ గ్రూపులో ఆ ఫ్లెక్సిబిలిటీ పెట్టాం. కాబట్టి వీరిని ఏ గ్రూపులో పెట్టేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇస్తూ ఈ తీర్మానాన్ని అందరూ ఏకగ్రీవంగా బలపరచి ఆమోదించాలని కోరుతున్నాను.

MR.SPEAKER: Now, I request the Chief Minister to move the Resolution.

SRI NARA CHANDRABABU NAIDU: Sir, I move the Resolution.

MR.SPEAKER: Resolution moved.

REQUESTING THE GOVERNMENT OF INDIA FOR INCLUSION OF THE BEDA (BUDGA) JANGAM COMMUNITY AGAIN IN THE LIST OF SCHEDULED CASTES OF ANDHRA PRADESH.

RESOLUTION OF THE ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY
DATED: 20.03.2025

Year	Activity
1950	The Beda (Budga) Jangam caste was not included in the list of Scheduled Castes of the erstwhile Madras State as per the Constitution (Scheduled Castes) Order, 1950. But it was included in the list of Scheduled Castes of erstwhile Hyderabad State.
1956	In the Scheduled Castes and Scheduled Tribes List (Modification) Order 1956, the Beda (Budga) Jangam was shown in the list of Scheduled Castes of the (10) Districts of Telangana region of Andhra Pradesh.
1976	As per the Scheduled Castes and Scheduled Tribes Orders (Amendment) Act, 1976 (in Short Act No.108 of 1976), there is no area restriction for the Beda (Budga) Jangam caste and this community was included in the SCs list throughout the State of Andhra Pradesh.
2002	Amendment of 1976 was nullified by the Constitution (Scheduled Castes) Orders

	(2nd Amendment) Act. 2002 (Act. No.61 of 2002), by which the Beda (Budga) Jangam caste people of (10) districts of Telangana region are only eligible to claim the status of SCs.
